# గాలిసంకెళ్ళు

నవల

- కొత్తావకాయ



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 81

# ప్రారంభం

**నీవుండ బట్టి, యీ ప్రపంచమింత సుందరమూ, హృదయాకర్షకమూను. కాకపోతే యీ లోకానికీ నాకూ సంబంధమేమిటి? లోహపు బిళ్ళల్నీ, నీతిప్రతిష్టల్నీ ఆరాధించే యీ ప్రజలతో నాకు సాపత్యమేమిటి?**

**~ చలం**

***

" **హే.. రాత్రి ఆకాశంలో జెమినీడ్స్ కనిపించాయ్.** ఈ వారమంతా కనిపిస్తాయ్. వీకెండ్ వస్తావా.. చూద్దాం."

"నీ నక్షత్ర వీక్షణం దొంగల్తోలా! ఎవరైనా భోజనానికొస్తావా అని పిలుస్తారు. నువ్వేంటి తల్లీ.. చుక్కలు చూపిస్తా రమ్మంటావూ!"

"భోజనందేముందిలెద్దూ! సీమ వండినంత బాగా నేనెలాగూ వండలేను. ఇంట్లో తినేసి అర్ధరాత్రికి వచ్చేస్తే చూద్దాం."

"ఊ.."

"నీకు ఆకాశంలో దీపావళి చూపిస్తాను."

"అలాగే.."

"చుక్కలు చూపించడం కాదు. చుక్కలు రాలడం చూపిస్తాను. అది కాదు వంశీ.. ఎన్నో వందల వేల కిలో మీటర్స్ ప్రయాణం చేస్తూ, దారిలో మనం ఉండడం వల్ల.. మనింటిముందు ఆగి పలకరించినట్టు.. మన వాతావరణంలోకి చొచ్చుకుని రాగానే భగ్గుమంటాయ్. యూనివర్స్ మనతో జరుపుకునే దీపావళి తెలుసా!"

"మహతీ.. "

"కళ్ళ కి విందు వంశీ.. ఉండుండీ అలా చుక్కలు రాలుతూంటే హాఛ్.. గంటలు నిముషాల్లా గడిచిపోతాయ్ తెలుసా!"

"డిసెంబరుదయాలు నాలా ఇలా రోడ్డున పడి గడపడమే వెర్రని జనాలు నవ్వుకుంటున్నారు. అర్ధరాత్రి అంకమ్మ శివాలు కూడానా! జలుబు చెయ్యక ఇంకేమవుతుందీ! జ్వరమొస్తుంది మంచులో గంటలు గంటలు కూర్చుంటే. " విసుక్కున్నాడు.

"అబ్బా.. మొక్కమొలిచిపోం లెద్దూ..! అయినా ఎవరూ అనేదీ! ఇంతకీ వస్తున్నావా లేదా? సీమ ని తీసుకురా. చాలా రోజులయ్యింది కలిసి."

"అలాగేలే. మధ్యాహ్నం మాట్లాడుకుందాం. బై.."

"ఎన్ని గం..."

"బై బై.. మెసేజ్ చేస్తా.. బై" లైన్ కట్ చేసి ఇన్ కమింగ్ కాల్ ఆన్సర్ చేసాడు వంశీ. ముక్తసరిగా ఊ కొట్టి వడివడిగా ఇంటిదారి పట్టాడు.

ఎవరింట్లోనో లీలగా "అచ్యుతః ప్రథితః ప్రాణః ప్రాణదో వాసవానుజః.." సుబ్బులక్ష్మి వల్లెవేస్తోంది. గువ్వలా ముడుచుకున్న నగరం కళ్ళిప్పి చూస్తోంది. పశువులూ పక్షులూ కనిపించని కాస్మోపాలిటన్ వాతావరణానికి కాస్త దూరంగా తెలవారుఝామున సహస్రనామం, వాకిలి చిమ్ముతున్న చీపురు శబ్దం, కూరగాయలమ్మే వారి కేకలూ ఇంకా పూర్తిగా మాయమవని వీధుల్లో అతడు చకచకా నడుస్తున్నాడు. ఆరడుగులకి కాస్త తక్కువ పొడవు, చామనచాయ.. ట్రాక్ పేంట్స్, మామిడిచిగురు రంగు స్వెటర్.. మెత్తగా శబ్దం చేస్తున్న షూస్. వెనుక నుంచి విశాలంగా కనిపిస్తున్న వెన్ను. తల కొద్దిగా వంచి నడుస్తున్న అతని ఆలోచనల్లో శూన్యం. ***ఒక్కోసారి ఏదో లేదన్న వెలితికంటే, ఏముండాలో తెలియనితనమే లోటుగా ఉంటుంది.*** వీధిలో నాలుగో ఇంటి గేట్ తెరుస్తూ జేబులోంచి సెల్ ఫోన్ తీసి కాల్ లాగ్ చెరిపేసాడు. గేట్ మూసి కుండీల్లో పెరుగుతున్న గులాబీ మొక్కల్ని చూస్తూ లోపలికి నడిచాడు.

హాల్లో నిశ్శబ్దం. వంగి షూ లేస్ విప్పుతూ తలెత్తి చూడగానే దూరంగా ఓ మూలనున్న పుస్తకాల అలమర, దాని పక్కన వర్క్ స్టేషన్.. పలకరించాయి. ఆ ఇంట్లో ఉదయం పూట వస్తువులే పలకరిస్తాయి. "మెయిల్ చెక్ చేసుకోవాలి" అనుకుంటూ షూస్ స్టాండ్ లో పెట్టి, గుమ్మంలో పడున్న పేపర్ అందుకుని హెడ్ లైన్స్ అయినా చూడకుండా లోపలికొచ్చి టీపాయ్ మీదకి నిరాసక్తంగా గిరాటేసాడు. ఎన్నో యేళ్ళపాటు తన ఉదయాలలో భాగమైపోయిన న్యూస్ పేపర్ ఓనాడు హఠాత్తుగా వెగటనిపించింది వంశీకి. తప్పించుకున్న అలవాటది. వంటింట్లోకి వెళ్తూన్న దారిలో హాల్ ని, డైనింగ్ ఏరియాతో వేరుచేసే గవ్వల కర్టెన్ గలగల్లాడుతూ తాకింది. స్టౌ ఆన్ చేసి పాలు కాస్తూ ప్లాట్ ఫాం కి కుడివైపున్న కిటికీలోంచి బయటికి చూస్తూ నిలబడ్డాడు. ఆవులిస్తూ సందు వైపున్న తలుపు తీస్తున్న పక్కింటావిడని చూడగానే "వంషీ.. షీమా ఉందా?" అంటూ చూపంతా గులాబీ మొక్కలకి అతికిస్తూ గేటు తోసుకుని లోపలికి వచ్చే ఆవిడ గొంతు గుర్తొచ్చింది. పెద్ద గ్లాస్ లో కాగిన పాలు పోసుకుని, పంచదార కలుపుని ఊదుకుంటూ హాల్లోకి వచ్చాడు. లేప్టాప్ ఆన్ చేసేలోగా పుస్తకాల అలమర ఆప్యాయంగా పిలిచింది. నిలువుగా పేర్చిన పుస్తకాలపై ఉన్న ఖాళీలో అడ్డుగా కొన్ని పుస్తకాలు దొంతి పెట్టి ఉన్నాయి. "రెండు.. మూ.. నాలుగూ.." లెక్కపెడుతున్నాడు బయటికే. చదువుతున్న పుస్తకాలు గుర్తు తెలియడంకోసం అలా విడిగా పెట్టుకున్నాడు. పాల గ్లాస్ టేబుల్ మీద పెట్టి ఆఫీస్ మెయిల్ చెక్ చేసుకుని, పర్సనల్ మెయిల్ లాగిన్ అయ్యాడు. ఇన్ బాక్స్ లో క్రితం రోజునుంచీ పడున్న అపార్ట్మెంట్ వాడి మంత్లీ న్యూస్ లెటర్ ఓపెన్ చేసి చూసి డిలీట్ నొక్కబోతూ ఆగాడు. సీమకి పంపేస్తే ఓ పనైపోతుంది. ఫేస్ బుక్ నోటిఫికేషన్స్.. బోర్.. డిలీట్. చైన్ మెయిల్స్ లో ఫ్రెండ్స్ చెప్పుకున్న కబుర్లు చదివి తన వంతుగా ఓ స్మైలీ

ప్రసాదించి కుర్చీలో వెనక్కి వాలాడు.

"వస్తున్నావ్ కదా.." పాపప్ అయింది చాట్ విండో. మహతి..

"లంచ్ లో మాట్లాడుకుందాం" అని టైప్ చెయ్యబోతూ ఆగిపోయాడు. పొడవుగా దృఢంగా ఉండే ఆ వేళ్ళు క్షణకాలం కీ బోర్డ్ మీద తారట్లాడాయి.

"On call. Shall ping you later. "

ఒక్క క్షణం ఆగి "K. Did you get friend request from Gowtami?" అడిగింది మహతి.

వంశీ సమాధానమివ్వలేదు.

మహతిని ఆపడం కష్టం. ఆకాశం లోంచి రాలే చుక్కని ఆపడం ఎంత అసాధ్యమో, మహతి అనుకున్నది చెయ్యకుండా, కనీసం చెప్పనివ్వకుండా ఆపడమూ అంతే అసాధ్యం. ఎదుటివారి స్పేస్ లోకి చొచ్చుకొచ్చేసి గలగల్లాడుతూ బోలెడు కబుర్లు. అవీ తనవే.. చెప్పేసి, వెళ్తూ ఓ నిశబ్దాన్ని వదిలి, పెదాలపై ఓ చిన్న సంతోషపు మెరుపుని పూసే మనుషులు బహు తక్కువ మంది ఉంటారు. మహతి లాంటి వాళ్ళు . "పోనీ.. శుక్రవారం రాత్రి వెళ్తే!" కళ్ళు స్క్రీన్ కుడివైపు చివరకి కర్సర్ వెంట కదిలి చూసాయి. ఇవాళ బుధవారం. "ఈ రెండ్రోజుల్లో సీమ మూడ్ ఎలా ఉంటుందో దాన్ని బట్టి" అనుకుంటూ మేడ మీద నుండి అలికిడి ఉందేమో అని చూసాడు. ఫోన్ తీసి అమ్మకి కాల్ చేసి మాట్లాడనారంభించాడు.

"ఊ.. చెప్పమ్మా. ఇందాకా వాక్ కి వెళ్ళాను."

"..."

"లేదు. లేచాక చెప్తాను. అయినా ఇంకా టైముంది కదా!"

"...."

" వస్తాంలేమ్మా.. పండక్కి పదిరోజులు సెలవులుండడానికి నాదేవైనా మీ ఆయన్లా బడిపంతులుజ్జోగమా!"

"...."

"పద్మెలా ఉంది? నే మాట్లాడి వారమవుతోంది. వాళ్ళాయన కూడా వస్తాడటనా?"

"....."

"నాకూ రావాలనే ఉందమ్మా. చెప్తాలే నాల్రోజుల్లో. సరేనా?"

ఆలోచిస్తూ పాలగ్లాస్ అంచు కొరికాడో క్షణం. పద్మని చూసి ఆరునెలలపైనే అవుతోంది. సీమ వస్తే బాగుండును. ఛా.. సిల్లీగా ఇలాంటి సమస్యలేంటీ! తల విదిల్చి పాలు పూర్తి చేస్తూ కేలండర్ చూసి, మీటింగ్స్ లెక్కవేసుకుని లంచ్ టైం బ్లాక్ చేసాడు. పచ్చగా వెలుగుతున్న మహతి స్టేటస్ లైన్ చూసి నవ్వుకున్నాడు. "Excited to watch the spectacular pollution-free fire works!! Night Sky, Here I come! Let the Geminids shower love and prosperity to us Earthlings!" పింగ్ చెయ్యబోయి ఆగి మెయిల్ చేసాడు. లంచ్ కి పాండీ కేఫ్ లో కలుద్దామని. క్షణంలో "Sure, Dude!" అని రిప్లై పంపేసింది. అరగంట సేపు కదలకుండా కూర్చుని మీటింగ్స్ కి కావలసిన నోట్స్ ప్రిపేర్ చేసుకుని, మెయిల్స్ పంపి స్నానానికి లేచాడు.

మెట్లెక్కి తన గదిలో బాత్రూమ్ లోకి వెళ్ళి గీజర్ ఆన్ చేస్తూండగా అలికిడైంది. టవల్ భుజాన వేసుకుని బయటికి వచ్చి కిందకి చూసాడు. మెట్లు దిగి కిందకి వెళ్తూ సీమ. ఎర్రటి సిల్క్ నైట్ డ్రస్ లో అందమైన సీమ. మెట్లకి అభిముఖంగా ఉన్న రిక్లైనింగ్ చెయిర్ లో కూర్చుని పేపర్ తిరగేస్తోంది. నిద్రకి కొద్దిగా ఉబ్బిన కళ్ళు , విరబోసుకున్న పొడవాటి జుత్తు. నెయిల్ కలర్ వేసిన ఎర్రటి గోళ్ళు .. బోలెడు నెత్తుటి వార్తల్లో, నెత్తుటి కూడు తింటున్న వారి వార్తల్లో మోసుకొచ్చిన న్యూస్ పేపర్ ని పట్టుకున్నాయ్. బాత్ రూమ్ లోకి వెళ్తూ సీమ చేతి గోళ్ళ ని మరోసారి చూస్తూ పెదాలు విడకుండా గొణిగాడు. ***"నా యెడద చీల్చి రక్తమండలము చేసె, నేను వేదనతో మరణించినాడ, ఇపుడు గోళ్ళకు నెరుపురంగెట్టులెక్కు.. వెలది తాను గోరింటాకు పెట్టకున్న?"*** గాలిబా.. గాలిబా..ఎంతమంది ఆడపిల్లల అందమైన గోళ్ళు సరిగా ఉపయోగపడుతున్నాయ్..? గుండెల్ని చీల్చడానికో, డబ్బా మూతలు తీయడానికో, ముందుకు జారని ముంగురులని సవరించుకోడానికో, రెవ్లాన్, ఎల్ ఎయిటీన్ కంపెనీలు బతకడానికో కాకుండా!

***

"పండక్కి పద్మొస్తోందట. వెళ్దామా?" అడగబోయి తమాయించుకున్నాడు. ఫస్ట్ థింగ్స్ ఫస్ట్!

"వీకెండ్ మహతి రమ్మంది." చెప్పాడు.

"దేనికీ? పెళ్ళి చేసుకుంటోందటా!" కోయిల పాటలో అపభ్రంశపు సాహిత్యం.

"ఊరికే.. హేంగౌట్."

"అర్ధరాత్రి దాటాక ఆకాశంలోకి చూడ్డమేగా! చాల్చాలు. అయినా ఆ పిల్ల పెళ్ళీ పెటాకులూ మానేసి దేశాన్నేం ఉద్ధరిస్తుందటా.. పెద్ద సైంటిస్ట్ లా పోజు."

"పెళ్ళి చేసుకు ఉద్ధరించేస్తున్నవారు చాల్లే.. పోనీ తననే రమ్మందాం"

"అక్కర్లేదు. నీకేంటంత ఇంట్రెస్ట్? ఉద్ధరిస్తున్నావుగా నన్నూ. ఇంకెందరు కావాలేం!"

"సీమా.."

"ఓయబ్బో.. " మిగిలిన మాటలు వంశీ చెవిన పడలేదు.

లేప్టాప్ బేగ్ లో పెట్టుకుంటూండగా వచ్చింది సీమ. ఎదురుగా నిలబడి చెప్పింది "నాకిష్టం లేదు వంశీ.."

"మహతి చిన్నప్పటి ఫ్రెండ్. అపార్ధం చేసుకుంటే నేనేం చెయ్యలేనింక." చార్జర్ చుడుతూ కళ్ళెత్తకుండా చెప్పాడు.

"అపార్ధం కాదు. ఎందుకో నచ్చదు."

"పోన్లే.. అమ్మ పండక్కి రమ్మంది. ఎప్పుడెళ్దాం? లీవ్ అప్లై చెయ్యాలిగా.."

"సంగీతా వాళ్ళతో లక్ష్మీపురం వెళ్దాం."

"పండక్కి అమ్మ రమ్మంది. పద్మొస్తోందట. ఎప్పుడెళ్దాం?"

"రెట్టిస్తున్నావేంటీ.. హా.. అక్కడికి వెళ్తే ఏమవుతుందో నీకు తెలీదా? నన్నో గయ్యాళిని చేద్దామని పంతం పడుతున్నావ్. మునివేళ్ళ మీద నిలబడి జీ హుజూర్ అనడం నాకు చిరాకు. నేన్రాను."

"సరే.. పద్మని చూసేసొస్తాను. రెండు రోజులు."

"ఇంట్లో పెళ్ళాం నొక్కర్తినీ వదిలేసి వెళ్తావా? అదీ పండగ పూటా! ఐనా తెల్లారిందగ్గర్నుంచీ మాట్లాడుకుంటారు చాలదా? ఇదిగో.. ఉదయాన్నే లేండ్ లైన్ కి ఫోన్ చెయ్యొద్దని చెప్పు. నాకు సడెన్ గా లేస్తే తలనొప్పొస్తుంది."

"...." ప్రశాంతమైన ఉదయపునడకని భగ్నం చేసిన చిరాకు ఫోన్ కాల్ లో నిద్రమత్తు కోయిల పలికిన కర్కశపు మాటలు గుర్తొచ్చాయ్ వంశీకి.

"మొండివాడు రాజుకన్నా బలవంతుడనీ.. మాట్లాడకుండా సాధిస్తావ్. రమ్మను ఆ పిల్లని. ఊరెళ్ళడం మాత్రం కుదర్దు."

"ఏడవుతుంది వచ్చేసరికి. కార్ కావాలా నీకు?" కుడికాలు పైకెత్తి సాక్స్ వేసుకుంటూ అడిగాడు.

"నాకేం తెలుసూ.. వదిలేసి వెళ్ళు . లంచ్ కి రా. ఒక్కర్తినీ తినాలంటే బోర్."

"లంచ్ టైమ్లో మీటింగుంది. ఎప్పుడైతే అప్పుడు ఏదో ఒకటి తినేస్తాను. నువ్వు చూడకు." రెండువేల నూట నాలుగు.. బయటకు నడుస్తూ లెక్కెట్టుకున్నాడు. అబద్ధానికో ఆడపిల్ల పుట్టేస్తే..! సన్నగా నవ్వొచ్చి నిలిచిపోయింది పెదాల మీద.

బైక్ కిక్ కొడుతూ లోపలికి చూసాడు. టీవీ డ్యూటీ మొదలయ్యింది.

***

దోసె తుంపి చేత్తో పట్టుకుని ఫోన్ ఆన్సర్ చేసింది మహతి. అర్ధం కాని సైన్స్ భాషలో రెండు నిముషాలు మాట్లాడేసి కట్ చేస్తూ, "చెప్పు

వంశీ, సారీ సారీ. లంచ్ టైం లో కలుస్తానని నా సీనియర్ కి చెప్పాను. ఓ చిన్న డిస్కషన్ ఉంటేనూ.. రమ్మన్నాను. మర్చిపోయాను నోట్ చేసుకోవడం. ఇప్పుడు గుర్తు చేస్తున్నాడు. విషయం చెప్పేసాన్లే. సాయంత్రం మాట్లాడతానన్నా. ఇంతకీ ప్లై డే కుదరదంటావ్?" వేలికంటిన చట్నీ నాలిక్కి రాసుకుంటూ అడిగింది.

"ఊ.. ఫ్రెండ్స్ ఎప్పటి నుంచో వస్తామంటున్నారు. సీమ ఆరోజు రమ్మందట. ఇప్పుడు మార్చలేను కదా. పోనీ నువ్వే రాకూడదూ!" కాదనాలని గాఢంగా కోరుకుంటూ అనేసాడు.

"లేదులే వంశీ. నేను నీకే బోర్ కొట్టించేస్తానూ. ఇంక తెలియనివాళ్ళతో నాకు కుదరదులే. సీమ కూడా అనేసింది కదూ ఆ రోజు. సైన్సంటే చిన్నప్పుడే బోరనుకున్నాను. సైంటిస్టుల వలన బోర్ ఇంకా తప్పలేదు నాకూ అని. ప్చ్. వచ్చే ఏడాది చూపిస్తానులే జెమినిడ్స్. అయినా నా మతిమండినట్టే ఉంది. నువ్వు మీ మేడ మీద, నేను మా ఇంటి మీదా చూడకూడదా ఏం? మరీ ఎక్సైట్ అయిపోయా నిన్ను రమ్మన్నానంతే!" కల్మషం లేని మాటలు వింటే గుండెల్లో చిన్న ఇబ్బంది. వంశీ కుర్చీలో కుదురుగా కూర్చోలేక కదిలాడు.

"హేయ్.. ఉదయం అడిగితే నువ్వు నో అన్నావు. గౌతమి నీకు రిక్వెస్ట్ పంపానని చెప్పిందే."

"ఏ గౌతమి మహతీ?" పరధ్యానంగా అడిగాడు.

"గౌతమి.. రాచకొండ గౌతమి. గుర్తులేదూ మన ట్యూషన్ లో ఉండేది. సన్నగా నల్లగా ఉంటుందీ.."

"సన్నగా నల్లగా.. ఏం చెప్పావసలు! భలే గుర్తొచ్చేసిందనుకో!"

"అబ్బ.. అలా కాదు వంశీ.. నీకెలా చెప్తే గుర్తొస్తుందీ.. ఆ.. వాళ్ళింటి ముందు ఎర్రజాంకాయల చెట్టుండేదీ. సా మిల్ ఉండే సందులో చివరి ఇల్లు.. గుర్తొచ్చిందా?"

"ప్చ్.. ఇల్లు గుర్తుంది కానీ మొహం గుర్తురావడం లేదు."

"సరేలే.. నా లిస్ట్ లో ఉంది. వెతికి చూడు. ఎన్నేళ్ళకి కలిసామో కదా! రెండు గంటలు మాట్లాడుకున్నాం నిన్న రాత్రి. చెప్తాలే తరువాత. నాకు టైం అయింది. బయలుదేరుతానింక. సీమ కి హాయ్ చెప్పానని చెప్పు." లేచి హేండ్ బేగ్ భుజానికి వేసుకుని టేబుల్ మీదున్న ఖాళీ ప్లేట్ లో తన వాటా డబ్బులు వేసేసి భుజం మీదో చరుపు చరిచేసి పరుగు పెట్టింది. వెయిటర్ తెచ్చిన బిల్ చూసి డబ్బులిచ్చి లేచాడు వంశీ.

రద్దీగా ఉన్న బజార్ దాటి ఆఫీస్ వైపుకి మెయిన్ రోడ్ ఎక్కగానే టక్కున గుర్తొచ్చింది. "నీకెన్ని సార్లు చెప్పినా అలా చెప్పులీడుస్తూ నడుస్తావేం? అలా నడిస్తే మాతో రాకు." పరధ్యానంగా నడుస్తున్న వంశీతో కచ్చితంగా చెప్పేసి మహతినీ, వాసునీ చెరో చేత్తో లాక్కెళ్ళినట్టుగా శంభుమూర్తి మేష్టారింటికి చకచకా నడుచుకెళ్ళిపోయిన గౌతమి!

# 2

**షవర్ కింద అరగంట పైన గడిపి స్నానం ముగించి,** మెరూన్ టర్కిష్ టవల్ చుట్టుకుని వచ్చి అద్దం ముందు నిలబడింది సీమ. ఆవిరి కమ్మేసిన అద్దాన్ని హేండ్ టవల్ తో తుడిచి, కళ్ళు చికిలించి తనను తాను పరిశీలనగా చూసుకుంది. పక్కనే ఉన్న హేండ్ మిర్రర్ తీసుకు తుడిచి మొహం చూసుకుంటూ కుడి బుగ్గకి ఎగువన కనిపిస్తున్న చిన్న మచ్చని వేలితో తడుముకుంది. బాత్రూమ్ లోంచి గదిలోకి నడిచి. నీలిరంగు చుడీదార్ వేసుకుని, టవల్తో తల తుడుచుకుంటూ బాల్కనీ వైపు వెళ్ళి నిలబడింది. బాల్కనీకి బిగించి ఉన్న ఇనుప కటకటాలకి పాకడానికి ఇప్పుడిప్పుడే ప్రయత్నం చేస్తున్న తెల్ల పువ్వుల బోగన్ విల్లా సీమని తొంగిచూస్తోంది. కిందకి చూసిన సీమకి పక్కింటామె సందులో నిలబడి ఎవరితోనో బాతాఖానీ వెయ్యడం కనిపించింది. వెంటనే గదిలోకి వెళ్ళి డ్రసింగ్ టేబుల్ మీదున్న మొబైల్ లో మోగుతున్న ఎఫ్ ఎమ్ రేడియో కట్టేసింది. మళ్ళీ బాల్కనీలోకి వచ్చి దీక్షగా వింటే.. అస్పష్టంగా మాటలు! కటకటాలకి దగ్గరగా నిలబడి వినడానికి ప్రయత్నించింది. ఉహూ.. ప్రయోజనం లేదు. మొబైల్ అందుకుని చకచకా మెట్లు దిగి, మూసి ఉన్న సందు వైపు తలుపు వెనకాతల నిలబడింది.

".. ఇంకెంతా పదిహేను రోజుల్లో ఇట్టే.. అవునవును... తప్పు.. " మాటలాగిపోయాయ్.

కనుబొమలు ముడివేసి హాల్లోకి వచ్చి సోఫాలో పడున్న రిమోట్ అందుకుని టీవీ ఆన్ చేసింది. వంటింట్లోకి నడిచి దేవుడి మందిరంలో దీపం వెలిగించి, దండం పెట్టుకుంది. అగరుబత్తులు రెండు తీసుకుని వెలిగించింది. మరో నాలుగు అగరుబత్తులు వెలిగించి, పొడవుగా స్కేల్ లా ఉన్న చెక్క స్టాండ్ లో ఒక చివర ఉన్న రంధ్రంలో గుచ్చి హాల్లో గోడకి ఆన్చి ఉన్న టేబుల్ మీద పెట్టింది. సుడులు తిరుగుతున్న సుగంధాన్ని ఓసారి పీల్చుకుని, కిచెన్ లోకి వెళ్ళింది. ఫ్రిజ్ లోంచి బీన్స్ తీసి తరుగుతూ.. "ఇంకా పదిహేను రోజుల్లో.. ఏం ఉంది? పండగ..? ఊ.. పండగే!! నేను ఊరికి వెళ్ళనన్నానని అప్పుడే ఈవిడకి తెలిసిపోయిందా? వంశీ.. ? చెప్పడు. ఇంకెవరూ? ఆవిడే!! శకుంతలమ్మ గారు. మహాతల్లి. కిందటి సారి వచ్చినప్పుడు సందులోనే కాపురం పెట్టింది కదా! ఇరుగూపొరుగుతో సఖ్యంగా ఉండాలని నాకు బోధలూ..! ఈ పక్కింటి ముండ ఫోన్ నంబర్ తీసుకునే ఉంటుంది. వార్నీ! ఉదయం రానన్నానని అప్పుడే ఇతగాడు వాళ్ళమ్మకి చేరేసేసాడన్నమాట. కూటం కూటమంతా నామీద పగబట్టారు." ఆలోచనల్లో సీమ మనసు వికలమైపోయింది.

ఇంతలో మోగుతున్న టీవీ ఆగిపోయింది. నిశబ్దం.. పవర్ కట్. వెంటనే మొబైల్ లో రేడియో ఆన్ చేసి పెట్టింది. ఓ క్షణమాలోచించి రేడియో ఆఫ్ చేసి, వంశీకి కాల్ చేసింది.

"ఉదయం మీ అమ్మకి ఫోన్ చేసావా?"

"నువ్వే చెప్పావు కదా.. ఉదయాన్నే ఆవిడ చేసిందని. కాల్ రిటన్ చేసాను." చెప్పాడు వంశీ.

"నేను రానన్నానని చెప్పేసావా?"

"లేదింకా."

"అబద్ధం..!! చెప్పకుండా ఉంటావా? ఆవిడ అడక్కుండా ఉంటుందా?"

"లేదు సీమా. సాయంత్రం మాట్లాడుకుందాం. మీటింగ్ ఉంది."

"పక్కింటావిడ దాకా పాకేసింది విషయం."

"పక్కింటావిడా? ఏమంది? "అయోమయంగా అడిగాడు.

"ఏమందో నీకు తెలీదా? అయినా నాకు రావాలని లేదంటే దాన్ని ఇంత రాద్ధాంతం చేస్తారా?" గొంతు పెంచింది.

"అబ్బా.. ఎవరు చేసారు? అడిగాను. రానన్నావు. There ends the matter! ఈ పక్కింటామె గోలేంటీ మధ్యలో?"

"ఏమో నీకూ, మీ అమ్మ మహాతల్లికే తెలియాలి. ఈ పక్కింటిదప్పుడే నా గురించి ఊరు ఊరంతా చెప్తోంది. నేను విన్నాను."

"సీమా.. ఇలాంటి పెట్టీ మేటర్స్ నా దాకా తెచ్చి ఆఫీస్ టైం లో ఏంటిది? అయినా నేను ఇంకా అమ్మకి చెప్పలేదు మనం వెళ్ళట్లేదని."

"మనం? నువ్వూ వెళ్ళకపోతే మీ ఇంటిల్లిపాదీ నన్ను ఆడిపోసేసుకోరూ! వెళ్ళు బాబూ.. వెళ్ళు . నా పాట్లు నేను పడతా ల్లే."

"వద్దులే. ఒక్కర్తివే ఉంటావ్. వాళ్ళనే రమ్మందామెప్పుడో.." అన్యమనస్కంగా ఏదో మెయిల్ చదువుతూ అనేసాడు.

"నాకు భయమని నువ్వేం బాధపడక్కర్లేదు వంశీ. ఉదయం నుంచీ ఈ కొంపలో ఒక్కర్తినీ ఏడుస్తూనే ఉన్నాను కదా! ఇంకా భయమెక్కడేడ్చింది? నీ జల్సాలు నువ్వు చేస్తూనే ఉంటావు. నువ్వూ, నీ స్నేహితులూ.. ఇష్టారాజ్యం భరతుడిపట్నం."

"....."

"వాళ్ళనే రమ్మందామని అప్పుడే ప్లాన్ వేసేస్తున్నావ్. పనిమనిషి లేదు. ఎలా చేస్తాననుకున్నావ్ ఆ మందకి? పైగా నాకు లక్ష రూల్స్ పెడతారు. మంగళవారాలూ, శుక్రవారాలూ అని. నాన్సెన్స్. వింటున్నావా?"

"నాన్సెన్స్.. వింటున్నాను."

"అదే అదే.. నేను మాట్లాడితే నాన్సెన్సే. నీలా తియ్యగా మాట్లాడడం నాకు చేతకాదు. నీలా ఉజ్జోగాలు చేసి ఊళ్ళేలట్లేదు కదా? ఎన్నైనా అంటావు."

"నిన్నెవరు చెయ్యద్దన్నారు? అయినా ఏంటిది సీమా? పెట్టెయ్ ఫోన్. సాయంత్రం మాట్లాడుకుందాం."

"ప్చు.. సాయంత్రం.. అప్పటిదాకా నేనుంటే కదా?"

"ఏం? ఎక్కడికెళ్తావ్?" స్క్రీన్ మీద మీటింగ్ రిమైండర్ పాపప్ అవడం చూసి కుర్చీలోంచి లేచి నడుస్తూ అడిగాడు.

"ఏట్లోకి.. గోదాట్లోకి.. నేనెలా పోతే నీకేం? నేను మాట్లాడేది నాన్సెన్స్. నేనో సెన్స్ లెస్ బ్రూట్ ని. మీలాంటి మేధావుల మధ్య నేను బ్రతకలేను. ఎప్పుడో ఛస్తాను." గొంతు వణుకుతోంది.

"బై.. మీటింగ్ అయ్యాక మాట్లాడతాను." కట్ చేసాడు.

పెదవి కొరుక్కుని సణుక్కుంది. కళ్ళ లో నీళ్ళు గిర్రున తిరిగాయ్. "ఛీ.. వెధవ జన్మ. చస్తే పీడాపోయె.." బయటికే అనుకుంది. పట్టలేని దుఃఖం. నిస్సత్తువ. కుకర్ విజిల్ వేసింది. వెళ్ళి విసురుగా స్టౌ కట్టి, కిచెన్ గట్టుమీదున్న చాపింగ్ బ్లాక్ మీద తరిగిన బీన్స్ చెత్తబుట్టలో విసిరేసింది. ఆమె కక్ష తీరలేదు. విసవిసా హాల్లోకి నడిచి సోఫాలో కూలబడి చేతుల్లో మొహం దాచుకుని ఏడవడం ప్రారంభించింది.

*"... అసంఘటిత రంగంలో ఉన్న ఈ కార్మికులందరినీ కూడా ఏకం చేసి వారి హక్కుల కోసం పోరాటం చేస్తోంది ఓ సంస్థ. నేషనల్ డొమెస్టిక్ వర్కర్స్ మూమెంట్... "* టీవీలో ఝాన్సీ గొంతు ఖంగుమంది. ఉలిక్కి పడింది సీమ. సోఫాలో వెనక్కి వాలి స్క్రీన్ మీద కనిపించిన అక్షరాల్ని చూసింది. "పనిమనిషి హక్కులు" పనిమనిషి..! టీవీ మ్యూట్ చేసి కళ్ళు తుడుచుకుంటూ మొబైల్ అందుకుని సంగీతకి కాల్ చేసింది.

"హెలో.. సంగీతా! ఏం చేస్తున్నావ్?"
"....."
"ఓ.. స్కూల్ పికప్ కా? సరే సరే.. ఏం లేదూ మెయిడ్ గురించి చెప్పాను కదా. ఎవరైనా దొరికారా అనీ.."
"....."
"సరే.. నువ్వొచ్చాక చెయ్."

నిస్త్రాణగా వాలిపోయింది. "ఆకలి! లంచ్ కి రానన్నాడు. వచ్చినా మాట్లాడడు. మాట్లాడితే గొడవవుతుంది. ఎందుకవుతోంది? నాదే తప్పా? నేనన్నదానిలో లాజిక్ లేదంటాడు. ప్చు .. పొగరు! ఎవరిక్కావాలి నేనెలా పోతే! అన్నిటికీ నేనే కారణమని నింద మాత్రం వేస్తారు. పనిమనిషి మానేస్తే నాదా తప్పు?! నాకు నచ్చలేదు, మార్చేసాను. తప్పేముంది?" రిమోట్ అందుకుని టీవీ అన్ మ్యూట్ చేసింది.

*" ..జం మొత్తం మీదా హక్కులనేట్వంటివి కొన్ని వర్గాలకు మాత్ర మే సంబంధించినవి కావు. హక్కు అనేది ప్రతి ఒక్కళ్ళ కీ ఉంటుంది.. పనిమనుషుల హక్కులు, వేతనాలు.. వీటి గురించి మరిన్ని విషయాలు మాట్లాడుకునే ముందో విరామం."* టాక్ షో సిగ్నేచర్ మ్యూజిక్ గట్టిగా వినిపిస్తోంది.

లేచి మేడ మీదకి నడిచింది. చల్లటి నీళ్ళ తో మొహం కడుక్కుని తుడుచుకుంటూ లైట్ ఆన్ చేసి, హేండ్ మిర్రర్ లో బుగ్గల మీద పోర్స్, ముక్కు, కళ్ళ కింది లైన్స్ .. మొహం అటూ ఇటూ తిప్పి దీక్షగా చూసుకుంది. అద్దం ముందు నిలబడితే ఆమె మొహంలో ఏదో శాంతి! అద్దం బిగించిన అలమరలోంచి క్రీమ్ తీసుకుని బుగ్గలకి రాసుకుంది. నుదుటన ఉన్న స్టికర్ తీసేసి, వేరే డిజైన్ లో ఉన్న కొత్తది పెట్టుకుంది. జుట్టు చిక్కుతీసుకుని బటర్ ఫ్లై క్లిప్ తో వదులుగా బంధించింది. "నెయిల్ పాలిష్ మార్చాలి." చేతులు చూసుకుంటూ అనుకుంది. కాస్త మాయిశ్చరైజర్ తీసి చేతులకి మర్దన చేసుకుంటూ మెట్లు దిగుతూండగా మొబైల్ మోగుతున్న శబ్దం..

"చెప్పు సంగీతా.. వచ్చేశావా?"
"......"
"ఊ.. ఏదీ.. మూడో మెయిడే! ఊ.. ఊ.." అటు నుంచి వినిపించిన మాటలకి సీమ మొహం వాడిపోయింది. ఫోన్ పెట్టేసి కిచెన్ లోకి వెళ్ళి కుకర్ విప్పుతూ సణుక్కుంది.

"మూడో పనిమనిషి కాదే.. ఆరోది సీమా! నీకు గుర్తులేదేమో, రెండేళ్ళ లో ఆరుగుర్ని మార్చావు. ఎవరూ చెయ్యనంటున్నారు. నీకు ఎవరూ నచ్చరు. మనకి మెయిడ్ లేనిదే గడవదని తెలిసినప్పుడు సర్దుకుపోవాలి కదా! ఇలాంటి విషయాలు వాళ్ళలో వెంటనే తెలుస్తాయి. ఎవరినడిగినా నాలుగు రోజుల్లో మానేసే చోట ఎందుకమ్మా అనేస్తున్నారు." సంగీత మాటలే చెవుల్లో గింగురుమంటున్నాయి.

*"ప్రభుత్వం గుర్తించీ, విధివిధానాలు రూపొందించీ కార్మికులకి చట్టాలు, హక్కులూ ఇవ్వడమనేటువంటిది ఒక పెద్ద ప్రాసెస్. ఆ ప్రక్రియ అలా జరుగుతూనే ఉంటుంది. కానీ మార్పు రావాలీ అంటే అది మన నుంచీ మన ఇంటి నుంచీ..."* సీమకి కంచంలో పెట్టుకున్న అన్నం తీసుకెళ్ళి టీవీ మీద గుమ్మరించాలనిపించింది. ఆ తరువాత శుభ్రం చెయ్యడానికి పనిమనిషి లేదుగా!

***

"వెడ్డింగ్ యానివర్సరీ, పిల్లాడి పుట్టినరోజూ రెండూ కలిపి కొట్టేస్తున్నావు కదా! ఖర్చు మిగులు" నవ్వాడు వంశీ.

లంచ్ కి బయటికెళ్ళి వచ్చేసరికి తనకోసం రిసెప్షన్లోనే ఎదురుచూస్తున్న నందుని కేబిన్ లోకి తీసుకెళ్తూ మొబైల్ లో అతను చెప్పిన డేట్ నోట్ చేసుకున్నాడు. నందూ వంశీ ఊరివాడే. ఓ మేన్యుఫేక్చరింగ్ కంపెనీలో సేల్స్ ఎక్జిక్యూటివ్ గా చేస్తున్నాడు. ప్రేమించిన పిల్లని తీసుకొచ్చి సాయం కావాలంటూ వంశీ ఎదుట నిలబడ్డాడు. అర్ధరాత్రి ఇంటి తలుపు కొట్టిన జంటని ఏమనాలో తెలియక తెల్లారే దాకా ఆలోచించి, వాళ్ళ పట్టుదల అర్ధమై పెళ్ళి చేయించాడు. “సరిగ్గా ఏడాది క్రితం అన్నమాట.. !” లెక్కవేసుకున్నాడు వంశీ చెయిర్ లో కూర్చుంటూ.

"ఎలా ఉంది మోహన?"

"బావుంది. దీపక్ తో సరిపోతోంది. సంగీతం పాఠాలు బాగా నడుస్తున్నాయ్. ఆల్ హేపీస్." నవ్వాడు నందూ.

ఓ క్షణం నందూ మొహాన్ని పరికించి చూశాడు వంశీ. "నిజంగానే సంతోషంగా ఉన్నాడీ అబ్బాయ్." అనిపించింది.

"సో.. లవ్ మేరేజ్ సుఖమంటావు." కదిపాడు వంశీ.

"అదేంటండీ అలా అడిగేసారూ? మేరేజ్ లో సుఖం ఎక్కడైనా ఉంటుందా? Be it arranged or love.." గలగలా నవ్వాడు నందూ.

"ఓ పెద్ద నిర్ణయం మీరే తీసుకున్నప్పుడు అన్ని విషయాల్లోనూ ఇద్దరూ బాధ్యత తీసుకుంటారు కదా!" సీరియస్ గా ఉంది వంశీ మొహం.

"అవి రెస్పాన్సిబిలిటీస్ తీసుకునేవారికండీ. షేరింగ్ అన్నివిషయాల్లోనూ కుదరనే కుదరదు. కడుపు చించుకుంటే కాళ్ళ మీద పడిందనీ.. మోహన ఇప్పటికి వంట నేర్చుకోలేదు. అది నా వంతే పడింది."

"సర్దుకుంటున్నారు కదా! అయినా ఆ పిల్ల "నగుమోము గనలేని.." అని ఒక్క కీర్తన పాడితే చాలదటయ్యా? వండాలా?" నిజాయితీగా మెచ్చుకున్నాడు వంశీ.

"ఊ.. మీకేం! అలాగే చెప్తారు. కోరి చేసుకున్నాను కనుక సర్దుకుపోతున్నాను. ఏది ఎలా ఉన్నా ఆఫీస్ నుండి వెళ్ళాక స్టౌ వెలిగించాలంటే నరకం వంశీగారూ! రోజూ బయటేం తింటాం? నేర్పుదామని ప్రయత్నించాను. చేతులు కోసుకుని, కాల్చుకుని.. గిన్నెలు మాడ్చి.. నా చేత ఎందుకొచ్చిందిరా బాబూ అనిపించేసింది. ప్రేమా, పాటలూ తిని బతకలేం కదండీ!" మళ్ళీ గలగల్లాడాడు.

"హ్మ్.. పాయింటే! పోన్లే.. నెమ్మదిగా వంటమనిషిని కుదిర్చేసుకోండి."

" అబ్బే లేదండీ. నాకు వంటొచ్చు. ఒక్కోసారి వండాలంటే విసుగే కానీ.. వండుతున్నంత సేపూ వెనక వెనకే చిన్న పిల్లలా తిరుగుతూ కబుర్లు చెప్తుంది. ఏం వండినా లొట్టలేస్తూ తిని మెచ్చుకుంటుంది. నేను వంటొక్కటే చేస్తాను. మిగిలిన పనంతా తనదే. ఇదో రకం కాలక్షేపం. అయినా ‘బాధే సుఖమన్న భావన రానీవోయ్’ అన్నారు కదండీ! మొత్తానికి మా ఆవిడకి దంతసిరి ఉంది." నవ్వాడు కల్మషం లేకుండా.

రెప్పవెయ్యకుండా ఓ క్షణం చూశాడు వంశీ. చూపు మరల్చుకుంటూ.. "అయితే నీ వంట రుచి చూడచ్చన్నమాట! ఇంట్లోనే అంటున్నావ్ కదా పార్టీ?" అడిగాడు.

"లేదులెండీ. మీకా భయం అక్కర్లేదు. ఇంట్లో అని ఎందుకన్నానంటే మీరెప్పుడూ మా ఇంటికి రాలేదు. పిలిచినది మిమ్మల్నీ, మా కజిన్ ఉన్నాడిక్కడ. వాళ్ళ నీ. అంతే. పెద్ద హడావిడేం లేదు. ఫుడ్ బయట నుండే ఆర్డర్ చేసేస్తున్నాను." లేస్తూ చెప్పాడు నందూ. బయటిదాకా వచ్చి హేండ్ షేక్ ఇచ్చి సాగనంపాడు వంశీ.

కేబిన్ లోకి వస్తూనే సీమ కి కాల్ చేసాడు. రింగవుతోంది. నో ఆన్సర్. లేండ్ లైన్ కి చెయ్యబోయి నిద్రపోతూ ఉంటుందేమో అని ఊరుకున్నాడు. సాయంత్రం దాకా తలెత్తనివ్వని పని తాత్కాలికంగా ఆమె గురించి మర్చిపోయేలా చేసింది.

***

సన్నగా విజిల్ వేస్తూ వంశీ బైక్ పార్క్ చేసాడు. తాళం తీసుకుని లోపలికి వెళ్తూనే సోఫాలో నిద్రపోతున్న సీమ కనిపించింది. టీవీ మోగుతోంది. నల్లటి లెదర్ సోఫాలో ముడుచుకు పడుకున్న సీమ లైట్ల వెలుగులో మెరుస్తోంది. పచ్చని చాయ.. నీలిరంగు డ్రస్ లో మరింత అందంగా కనిపిస్తోంది. పక్కకి తిరిగి చేతిమీద తలపెట్టుకుని నిద్రపోతున్న భంగిమ ముచ్చటగా ఉంది. *"She sleeps like Miss.World!"* ఓప్రా షో లో ఐశ్వర్యని చూపిస్తూ అభిషేక్ అన్నమాటలు గుర్తొచ్చాయ్. లేప్టాప్ బేగ్ వర్క్ స్టేషన్ దగ్గర పెట్టి కిచెన్ లోకి వెళ్ళి మంచినీళ్ళు తాగి వచ్చాడు. ఆ అలికిడికి కూడా సీమ కి మెలుకువ రాలేదు. నెమ్మదిగా పక్కనే ఉన్న కుర్చీ దగ్గరకి లాక్కుని కూర్చుని చూస్తున్నాడామెనే.

ఎంతందం! ఇలాంటి అమ్మాయి మొహం చూస్తూ నిద్రలేవాలని ఎవడైనా కలలు కనేంత అందం! "నాకు చెల్లెలుంటే ఈ సీమ ని నీ కంట పడనిచ్చేదాన్ని కాదు. ప్చ.. ఏం చేస్తాం! చూడవయ్యా వంశీ.. చిదిమి దీపం పెట్టుకోవచ్చు. ఇంజినీరింగ్ చదివింది. సంగీతం నేర్చుకుందట. నీకు నచ్చితే చెప్పు, మాట్లాడుతాను." వాళ్ళ మేనమావ కొడుకు పెళ్ళి ఫోటోల్లో సీమ ని చూపిస్తూ వదిన చెప్పిన మాటలు గుర్తొచ్చాయ్. మౌనంగా మొదలయిన తొలిరేయి ఆమెకు తను నచ్చలేదేమో అని బెంగపెట్టుకున్న క్షణం గుర్తొచ్చింది. రోజులు గడుస్తున్న కొద్దీ.. పుట్టింటిని వదిలిపెట్టిన బెంగలే అని కొన్నాళ్ళు , అత్తవారు నచ్చే కోడళ్ళెంతమందిలే అని మరికొన్నాళ్ళు , అపార్థం, అనుమానం ఈమె ఆభరణాలని మరికొన్నాళ్ళు .. అసలు సమస్యేంటో తెలియకపోవడమే సమస్య! mood swings, aggressive nature.. కొందరింతే అని సరిపెట్టేసుకోవడమే! కానీ...

"కొంప గుర్తొచ్చిందా?" నున్నటి నేల మీద గాజు వస్తువేదో భళ్ళున పగిలినట్టు..
"....ఊ.. ఇందాకే వచ్చాను. నిద్రపోతున్నావనీ.." ఉలిక్కిపడి కుర్చీలోంచి లేస్తూ చెప్పాడు.
"ఏం.. వెళ్ళి పోతున్నావేం? ఇంతసేపూ ఏం చూసావ్? బతికే ఉన్నానా, చచ్చానా అనా?"

"ఏం మాటలవి సీమా? దీపాలవేళ..!" నొచ్చుకున్నాడు.

"నా మాటేది బావుంటుంది కనుక? నేనెవరికి కావాలి కనుక.." ఉన్నట్టుండి వెక్కిళ్ళలోకి మారిన మాటలు.

వెనక్కి తిరిగి జాలిగా చూసాడు. "ఏం కావాలీమెకి..?" పక్కనొచ్చి కూర్చుని దగ్గరికి తీసుకోబోయాడు. అనునయంగా తన భుజాలను చుట్టిన చేతుల్ని విసిరికొట్టింది.

"ఇలా ఏడిస్తే నీ బాధ తీరుతుందంటే ఏడు.."

వెక్కిళ్ళ శబ్దం.. గుండెల్లో కెలుకుతున్నట్టూ..

"ఏం కావాలో చెప్పు. ఎక్కడికైనా వెళ్దామా? బయట తిని వద్దాం పద." బుజ్జగింపుగా అన్నాడు.

***

"నీకేం కావాలో, నువ్వెలా ఉండాలనుకుంటున్నావో ఆలోచించుకో. ఉద్యోగం చెయ్.. లేదా పక్కన పెట్టిన సంగీతం మళ్ళీ నేర్చుకో. నందూ వాళ్ళావిడ చెప్తూంటుంది కదా! అడగమంటే అడుగుతాను. అన్నట్టు ఆదివారం వాళ్ళ బ్బాయ్ పుట్టినరోజట. పిలిచాడు." కార్ కాలనీలోకి తిరిగే జంక్షన్లో సిగ్నల్ దగ్గర ఆగినప్పుడు చెప్పాడు.

మౌనంగా కూర్చుంది సీమ.

చేతిమీద చెయ్యి వేస్తూ చెప్పాడు. "నువ్వు అలా ఇంట్లోనే ఉంటే ఇలా డల్ గానే ఉంటుంది. బయటికి రా.. '

"నందూ అంటే.. అర్ధరాత్రి ఆ సానిదాన్నో ఎవర్తినో లేపుకొచ్చేసాడూ.. వాడేనా?"

"కాస్త సున్నితంగా మాట్లాడు సీమా. ఇష్టపడిన పిల్ల ఎవరైతే ఏం?" చిరాకుని అణుచుకుంటూ అన్నాడు.

"అలాంటి వాళ్ళ గడపలంట తిరగడం నీకు బావుంటుందేమో.. నాకు అసహ్యం."

"నువ్వు మారవు.." గొణుక్కున్నాడు.

"ఏం మారాలి? హా.. ఏం మారాలీ?? నువ్వెవరితో పడితే వాళ్ళతో స్నేహం చేస్తూంటే మీ అమ్మ ఊరుకుంటుందేమో.. నా వల్ల కాదు. ఆదివారం ఉదయం మా బాబాయ్ వాళ్ళింటికి వెళ్తున్నాం. వాళ్ళు ఇల్లు కట్టుకున్నాక మనం మళ్ళీ భోజనానికి వెళ్ళలేదని అంటున్నారు. బావుండదు. ఎవరితోనైనా మాట్లాడితే కాస్త స్టేటస్ చూసుకోవాలి. ఇలా అలగాజనంతో తిరగడం కాదు. అయినా సంగీతాలూ అవీ వాళ్ళకి పనికొస్తాయ్.. నీలాంటివాళ్ళని బుట్టలో వేసుకోడానికి. సంసారాలు చేసుకునే వాళ్ళకి కాదు. నేను నేర్చుకోవాలట...అదీ దాని దగ్గర!! అడ్డమైన...."

"తివిరి ఇసుమున తైలంబు తీయవచ్చు.. " ఇంటి ముందు కారాపుతూ దవడ కండరం బిగించాడు వంశీ.

ఆ రాత్రి మహతితో పాటూ మరో రెండు కళ్ళు star gazing కోసం మెలుకువగా ఉండాలని నిర్ణయించుకున్నాయ్. మహతి గలగలా చెప్తున్న కబుర్లన్నీ నవ్వుతూ ఆసక్తిగా వింటున్నాయ్.

"వంశీని రమ్మన్నాను. కుదరదన్నాడు. తనకి అంత ఇంటెరెస్ట్ లేకపోయినా నాకోసం పాపం ఓపిగ్గా తెల్లారేదాకా కూర్చునేవాడులే. ఎప్పుడో కిందటేడాది వాళ్ళింట్లో రెండురోజులున్నాను. అప్పుడు.." ఆపిల్ కట్ చేస్తూ చెప్పింది మహతి.

"వంశీ అంటే.. శంభుమూర్తి మేష్టారి ట్యూషన్ కి వచ్చేవాడూ? పాపం ఓ సారి కొట్టాను తనని. ఆ అబ్బాయే కదూ!"

# 3

"వంశీ అంటే శంభుమూర్తి మేష్టారి ట్యూషన్ కి వచ్చేవాడూ? ఆ అబ్బాయే కదూ! పాపం.. ఓ సారి కొట్టాను తనని. " అడిగింది గౌతమి.

"కొట్టావా!! ఎప్పుడూ?! అయినా నువ్వు ఫేస్ బుక్ లో యాడ్ చేసుకోలేదా? చేసుకున్నానన్నావూ?" ఆపిల్ ముక్కలను ప్లేట్ లో సర్దుతున్నదల్లా ఆగి కళ్ళింతలు చేసుకుని మరీ అడిగింది మహతి.

"**ప్చ్**.. లేదు. నేను ఫేస్ బుక్ అంతలా వాడను. అయినా మనం మాట్లాడుకోగానే నువ్వు మనవాళ్ళున్నారు FB లో.. అని గబాగబా వంద పేర్లు చెప్పేస్తే ఏం చెయ్యాలో తెలీక ఊ కొట్టాను." అనేసి మహతి మొహం వైపు చూసి నాలిక కొరుక్కుని "సారీ.." అని నవ్వేసింది.

మహతి పకపకా నవ్వేసి "ఏంటో.. అలా అలవాటైపోయింది. నన్ను వంశీ 'రైలూ రైలూ..' అంటాడిందుకే ." ప్లేట్ తెచ్చి టీపాయ్ మీద పెట్టి కూర్చుంది.

"రైలు..?" కనుబొమలెత్తి చూస్తూ ఓ ఆపిల్ ముక్క తీసుకుని "థాంక్స్!" చెప్పింది.

"ఊ రైలే.. ఇలా గబగబా అవతలివాళ్ళని ఆపేసి మరీ మాట్లాడేస్తూంటే..." ఎడం చెయ్యి పైకి లేపి.. కళ్ళు శాంతంగా మార్చి "ఓయ్.. ఆగలాగ.. రైలూ రైలూ.. అంటాడు." అభినయించింది మహతి.

గౌతమి పకపకా నవ్వింది.

"శంభుమూర్తి మాష్టారి ట్యూషన్ లో వంశీ యే కానీ, ఎప్పుడు కొట్టావ్ పిల్లా?"

"ఎప్పుడోలే.. కాళ్ళీడుస్తూ నడుస్తున్నాడని తిట్టేదాన్ని ఎప్పుడూ.. ఆ కోపంతో ట్యూషన్ బయట పెట్టిన నా చెప్పులు కాలువలో పడేలా తోసేసాడోరోజు. లాగిపెట్టి కొట్టాను. చాలా రోజులు మాట్లాడుకోలేదు. మళ్ళీ ఎప్పుడు మాట్లాడానో కూడా గుర్తు లేదు. కొట్టడం మాత్రం బాగా గుర్తుంది." నవ్వింది.

"భలే సిల్లీగా ఉంటాయ్ కదూ ఇప్పుడు గుర్తు చేసుకుంటే! అయినా అవి గోల్డెన్ డేస్ లే. ఏ బాధా, బాధ్యతా ఉండేది కాదు."

"ఇప్పుడేం బాధలున్నాయేంటీ.." అంటూ లేచి కిచెన్ లోకి వెళ్ళి "సాల్ట్ ఎక్కడుందీ.. "అడిగింది గౌతమి.

"స్టౌ పక్క అలమరలోనే.. ఎందుకూ?"

సాల్ట్ షేకర్ వెతికి తెచ్చుకుని ప్లేట్ లో ఉన్న ఆపిల్ ముక్కల్లో ఒక వైపు ముక్కలమీద కొద్దిగా చల్లుతూ.. "ఇలా బావుంటాయ్ ఆపిల్ ముక్కలు. ట్రై చేసావా ఎప్పుడైనా? అటువైపు చల్లలేదు. ఇన్ కేస్ నీకు నచ్చకపోతే.." చెప్పింది.

తిని చూసి "ఊ.. బావుంది కదా!" అంది మహతి.

"అన్ని రకాల ఆపిల్స్ కీ బావుండవు. కొంచెం పిండిగా ఉండే రకమైతే ఇలా బావుంటుంది. హేయ్.. ఒంటిగంటన్నర! పైకి వెళ్దామా?"

మహతి స్వెటర్ తొడుక్కుని, మొబైల్, కీస్ తీసుకుని జేబులో వేసుకుని చెప్పుల్లో కాళ్ళు దూర్చింది. వెనుకే నడిచింది గౌతమి.

***

డిసెంబర్ చలి దట్టంగా నగరాన్ని కమ్మేసింది. వీధులన్నీ నిశబ్దంగా ఉన్నాయ్. టార్చ లైట్, ఒక బొంత, రెండు శాలువలూ మోసుకుంటూ మూడో అంతస్థు పై డాబా మీదకి వేసిన ఇనుప మెట్ల మీద నుంచి జాగ్రత్తగా పైకెక్కారిద్దరూ. చలి కొరికేస్తోంది. మహతి ఉత్సాహంగా ఆకాశం నలువైపులా చూసింది. గౌతమి వణుకుతున్న చేతుల్ని రుద్దుకుని చెంపలకానించుకుంటోంది. స్కార్ఫ్ ఇంకాస్త బిగుతుగా మొహం చుట్టూ కప్పుకుని పిట్టగోడకానుకుని నిలబడింది.

"జలుబు చేసేస్తుందేమో నీకు.. కనీసం గంట ఉండాలి." నొచ్చుకుంటూ చెప్పింది మహతి.

"ఏం పరవాలేదు. మొక్క మొలిచిపోంలే."స్వెటర్ పై గుండీలు పెట్టుకుంది.

తను అన్నమాటే.. మొక్కమొలిచిపోమని! మహతికి కాస్త ఉత్సాహం వచ్చింది.

"ఇవాళ పదమూడు కదా.. మూడు గంటలకి మంచి Meteor shower ఉంటుందని చెప్పారు. అప్పటిదాకా వద్దులే. కాస్త కనిపించగానే వెళ్ళిపోదాం." నేల మీద దళసరిగా ఉన్న బొంత పరుచుకుని వెల్లకిలా పడుకుంటూ చెప్పింది మహతి.

"ఇందాకా ఉన్నాక మళ్ళీ కాస్త చూసి వెళ్ళడం దేనికీ.. కబుర్లు చెప్పుకుంటూంటే టైం తెలీదు. చెప్పు.. ఇలా కింద పడుకునే చూడాలా?" గౌతమి తనూ మహతి పక్కనే పడుకుంటూ శాలువ కప్పుకుని అడిగింది.

"కళ్ళకి చీకటి అలవాటవ్వాలి.. కనీసం ఓ అరగంట. అప్పుడే క్లియర్ గా చూడగలం. shooting stars.. gemini constellation నుంచి వస్తాయ్. మిగిలిన Meteor showers తో పోలిస్తే ఈ geminids స్పీడ్ తక్కువ. అందుకని మన కళ్ళకి చక్కగా కనిపిస్తాయన్నమాట. ఓయ్.. బోర్ కొట్టిస్తానేమో! అవన్నీ కాదు కానీ.. దీపావళి జువ్వల్లా దూసుకొచ్చేస్తాయ్. పచ్చగా మెరుస్తూ..! చూడు. చాలు." మహతి గుండెల మీద చేయివేసుకుని ఆకాశం వైపు ఇష్టంగా చూస్తూ చెప్పింది.

"ఈ స్టార్ గేజింగ్ ఎప్పటి నుంచీ చేస్తున్నావ్?"

"చిన్నప్పటినుంచీ చాలా ఇష్టం.లోకల్ ఆస్ట్రానమీ క్లబ్ లో మెంబర్ని." మహతి కొంచెం గర్వంగా చెప్పింది.

"చుక్కల్ని లెక్కెడితే సూరీడుకాయలొస్తాయని చెప్పేది బామ్మ." నవ్వింది గౌతమి.

"హ్హహ్హహ్.. అవును. అనేవారు. అటు చూడు.. చిన్న చుక్క ఎలా మినుకుమంటోందో ఉత్తరం వైపు.. అలా చూస్తూంటే అది మనకేదో చెప్తున్నట్టే అనిపిస్తుందేం! కాస్త పరిచయం పెరిగాక కొత్తవాళ్ళతో మన గురించి మనం ఎలా కొంచెం కొంచెంగా చెప్పుకుంటామో.. అచ్చం అలాగే ఎన్నో రహస్యాలు చెప్తుంది ఆకాశం. సైన్స్ చదవక్కర్లేదు. సహనం.. ఇష్టం.. ఇవున్నవాళ్ళకి.. ఆకాశం ఓ అద్భుతం." కలలో మాట్లాడుతున్నట్టు చెప్తోంది మహతి.

"ఊ.."

"నీకు బోర్ కొడుతుందేమో! నువ్వేమైనా చెప్పు."

"ఉహూ.. లేదు. వింటున్నాను."

"చుక్కలు చాలా పంక్చువల్. ఎదురుచూస్తున్నామని తెలుసు వాటికి.. లవ్ లో పడ్డ కొత్తల్లో అనుకున్న టైంకి మీటింగ్ ప్లేస్ కి వచ్చేసినట్టు వచ్చేస్తాయ్!"

"హ్హహహ్.. అనుకున్న టైం కంటే ముందుగా వస్తారు ప్రేమలో పడ్డ కొత్తల్లో.."

"ఓహ్హో.. చెప్పు చెప్పు.." మోచేత్తో గౌతమిని తాకి నవ్వింది.

"**ప్చ్**.. ఉహూ.. జనరల్ నాలెడ్జ్."

"ఓయ్.. నిజం చెప్పూ. Come on Girl..!"

"లేదన్నాను కదా. నువ్వు చెప్పు. ఎనీ వన్ స్పెషల్?"

"ఊ..Mr. Night Sky! Love of my life!" చేతులు పైకెత్తి ఆకాశాన్ని కౌగిలించుకుంటూ చెప్పింది మహతి..

"అబ్బ చా! నమ్మమంటావా?" గౌతమి తలతిప్పి నవ్వుతూ అడిగింది.

గౌతమి వైపుకి తిరిగి మోచేతిని తలకింద పెట్టుకు పడుకుని "పాతికేళ్ళప్పుడు పడ్డాను పీకల్లోతు ప్రేమలో.. ఆకాశంతో. ఆ తరువాత ఎందరు కనిపించినా ఆకాశమంత ప్రేమ దొరకలేదు. అలా స్వయంవర పరీక్షలో నెగ్గాడు Mr. Night Sky!" గలగల్లాడింది మహతి.

"నువ్వు చెప్పవు కానీ.. పోనీ ఆకాశం కథైనా చెప్పు. వింటాను." తనూ మహతి వైపు తిరుగుతూ శాలువా మరింత బిగించి అడిగింది గౌతమి.

వెల్లకిలా తిరిగి చూస్తూ "మనకి ఇరవై ఏడు నక్షత్రాలు కదా.. ఇరవై ఎనిమిదోది అభిజిత్ నక్షత్రం అని చెప్తారు. దాన్నే వేగా అంటారు. Star Vega.. the brightest and most beautiful..! Carl Sagan రాసిన Contact అనే నోవెల్ చదివానప్పుడే. అందులో ఈ వేగా నుంచి మెసేజెస్ రావడం.. అదీ చదివి సరదాగా అనిపించింది. వేగా నుండి భూమికి ఒక లైట్ రే రావడానికి సరిగ్గా పాతికేళ్ళు



కౌముది

పడుతుంది. అప్పుడు నా వయసు సరిగ్గా పాతిక. అంటే ఆ ఏడాది వేగా నాకు కనిపిస్తే.. ఆ లైట్ నేను పుట్టినప్పుడు బయలుదేరినదన్నమాట! సౌండ్స్ క్రేజీ కదా.. నాకైతే ఎక్సైటింగ్ గా అనిపించింది. జులై లో కనిపించింది వేగా.. భలే థ్రిలింగ్ గా అనిపించింది. నేను పుట్టినపుడు వెలువడిన లైట్ రే! పాతికేళ్ళు ప్రయాణం చేసి మళ్లీ నా కంటబడింది. నా బర్త్ లైట్ అది. అలా చూడాలని ఎదురుచూడడం బాగా నచ్చింది. ఆకాశం మోసం చెయ్యదు. ఏడిపించదు. వస్తానన్న టైం కి వచ్చేస్తాయ్ స్టార్స్.. ఏ మబ్బులైనా ఉంటే.. అది కూడా మనకి కనిపిస్తుంది కదా.. నమ్మొచ్చు. హే.. అదిగో షూటింగ్ స్టార్.. మొదలయిందోచ్.. వచ్చేస్తున్నాయ్ జెమినిడ్స్..!" సర్దుకు పడుకుంది.

కాసేపు మౌనం.. ఉండుండీ ఆకాశంలో జువ్వల్లా దూసుకుపోతున్న చుక్కలు. కొన్ని ఒంటరిగా.. కొన్ని కలిసికట్టుగా.. పచ్చగా మెరుస్తూ.. నల్లని ఆకాశంలో రహదారులు వేస్తూ.. స్వచ్ఛంగా తళుకులీనుతూ.. కళ్ళార్పకుండా చూస్తున్న ఆ ఆడపిల్లల కోసం గంధర్వులెవరో ఆకాశమార్గాన పంపుతున్న సందేశాల్లా..

"రవి.. ఓ ఫ్రెండ్ ద్వారా పరిచయం.. మూడేళ్ళు .. అంతా చాలా బావుండేది. నేనంటే ప్రాణమని చెప్పేవాడు. నీలాంటి తెలివైన అమ్మాయికి ఎంత తెలివైన పిల్లలు పుడతారో! అనేవాడు. పిల్లల పేర్లు కూడా ఎంచేసుకున్నాం.  పెళ్ళికి పెద్దవాళ్ళని ఒప్పించాలని చాలానే ప్రయత్నించాడు." ఆగింది మహతి.

ఉన్నట్టుండీ మొదలైన విషయాన్ని అర్ధం చేసుకోడానికి ప్రయత్నిస్తూ ఊ కొట్టింది గౌతమి.

"కంటికి కనిపించకుండా.. మన లోనూ, మన చుట్టూ ఉండేది గాలి ఒక్కటే కాదు గౌతమీ.. మొహమాటం, మూర్ఖత్వం.. ఇవి కూడా. కంటికి కనిపించవు. చాలా పవర్ఫుల్! జీవితాలను నడిపిస్తాయ్, మార్చేస్తాయ్ కూడా! మొహమాటం రవికి ఉంది. మూర్ఖత్వం వాళ్ళ అమ్మా నాన్నలకి ఉంది. కులం కాని పిల్లని చేసుకుంటే చస్తామని బెదిరించారు. రవి లొంగిపోయాడు. చాలా మామూలు కథే. కానీ నా కథ కదా! నా వరకూ నా జీవితమంత కథ."

"ప్చ్.."

"నేనేమైనా అయిపోతానేమో అని భయపడ్డాడు. ఒకే మాట చెప్పాను. నాలాంటి అమ్మాయికి పుట్టే పిల్లలెంత తెలివైన వాళ్ళవుతారో అన్నావు కదా! నా చదువు, నా తెలివితేటలు, నా జీవితం వృధా చేసి ఏదైనా చేసేసుకుంటానని మాత్రం బెంగపడకు. బతికే ఉంటాను. అన్నాను. సంజాయిషీ ఇచ్చాడు.. పేరెంట్స్ అంటే తనకెంత ఇష్టమో.. వాళ్ళని ఎలా కాదనలేకపోతున్నాడో బ్లా బ్లా బ్లా.. రవి తో చెప్పాను. నువ్వంటే నీ పేరెంట్స్ కి అంత ప్రేమ లేదనుకుంటా. ఉంటే నీ ఇష్టాన్ని కాదనరు. మేబీ, నీకే నేనంటే అంత ప్రేమ లేదేమో. ఈ చస్తాననే మంత్రం మీవాళ్ళు  చదివినట్టు, నా కోసం నువ్వు చదవలేకపోయావు చూసావా? అన్నాను. ప్రాక్టికల్ డిఫికల్టీస్ గురించి చెప్పుకొచ్చాడు. ఎనీవేస్.. ఎవరి అభిప్రాయాలు వాళ్ళవి. నాకైతే పెద్ద విషయమే ఇది. *I swear by my life and my love of it that I will never live for the sake of another man, nor ask another man to live for mine."* దూసుకుపోతున్న చుక్కలు మహతి

కళ్ళల్లో మెరుస్తున్నాయి.

"Atlas shrugged?"

"ఊ.. నా మంత్రా అయిపోయిందిప్పుడీ లైన్.." చెప్పింది మహతి అభావంగా.

" Life goes on.."

"అవును. ఏదీ ఆగదు. మనసుకి నచ్చిన, సరైన జోడీ ని ఎంచుకోవడంలో మిగిలిన జంతువుల్లా మనకి స్వాతంత్ర్యమూ లేదు. ఆసక్తీ లేదు. జీవితం ఎటు పోతే అటు.."

"మనం సంఘజీవులం మరీ! హేయ్.. చూడు చూడు.. " జల్లుగా నేలకి దిగివస్తున్న చుక్కలదారిని చూపించింది గౌతమి.

"వావ్.. ఇప్పుడు ఆకాశాన్ని ఇలా ఫోటో తీసుకుని అలా బెడ్రూమ్ సీలింగ్ కి అతికించేసుకోగలిగితే బాగుంటుందేం.."

"కేమెరా కన్నుకి కనిపించనివి మన కళ్ళకి కనిపిస్తాయ్.. ప్రపంచంలోకెల్లా పవర్ఫుల్ లెన్స్ హ్యూమన్ ఐ.. టెక్నికల్ గా కాదు. ఆ కన్ను వెనుక ఉన్న హృదయం వల్ల." చెప్పింది గౌతమి.

"ఓ ఫోటో గ్రాఫర్ చెప్పాల్సిన మాటలేనా ఇవీ! కవిత్వం మాట్లాడుతున్నావ్.." మహతి నవ్వింది.

"హహ్హహా.. ఫోటోగ్రాఫర్ కి కవిత్వాన్ని చూడడం రావాలి మరి. అయినా ఈ ఆకాశం చూస్తే ఎవరికైనా కవిత్వం వచ్చేస్తుందిలే."

రెప్పకొట్టడం మరచిపోయిన నిశబ్దం కాసేపు.

" థాంక్స్ పిల్లా.." కళ్ళార్పకుండా ఆకాశంలో దీపావళిని చూస్తూ మహతి చేతిని సున్నితంగా నొక్కి వదిలింది.

***

"అర్ధరాత్రి దాకా నువ్వు టిక్కూ టిక్కూ మంటూ లేప్టాప్ నొక్కుకుంటూ, పాటలు వింటూ కూర్చుంటే.. నాకొక్కర్తికీ అక్కడ నిద్ర పట్టి ఛావదు." మేడ మీద నుండి తొంగిచూస్తూ విసుగ్గా చెప్పింది సీమ.

"ఇంకో అరగంట పడుతుంది సీమా.. బెడ్రూమ్ లో లైట్ వేస్తే నిద్రపోవని ఇక్కడ కూర్చున్నాను." తలెత్తకుండా చెప్పాడు.

"రేపు చేసుకోవచ్చులే.."

"**ప్చ్**.. కుదరదమ్మా.."

"స్టార్ గేజింగ్ కుదిరేదేమో కదా.. అది పిలిస్తే.." అది అనే మాటని నొక్కిపలికి సాధించుకున్న ఆనందం ఆమె కళ్ళలో..

"....."

"నేను తప్ప ప్రపంచంలో ప్రతీ అడ్డమైన విషయం ముఖ్యమే.. " మెట్ల మొదట్లో ఉన్న ఫ్లవర్ పాట్ ని మెట్లమీదనుంచి బలంగా తోసేసి బెడ్ రూమ్ లోకి వెళ్ళిపోయింది విసురుగా..

పెద్ద శబ్దంతో దొర్లుకొస్తున్న బ్రాస్ వేజ్ ని చూస్తూ పిడికిలి బిగించాడు వంశీ. అసహనంగా లేప్టాప్ తీసి పక్కన పెట్టాడు. లేచి మెట్లదాకా వెళ్ళి , విరమించుకుని.. వెనుతిరిగి వీధి తలుపు తీసాడు. చలిగాలి రివ్వున లోపలికొచ్చేసింది. చిన్న వణుకు వెన్నులో.. ఓ క్షణానికి సర్దుకుని శరీరం అలవాటుపడింది. గేట్ దాకా వచ్చి నిలబడ్డాడు. చీకటి పరిమళం లీలగా తాకింది. రెండు చేతులతోనూ మొహాన్నోసారి రుద్దుకుని గాఢంగా ఊపిరి పీల్చుకున్నాడు. ఇంట్లోకి నడవబోతూండగా ఆకాశం వైపొకసారి అతని చూపు సాగింది. చుక్క దూసుకొస్తోంది.. ఆశలా, అలలా.. ఆపలేని రేపటి రోజులా. క్షణకాలం ఆగి చూసాడు. "రాలే చుక్కని చూస్తే మంచో, చెడో అంటారు కదూ!" అనుకున్నాడు మనసులో. నవ్వొచ్చింది. మంచీ, చెడూ కాకుండా నిర్లిప్తంగా జీవితం.. దీన్నేమంటారు! తలుపు మూసుకుంది. లైటారిపోయింది. మనసుని కూడా మూసేసి, ఆలోచనని ఆర్పేసి, శరీరాన్ని మాయచేసి బజ్జోపెట్టేయగలిగితే బాగుండుననుకున్నాడు.. అశాంతిగా దొర్లుతూ.

***

"గుడ్నైట్.. మూడున్నరకీ.. హ్హాహ్హా.. థాంక్స్ చెప్పాలి నీకు." తలుపేసి లోపలికొస్తూ గౌతమితో చెప్పింది మహతి.

"ఉహూ.. నువ్వొక్కర్తివైనా చూస్తావు. నేనున్నాను కనుక నాకు చూపించావు.. రాలే చుక్కల్ని.. సారీ  జెమినిడ్స్ ని." పల్చగా పరుచుకున్న నవ్వు, అలసటగా వాలుతున్న కళ్ళు .. గౌతమి సోఫాలో కూర్చుని లేప్టాప్ ఆన్ చేసింది.

"ఇంక పడుకో. చాలా లేటయింది." మహతి తన బెడ్రూమ్ లోకి వెళ్ళబోతూ అంది.

"ఊ.. చిన్న పని గుర్తొచ్చింది. చిన్న పోస్ట్ ప్రాసెస్. రేపటికి పిక్స్ పంపుతానని మాటిచ్చాను. లేట్ గా లేస్తే కష్టం కదా. చేసేసీ.. నేనిక్కడే పడుకుంటానూ.. గుడ్నైట్!" టీపాయ్ మీదున్న కళ్ళద్దాలు తీసి పెట్టుకుని పనిలో మునిగిపోయింది గౌతమి.

"హాల్లో కాస్త చలెక్కువుంటుంది చూసుకో మరి. నీ ఇష్టం రూమీ.. ఎక్కడైనా సరే హాయిగా పడుకో. గుడ్నైట్" లోపలికెళ్ళి లైటాపింది.

చకచకా ఫోటోస్ ప్రాసెస్ చేస్తోంది. కళ్ళు నిశితంగా పరిశీలిస్తున్నాయి. పోలరైజింగ్ ఫిల్టర్ వాడి కెమెరా కంటిలో బంధించబడిన పచ్చదనం చూడడానికి అందంగానే ఉన్నా ఆమెకి తృప్తి కలగలేదు. గ్రీన్ చానల్ ని సింగిలౌట్ చేసి సాచ్యురేషన్ ని కాస్త పెంచింది. కళ్ళు తృప్తిగా ఆర్పి సేవ్ చేసింది. పైన ఆకాశపు నీలానికి కూడా కాస్త కలర్ బూస్ట్ అవడం చూసి బావుందనుకుంది. పని ముగించి షట్ డౌన్ చేయబోతూ ఆగింది. ఫేస్ బుక్ లోకి లాగిన్ అయి ఊదారంగు బుట్టచేతుల టాప్ వేసుకుని నవ్వుతున్న మహతి ప్రొఫైల్ మీద క్లిక్ చేసింది. ఫ్రెండ్స్.. ఫ్రెండ్స్.. వంశీ... వంశీ.. ఇతనేనా? లొకేషన్ ఇదే.  హైస్కూల్.. పెదరాయవరం. గాట్ హిమ్! రిక్వెస్ట్ సెంట్. ఎక్కడో పార్క్ లో నిలబడి తీయించుకున్న ఫోటో.. చేతులు కట్టుకు నిలబడ్డాడు. ఎడమ పాపిడి.. తీరైన మీసకట్టు.. కళ్ళు మెరుస్తున్నాయి. కాస్త డార్క్ బ్లూ వేసుకుంటే ఈ బేక్ డ్రాప్ కి బావుండేది. నవ్వుకుంది. మళ్ళీ మహతి ప్రొఫైల్ లోకి వచ్చి చూసింది. నల్లటి ఆకాశంలో నవ్వుతూ దూసుకొచ్చేస్తున్న నక్షత్రం కళ్ళ ముందు కదిలింది.

తలుపు తీసి బయటికొచ్చి.. మేడ ఎక్కి ఇంకా అరాకొరా రాలుతున్న చుక్కల్ని చూసి, వెంట తెచ్చుకున్న కేమెరా తో నాలుగైదు ఫోటోస్ తీసుకుని కిందకొస్తూ అనుకుంది. "ఆస్ట్రోఫోటోగ్రఫీ కి సరిపడా లెన్సుల్లుండుంటే బావుండేది. చిన్న చీటింగ్ చేయక తప్పుదిప్పుడు.."

# 4

All happy families resemble one another, each unhappy family is unhappy in its own way. -- Leo Tolstoy

***

"వంటవుతోందా ఇంకా..?" కిచెన్ గుమ్మానికి ఆనుకు నిలబడి అడిగాడు వంశీ.

"నాకేం వందచేతుల్లేవ్.."

"మనింట్లో వందమంది లేరు.." నాలుక చివరనే మాటని ఆపేశాడు. అలమరలో నుండి చింతపండు డబ్బా తీసి కిచెన్ ప్లాట్ఫాం మీద పెట్టింది. ఓ బౌల్ లో కాస్త చింతపండు వేసి స్టవ్ మీద చిన్న గిన్నెలో వేడెక్కుతున్న నీళ్ళు దానిలో పోసింది. తరిగి ఉంచిన ఆనపకాయ ముక్కల్ని, పక్కనే ఉన్న ములక్కాడనీ చూసి "సాంబార్.. మరో పావుగంట కనీసం.." అనుకున్నాడు.

"నేనలా బయటికెళ్ళి రానా..?"

"ఊరేగు.." కళ్ళెత్తి చూడకుండా సమాధానం చెప్పింది. సోగకళ్ళు .. *కళ్లెత్తితే సాలు కనకాబిసేకాలు..* ఉహూ.. ఆ కళ్ళలో నవ్వులు కురిసే అవకాశమే లేదా? వంశీ నెమ్మదిగా నడిచి ఆమె వెనకగా నిలబడ్డాడు. టొమాటోలు కడుగుతోంది సింక్ దగ్గర నిలబడి. గాఢంగా హత్తుకున్నాడు. తన స్పర్శ సీమకి తెలియచెప్తే బాగుండుననిపించింది.. "I care for you.." అని.

"వదులు.." మూడే మూడు అక్షరాల్లో కావల్సినంత ఈసడింపు.

"సీమా.. ఎందుకంత చిరాకు?" మాటల్లో అనునయం నింపుతున్నాడు.

"నువ్వు పనిలో ఉన్నప్పుడు పిలిస్తే బెల్లం కొట్టినరాయిలా కూర్చోవూ? ఏం.. నువ్వు పిలవగానే పక్కలోకి....."

"ఆపు.." విసురుగా విడిపోయాయ్ చేతులు. వెనక్కి తిరిగి చూడనైనా చూడకుండా వెళ్ళిపోయాడు.

"ఉన్నమాటంటే ఉలుకనీ.. నీకు ఖాళీ ఉన్నప్పుడే నేను గుర్తొస్తాను. లేకపో..." మాటలు గాల్లో కలిసిపోన్నాయి. చెప్పుల్లో దూరిన కాళ్ళు నడుస్తూనే ఉన్నాయి.

***

"నేనేమన్నానసలు! ఎక్కడికీ అలిగిపోయావ్? బాగా చెప్పిపెట్టిందావిడ. ఒక్క పూట చాలదూ మనసులు విరిచేయడానికీ.." బెండకాయ వేపుడు కంచంలో ఓ మూల చేరింది.

మౌనంగా అన్నం వడ్డించుకున్నాడు.

"మూగమొద్దులా మాట్లాడకపోతేనే సంసారాలిలా ఏడుస్తున్నాయ్."

ఒకే ఒక్క మాటలో తన శేషప్రశ్నకి సమాధానం చెప్పేసింది కదా అనుకుంటూ నవ్వుకున్నాడు.

"దేనికి నవ్వు? నా మొహాన కోతులాడుతున్నాయా?"

"నీకిష్టం లేదన్నావు కదాని ఊరికి ఒక్కణ్ణే వెళ్ళొచ్చాను. అదీ ఒక్క పూట. దానికింత రాద్ధాంతం అవసరమా సీమా?" సూటిగా కళ్ళు కలిపాడు.

"నా నోరొక్కటే వినిపిస్తుంది కదా! ఎందుకు వెళ్ళి పోయావ్ బయటికి? అది చెప్పు ముందు."

"చెప్తా. నువ్వు తిను ముందు.." కంచం వైపు చూపిస్తూ చెప్పాడు.

"మింగుతాన్లే. తప్పదు కదా బతకాలంటే.."

"ప్రతీచిన్న విషయానికీ బతుకులూ, చావులూ దేనికి సీమా? ఏమయిందసలు? హగ్ చేసుకున్నాను. తప్పేముంది? అంత ఈసడించాలా?"

"అను.. ఎన్నైనా అంటావు. చివరికి నాదే తప్పని నిరూపించడమే కదా నీక్కావల్సింది? మొన్న నిరూపించి వచ్చావు కదా.. నాకు జనాల పొడ గిట్టదని. ఇంకేమైనా ఉంటే కానిచ్చేయ్. ఓ పీడా పోతుంది." ఎర్రగా కందిన ముక్కు అదురుతోంది.

దీక్షగా ఆమెను చూస్తూ చెప్పాడు.

"సీమా, వాళ్ళకి  నా అవసరం ఉంది. అప్పుడప్పుడైనా వెళ్ళాలి. నీకు నచ్చకపోతే నువ్వు రాకు. వాళ్ళేమన్నారు, ఏమనుకుంటారు.. వదిలేయ్ ఇవన్నీ. లేనిపోనివి ఊహించుకుని  నీ మనసే పాడుచేసుకుంటున్నావు. మంచిది కాదు."

"ప్చు.. కొత్తగా పాడవడానికేముంది! నా వెనక వాళ్ళేమనుకున్నా పట్టించుకోకూడదు. ఇంతేగా నువ్వు తేల్చిన విషయం! బావుంది వంశీ.. నాకు మాత్రం విలువ ఇవ్వవు." కంచం విసురుగా తోసేసింది.

"నీ విలువకేమొచ్చిందిప్పుడు? నువ్వొద్దన్నావని వెళ్ళకపోతే.. అప్పుడా నీ విలువ తగ్గనట్టు?"

"నేనేం వద్దన్ను నాయనా.. ఊరేగండి అందరూ. ఏదో ఒక రోజు చస్తాను. మీకు ఏకనిశ్చింత!" ఉక్రోషం, క్రోధం జమిలిగా.. సీమ గొంతులో

"మాటకి మాట తెగులు.." కంచంలో మిగిలిన అన్నంలో పెరుగు వేసేసుకుంటూ గొణుక్కున్నాడు.

"ఏం.. అయిపోయిందా? తిండి మీద చూపించకు. ఆ పాపం నాకెందుకు?"

మూడే ముద్దల్లో పూర్తి చేసి,  వాష్ బేసిన్ వైపు నడిచాడు.

"నా వల్ల నీ ప్రాణానికి సుఖం లేదు. పోతాన్లే. నువ్వు హాయిగా ఉండచ్చు."

సోఫాలో కూర్చుని టీవీ ఆన్ చేసాడు.

*"... సాదరంగా వేదికపైకి ఆహ్వానిస్తున్నాను."* బాలూ పిలుస్తున్నాడు. *"నువ్వే దిక్కని నమ్మడమా... నీ ఆలయమును నిర్మించడమా..... సీతారామస్వామీ.. నే చేసిన నేరమదే నమీ!"* నవ్వుకున్నాడు వంశీ.

"నేను తప్పు ఇంకేదైనా, ఎవర్తైనా.. మొహం వికసించేస్తుందేం.!" ఏ పదాన్ని ఎలా పలకాలో చాలా కొద్దిమందికే తెలుస్తుంది.

*"…. అమ్మా అని కొత్తగా మళ్ళీ పిలవాలనీ.. తుళ్ళే పసిప్రాయమే మళ్ళీ మొదలవ్వనీ.."*

అటు చూసిన వంశీకి కిచెన్ లోంచి శబ్దాలు వినిపించాయ్. ఒక్కోసారి మనుషుల కంటే వస్తువుల మాటలు సుఖంగా ఉన్నాయనిపిస్తుంది.

*".. నువ్వు కావాలే అమ్మా.. నను వీడొద్దే అమ్మా.."* మనసుకెక్కట్లేదు. మనసెక్కడుందో తెలియట్లేదు.

***

"నీతో మాట్లాడకూడదు వంశీ.. కానీ ఫోన్ ఆన్సర్ చేసాక మాట్లాడకపోతే డబ్బులు వేస్ట్ కదా?" హలో అని కూడా అనకుండా సాధింపు మొదలుపెట్టేసింది మహతి.

"పోనీ మానేసి చూద్దామా?"

"ఓయ్.. ఏమైంది?"

"చిరాగ్గా ఉందిలే." తమాయించుకుని.. "వర్క్ ప్రెషర్.." అన్నాడు వంశీ.

"ఎప్పుడూ ఉండేదేగా! కప్పాఫ్ కాఫీ తో పోతుంది. అయితే ఆ కాఫీ పాండీ కేఫ్ లో తాగాలన్నమాట." గలగల్లాడింది.

సగం టెన్షన్స్ ఈ పిల్ల పోగొట్టేయగలదసలు! Contagious laugh.. నవ్వుకున్నాడు.

"ఏం.. వస్తున్నావా. మరో అరగంటలో?"

'తమ్ముళ్ళెవరూ లేరు కానీ మహతీ నీకూ.. క్షణాల్లో పెళ్ళిళ్ళు చేసేయగలవు!"

"సారీ.. జోక్ అర్థం కాలేదు. అట్నుంచి అటు ఇంటికెళ్దాం. నీకో మంచి విషయం చూపించాలి."

"షూర్! కానీ రెండూ కుదరవు. టైం సరిపోదు. కాఫీ నీ కిచెన్ లోనే. ఏం? సీయూ మహీ.." ఎరుపూ, బిస్కెట్ రంగు కుచ్చుల గౌను వేసుకుని పరుగుపరుగున ట్యూషన్ కి వస్తున్న మహతి గుర్తొచ్చినప్పుడల్లా పిలిచే పిలుపది.

***

"టడా…. బావుందా?" బెడ్రూమ్ గోడకున్న ఫ్రేమ్ చూపిస్తూ అడిగింది మహతి.

"వావ్!! షూటింగ్ స్టార్స్.. నేనూ ఆ రోజు చూసాను తెలుసా?"

"గ్రేట్! ఇక్కడికి రాలేదుగా.." మూతి ముడిచింది.

"కుదరలేదులే. సారీ! ఇంతకీ ఎక్కడ కొన్నావిది?" 16x20 సైజ్ ఫ్రేమ్ లో, నల్లటి ఆకాశంలోంచి ఏటవాలుగా దూసుకొస్తున్న జెమినిడ్స్ వైపు చూస్తూ అడిగాడు.

"కొనలేదు. గిఫ్ట్!" గర్వంగా చెప్పింది.

సన్నగా ఈలవేసి "అబ్బో! ఎవరా రొమాంటిక్ హీరో? నిన్ను బుట్టలో వెయ్యాలంటే మంచి దారే కనిపెట్టాడసలు!" నవ్వాడు వంశీ.

భుజం మీద చరిచి చెప్పింది. "అంత సీన్ లేదు బాబూ! గౌతమి ఇచ్చింది."

"గౌతమి?"

'ఊ.. ఫోటోగ్రాఫర్ కదా! ఆ రోజు ఎప్పుడు తీసిందో తెలీదు కానీ.. భలే కేప్చర్ చేసింది. మర్నాడు సాయంత్రం నేను ఇంటికొచ్చేసరికి సర్ప్రైజ్! కూల్ కదా! అచ్చం ఆకాశాన్ని గోడమీద అతికించేసుకున్నట్టే ఉంది. పర్ఫెక్ట్!" మురిపెంగా చూసుకుంటూ చెప్పింది.

"ఓ.. తనకీ చుక్కలు చూసే అలవాటుందా?" ఆలోచిస్తూ అడిగాడు.

"చుక్కలు చూడడమేంటీ.. స్టార్ గేజింగ్! తెలుగుని నువ్వు ఉద్ధరించేయక్కర్లేదులే. స్టార్ గేజింగ్ అను."

"ఊ.. ఏదోలే. ఇక్కడికొచ్చిందా?" రెట్టించాడు.

"ఇక్కడే ఉంటుందిగా! నా రూమ్మేట్ ఇప్పుడు.'

"ఓహ్.. అవునా!" ఫోటో ని దీక్షగా చూసాడు.

"కిచెన్ లోకి రా.. కాఫీ కలుపుదూగాని." గదిలోంచి వెళ్తూ పిలిచింది మహతి.

"నువ్వు తాగిపెడతావా? ఎవడొస్తాడో కానీ అయిపోయాడు."

"ఎవడూ రాడు కానీ.. నీ కబుర్లేంటీ?"

"కబుర్లేముంటాయ్? నువ్వేమైనా చెప్తే వినిపెడతా." కిచెన్ ప్లాట్ ఫాం ఎక్కి కూర్చున్నాడు.

"సీమ ఎలా ఉంది? ఏదైనా గుడ్ న్యూస్? మరీ నల్లపూసైపోయావ్ కదా.. మార్నింగ్ సిక్నెసూలూ అవీ షేర్ చేసుకుంటున్నావేమో అనీ.."

"అంత లేదులే కానీ.. మొన్నవారమేగా కలిసాం మనం?! మధ్యలో ఊరెళ్ళి వచ్చానో రోజు. మీ పెదబాబాయ్ కనిపించారు మార్కెట్ దగ్గర."

"వాళ్ళమ్మాయినే మన పైడ్రాజు తాతయ్య గారి మనవడికి చేసుకున్నారు." కాగిన పాలు మగ్ లో పోసి, ఇన్స్టంట్ కాఫీ పొడి కలుపుతూ చెప్పింది.

"మరి పెదబాబాయ్ అన్నయ్యగారమ్మాయి పెళ్ళెప్పుడో?"

"ఎవరూ? లతా?"

"నా తలకాయ. నీకు జోక్ చెప్పి దానికి అర్థం చెప్పడం కంటే.." పక్కనున్న గోడకి తలబాదుకుంటున్నట్టూ అభినయించాడు.

పకపకా నవ్వి రెండో కప్ లో పాలు పోసి కాఫీపొడి కలపబోయింది. ఆగమని సైగ చేసి కప్ అందుకుని చెప్పాడు. "కాఫీ మానేసాను."

"అదేంటి! హెల్త్ కాన్షస్!" ఆశ్చర్యంగా అడిగింది.

"ఏం లేదు. ఊరికే మానేద్దామనిపించింది." హాల్ లోకి దారితీసాడు.

"ఇంతకీ ఈ గౌతమి ఫేస్ బుక్ లో ఉన్నట్టుంది కదూ!" టీపాయ్ మీదున్న మేగజైన్ తిరగేస్తూ యథాలాపంగా అడిగినట్టూ..

"ఉందిగా.. నిన్ను యాడ్ చేసుకోమన్నాను మరి. ఇంతకీ నీకు గుర్తొచ్చిందా?" క్రీగంట చూస్తూ అడిగింది. రాకపోతే చెంపదెబ్బనెలా గుర్తుచేద్దామా అని ఆలోచిస్తూ..

"చిన్నప్పుడు కొట్టింది నన్ను.. రాక్షసి!" అన్నాడు సన్నగా నవ్వుతూ.

"హేయ్.. నీకు గుర్తుందన్నమాట! తనకీ గుర్తుంది. నాకిప్పుడెంత ఎక్సైటింగ్ గా ఉందో! మీరిద్దరూ ఎలా మాట్లాడుకుంటారో అని. తనూ వచ్చేస్తూ ఉంటుందీపాటికి." పకపకా నవ్వేస్తూ చెప్పింది మహతి.

"నీ ఎక్సైట్మెంట్ కి భంగపాటు తప్పదమ్మాయ్. ఎందుకంటే.." కప్ టీపాయ్ మీద పెట్టి పైకి లేస్తూ చెప్పాడు. "నాకు టైమైపోతోంది. బయలుదేరుతున్నా.."

"అబ్బా ఉండచ్చు కదా.. ఓ హాయ్ చెప్పి వెళ్ళవోయ్." చెయ్యి పట్టి ఆపుతూ అడిగింది.

"హాయ్ దేముంది! ఎప్పుడైనా చెప్పొచ్చు. సీమ ఒక్కర్తే ఉంటుంది కదా." బయటికి నడిచాడు.

"నువ్వు మరీనూ! నిజం చెప్పూ..నీకు తనని ఫేస్ చెయ్యడానికి ఇబ్బందా?" సీరియస్ గా మొహంలోకి తొంగిచూస్తూ అడిగింది.

"ఈ ఫేస్ కి.." మొహం చుట్టూ చూపుడు వేలితో తిప్పి.. "ఎవర్ని ఫేస్ చెయ్యడానికైనా ఇబ్బందిలేదు. టైమైపోతోంది మహతీ.." గేట్ దాకా వచ్చేసాడు.

"సరేలే.. జాగ్రత్త. మళ్ళీ ఊరెప్పుడెళ్తావో ముందు చెప్పు. నేనూ వస్తా." బైక్ స్టార్ట్ చేస్తున్న శబ్దంలో వినిపించదేమో అని గట్టిగా చెప్పింది.

"బై.. గుడ్నైట్.." తనూ అరిచి చెప్పి నడిపించాడు రోడ్ వైపు.

వీధి గేట్ లోకి అప్పుడే వస్తున్న గౌతమిని చూసి మహతి ఒక్కరుపు అరిచింది.. "వంశీ.. అదిగో గౌతమి.."

# 5

వీధి గేటులోకి అప్పుడే వస్తున్న గౌతమిని చూసి మహతి ఒక్కరుపు అరిచింది.. "వంశీ.. అదిగో గౌతమి.."

వీధికి కుడివైపునుంచి నడుచుకు వస్తూ తలెత్తిన గౌతమికి, గుమ్మంలో నిలబడి చేతులూపుతున్న మహతి కనిపించింది.

"ఏంటి మేడమ్.. డాన్స్ చేస్తున్నావూ?" అడగబోతున్న గౌతమికి "వంశీ అదిగో.. " అని చూపించింది మహతి. ఆమె మెదడుకి సిగ్నల్ వెంటనే అందలేదు. అయోమయంగా మహతి చూపిస్తున్నవైపు చూసింది. ఇంటికి కాస్త దూరంలో ఆగిఉన్న బైక్. రెండు సెకన్ల తరువాత గౌతమి ముఖంలోకి జివ్వున ఎగిసిన రక్తం.. ఏదో చిన్న ఇబ్బంది.

"రావోయ్ వెనక్కీ.." మహతి వీధిలోకి చూస్తూ అరిచింది మళ్ళీ .

బైక్ పార్క్ చేసి గేటులోకి వచ్చాడు. సన్నగా గాలి వీస్తున్న శబ్దం.. ఎక్కడో పార్క్ లోంచి వినిపిస్తున్న పిల్లల అరుపులు, వీధిలోంచి వెళ్తున్న వాహనాల శబ్దాలు. మసకచీకట్లు కమ్మేస్తున్నాయప్పుడే.

"హాయ్.." చెయ్యి చాపాడు.

"హాయ్.." క్షణకాలపు కరచాలనం.

మహతి నవ్వుతూ చూస్తోంది. గౌతమి చేతిని వదిలిన వంశీ కుడిచేయి అతని చెంపని నిమిరిందో క్షణం.

ఫకాలున నవ్వింది మహతి. "పర్లేదు. గుర్తున్నానన్నమాట!"గౌతమి సన్నగా నవ్వుతూ చేతులు కట్టుకుంది.

"ఓ.. యెస్! ఎలా ఉన్నావ్?" స్నేహంగా ఉందా మాట.

"గ్రేట్. నువ్వూ.."

ఫోన్ మోగింది. డిస్ప్లే వైపు చూసి కాల్ కట్ చేసాడు.

"బావున్నా.. సారీ! వెళ్ళాలి. ఇక్కడే ఉంటావు కదా. కలుద్దాం." మళ్ళీ చెయి చాపాడు.

"వీకెండ్ ప్లాన్ చెయ్. కాసేపు ఉండేలా.." చెప్పింది మహతి. తలూపుతూ బై చెప్పి బైక్ స్టార్ట్ చేసాడు.

***

"సో.. అలా అయిందారోజు. సీమకి సైంటిస్టులు నచ్చరు. రెండుసార్లు వెళ్ళానంతే వాళ్ళింటికి. కానీ భలే బావుంటుందా అమ్మాయ్. మనలా ఎడ్డె మొహం కాదు. She looks rich and behaves rich." పెరుగన్నం కలుపుతూ చెప్పింది మహతి.

ఊ కొడుతూ తింటోంది గౌతమి. "వంశీకి ఫేస్ బుక్ లో రిక్వెస్ట్ పంపాను." అని చెప్పబోయి ఆగిపోయింది.

"హేయ్.. వంశీకి అంతలా గుర్తుందా?" అడిగింది మహతి. సోఫాలో కూర్చుని మేగజైన్ తిరగేస్తున్న గౌతమి తలెత్తి చూసింది.

"ఏది? ఎంతలా?"

"నువ్వు కుడిచెంప మీద కొట్టావని కూడా గుర్తుందా!"

అర్ధం కానట్టు చూసింది గౌతమి.

"నువ్వు లెఫ్టీ వి కదా.. తను కుడిచెంప తడుముకున్నాడు. నీకు షేక్ హేండ్ ఇచ్చిన చేత్తోనే..!"

"హబ్బా.. ఆ అమ్మాయి నిన్ను సైంటిస్టందని గింజుకుంటున్నావు కానీ.. అన్ని విషయాల్లోనూ సైంటిస్ట్ వే నువ్వు. మరీ ఎక్కువ ఆలోచిస్తావ్ మహతీ. మామూలుగా తడుముకుని ఉంటాడు." కొట్టిపారేసింది గౌతమి.

"ఏమో.. అనిపించింది. అన్నట్టు.. టామ్ క్రూజ్ లెఫ్టీ యే తెల్సా!"

"ఊ.."

"కెను రీవ్స్ కూడా.."

"ఊ.. కాంతారావో.."

"కాంతారావ్?"

"సా మిల్లు వాళ్ళబ్బాయి" మేగజైన్ మొహానికి అడ్డు పెట్టుకుని పకపకా నవ్వింది గౌతమి.

"నువ్వసలూ..! నీకు గుర్తుందా?" ఆపుకోలేక గలగలా నవ్వేసింది మహతి కూడా.

హైస్కూల్ ఎదురుగా అందరి ముందూ 'మహతికోటి' రాసి ఉన్న నోట్ బుక్ మహతి చేతిలో పెట్టేసి, "ఐ లవ్ యూ మహతీ" అని అరుస్తూ, సైకిల్ మీద రివ్వున వెళ్ళిపోయిన బక్కపలచటి కాంతారావు గుర్తొచ్చి మళ్ళీ మళ్ళీ నవ్వొచ్చింది.

"ఏం చేస్తున్నాడో.. ఈ మధ్య కాలంలో వినలేదు. వంశీనడిగితే తెలుస్తుంది. శ్రీకాంత్ కదా ఆ అబ్బాయ్ పేరు? టైట్ పేంట్ వేసుకుంటాడని కాంతారావనేవారు పాపం!" అంది మహతి.

"ఊ ఊ.. హైస్కూల్ స్వీట్ హార్ట్! ఏమో ఎవరికి తెలుసూ.. రీయూనియన్ ప్లాన్ చేద్దామా?"

"ఆ.. ఇంకా మనకోసం కాసుక్కూచుంటారేంటీ. ఈపాటికి హేపీ గా నాలుగేళ్ళ పాప, ఏడాది బాబుని పక్కనేసుకు బజ్జుని ఉంటాడు సతీసమేతంగా.."

"ప్చ.. బొత్తిగా ఆశావాదం చచ్చిపోయింది యువతలో.." లేప్టాప్ ఆన్ చేస్తూ చెప్పింది గౌతమి.

"నా సంగతికేం కానీ.. చెప్పు.. ఎన్నిసార్లడిగినా దాటేస్తున్నావ్. Seeing anyone?"

"ఉహూ.."

"ఏం?"

"ఏమో.. కనబడలేదు ఎవరూ.."

"నమ్మను." చేతులు ఒళ్ళో పెట్టుకు ముందుకు వంగి చెప్పింది మహతి.. "నువ్వు చెప్తే నీకో సీక్రెట్ చెప్తా.."

"నీ సీక్రెట్ కోసం నేనబద్ధం చెప్పాలా ఇప్పుడు?" ల్యాప్టాప్ లోంచి తలెత్తకుండానే నవ్వింది గౌతమి.

"అబ్బా అలాకాదూ.. చెప్పు. నాకంటే ఒక కారణం ఉంది. నీకేంటీ?"

"You too Brutus! పెళ్ళే పరమార్ధమా?" ఫేస్ బుక్ లో 'Vamsi Kattamoori accepted your friend request' అన్న నోటిఫికేషన్ ని చూస్తూ అడిగింది.

"అలాంటి ప్రశ్నలేస్తే నేను నీ బుర్రతినే థియరీలు చాలా చెప్తాను. అలా కాదు కానీ.. చెప్పు."

"నిజంగా మహతీ.. పెళ్ళెందుకు? అనే ప్రశ్నకి సరైన సమాధానం దొరికితే చేసుకుంటాను. దొరికినప్పుడు.. " తన మాట తనే సరిదిద్దింది.

"ఒంటరిగా అనిపించలేదా ఎప్పుడూ?"

"పెళ్ళితో అందరూ జంటలైపోతున్నారా?! చేసుకు సుఖపడినదెవ్వడు.. అనను కానీ.. లాటరీ కదా పెళ్ళంటే."

"ట్రూ! కానీ.. పిల్లలు?"

"జగమంత కుటుంబం నాది.. అనేదో పాట ఉంది కదూ! అయినా ఎడం చేతివాటం ఉన్నవాళ్ల life expectancy తక్కువ. మిగిలినవాళ్ళకంటే తొమ్మిదేళ్ళు ముందు పోతారట. అరవై చూడనేమో ఈ లెక్కన. ఇప్పుడు చేసుకు పిల్లలని కనచ్చు కానీ మనవల్నైనా చూడగలనా? మా బామ్మ చెప్పేది.. మనవడా.. నీ మనవడేడీ? అనడగగానే వైకుంఠ ద్వారాలు ధామ్మని తెరుచుకుంటాయట! ఎలాగూ వైకుంఠానికి పోలేను కదా.. ఇంకెందుకనీ.." నవ్వుతూ మాట్లాడుతున్న గౌతమి సీరియస్ గా తనవైపే చూస్తున్న మహతిని చూసి ఆగిపోయింది.

"నాకు పెళ్ళి మీద నమ్మకం లేదు మహతీ.."

"ఊ..."

గౌతమి మాట్లాడుతూనే ఉంది. తన కారణాలు, భయాలు నిస్సంకోచంగా చెప్తూ.. మధ్యలో మహతి అడుగుతున్న ప్రశ్నలకి వివరణ ఇస్తూ.. అరగంట తరువాత సోఫాలో వెనక్కి వాలి కళ్ళు మూసుకుంది గౌతమి.

"నీవన్నీ కేవలం భయాలేనేమో అనిపిస్తోంది." చెప్పింది మహతి.

"చూద్దాం.. మనకు తెలియకుండానే మనం సమాజంకోసం చాలా చేస్తాం. ఐదేళ్ళకి స్కూల్లో వెయ్యాలి అనే రూల్ మొదలు.. ఇంటర్మీడియట్ అయ్యాక ఎమ్సెట్ రాయాలనేదాకా.. నచ్చినా నచ్చకపోయినా పాటించి తీరుతాం. పెళ్ళి కూడా సమాజం కోసమే చేసుకుంటాం. సంఘజీవులం కదా! తప్పని చెప్పను కానీ.. తప్పనిసరి కాదు. నావరకూ అసలు కాదు." గౌతమి స్థిరంగా చెప్పింది.

"నీకో సీక్రెట్ చెప్తానన్నాను కదా..." వేడెక్కిన వాతావరణాన్ని చల్లబరిచేందుకు అడిగింది మహతి..

"ఊ ఊ.."

మహతి లేప్టాప్ తెరిచి చకచకా మైల్ లోకి లాగిన్ అయి, ఓ అటాచ్మెంట్ ఓపెన్ చేసి చూపించింది. గూగుల్ మేప్స్ స్క్రీన్ షాట్ అది. ఒక అడ్రస్ మార్క్ చేసి ఉంది ఎర్రటి హృదయంలో.. "my heart lives here.." అని రాసుంది పక్కనే. మరోసారి చూసింది గౌతమి. అది మహతి ఇంటి అడ్రస్!

"కూల్..! ఎవరీ రొమాంటిక్ గై..?" అడిగింది నవ్వుతూ.

"నా సీనియర్. వేరే డిపార్ట్మెంట్ లే. సైకాలజీ."

"సైంటిస్ట్ లు ఇలా ప్రపోజ్ చేసుకుంటారనమాట!"

"తను సైంటిస్ట్ కాదు. డాక్టర్." చెప్పింది మహతి.

"ఏం చెప్పావు మరి?"

"ఏమో.. డైలమా. మరోసారి దెబ్బతింటానేమో అని భయం."

"దూకేయమని చెప్పను కానీ.. ఆలోచించు. ప్రతీసారీ దెబ్బలే తగలవు. ఏమో.. తంతే బూరెలగంపలో పడతావేమో!" గౌతమి నవ్వింది.

"నేనూ అదే చెప్తున్నా. Keep your heart open. గుండె గది ఖాళీ.. ఉండిపోతావా.. " పాడింది మహతి.

***

"ఈ మధ్య అన్నం తినడం మానేసి మరీ అట్లాస్ లా కంపెనీని భుజాల మీద మోసేస్తున్నట్టున్నావ్! నెల్లాళ్ళవుతోంది నాకు కాల్ చేసి. గుర్తుందా అసలు? అంత బిజీ ఏంటీ! చెయ్యొద్దనుకున్నా కాల్.." యుద్ధానికొచ్చిన మహతిని పావుగంట మాట్లాడి శాంతింపచేశాడు వంశీ.

"ఊరెళ్తున్నా ఎల్లుండి." ఫోన్ పెట్టేసేముందు చెప్పాడు.

"ఓయ్.. ఆగాగు. ఇంత లేట్ గానా చెప్పేదీ.. నేనూ వస్తానన్నాను కదా ఈసారెళ్ళినప్పుడూ.." అరిచింది మహతి.

"పెదరాయవరం కాదు. అమ్మమ్మా వాళ్ళూరు. తెలుసు కదా జాతర మిస్ అవననీ. ఈసారి గరుడముద్ద కూడా ఉంది."

"రావిపాడేనా? నేనెప్పుడూ చూడలేదు అక్కడి జాతర. నాల్రోజుల ముందు చెప్పొచ్చు కదా.. వచ్చేదాన్నీ."

"Need to rush.. మీటింగ్ ఉందిప్పుడు. సాయంత్రం మాట్టాడుతా.."

"పాండీ కి రా.."

"ఊ.. బై.."

***

ఐదు గంటలకి మహతి దగ్గర నుండి వచ్చిన రిమైండర్ చూసేదాకా వంశీకి పాండీ కేఫ్ విషయం గుర్తేలేదు. సీమకి లేటవుతుందని కాల్ చేద్దామా, టెక్స్ట్ చేద్దామా అనుకుంటూ ఉండగానే ఫోన్ రింగయింది.

"హలో.."

"వంశీ.. లక్ష్మీనగర్ లో ఉన్నాను. ఇలా వచ్చేయ్."

"లేటవుతుందేమో సీమా.."

"ఎప్పుడు అవదు కనుక! డిన్నర్ కి ఉండిపోమంటున్నారు బాబాయ్ వాళ్ళు.. వచ్చేసెయ్."

"డిన్నర్ కి రాను. తీసుకెళ్ళడానికొస్తా ఏడున్నరకి."

"ఏం... ఎందుకు రావు? నేనొక్కర్తినే మింగడానికా వచ్చింది.."

"ముందు చెప్పాలి కదా సీమా.. సడన్ గా అలా బోయనాలకి వెళ్ళడం నాకిబ్బంది. కిందటి నెలేగా వెళ్ళాం."

"లెక్కేస్తున్నావా? నువ్వు నెలకోసారి వెళ్ళడం లేదూ పుట్టింటికీ! సరేలే. నీకెప్పుడు గిట్టింది కనుక. నేనూ వచ్చేస్తాను. ఇంటికెళ్ళే ఏడుద్దాం ఆ బోయినమేదో.."

"సాధించుకునే పద్ధతి ఇది కాదు సీమా.." అనబోయి ఆగిపోయాడు. "నువ్వు తినేసి రెడీగా ఉండు. టెక్స్ట్ చేస్తా వచ్చేముందు" చెప్పి కాల్ కట్ చేసాడు.

***

"ఎల్లుండి రాత్రి బస్ కా అయితే." పిస్తా కుల్ఫీ పూర్తి చేసింది మహతి.

"ఈ స్ట్రాబెర్రీ ఫ్లేవర్ ట్రై చెయ్ ఈసారి. బావుంది. ఊ.. అవును."

"నాకు జెలూసిల్ సిరప్ గుర్తొస్తుంది స్ట్రాబెర్రీ ఫ్లేవర్ అంటే. నో.."

"అబ్బా.. హేమి పోలికా..! హేమి పోలికా. .!! You gotta try new things, Scientist!"

"సరే అయితే.. జాతర బాగా ఎంజాయ్ చెయ్యండి." వాచ్ చూసుకుంటూ చెప్పింది మహతి.

"చెయ్యండి?"

"ఒక్కడివే వెళ్తున్నావా?"

"ఊ.. మరి?"

"ఓ.. ఓకే. కంపెనీ ఇవ్వాలనే ఉంది కానీ.. సీమ రాకపోతే.."

"ఊ ఏం? తనకేదో ఫంక్షన్ ఉంది వాళ్ళ బాబాయ్ ఇంట్లో. రావాలనుకున్నపుడు వచ్చేయొచ్చు కదా! నీచేత పులివేషం కట్టిస్తా.. బక్కపులి.." నవ్వాడు.

సీరియస్ గా ఐస్క్రీమ్ తింటున్న గౌతమికి పొలమారింది. వంశీ నవ్వాపి ఆమె వైపు చూసాడు. తలమీద కొట్టుకుంటూ.. నవ్వాపుకోడానికి ప్రయత్నిస్తున్న గౌతమి వైపు చూసి, మూతిముడుచుకున్న మహతి తనూ నవ్వేసింది.

"నువ్వూ రా పిల్లా.. సరదాగా వెళ్దాం. రావిపాడు తెలుసు కదా?"

"నేనెక్కడికీ.. నెలాఖరికి ఎగ్జిబిషన్ ఉంది ముంబై లో. ఇంకా చాలా వర్క్ పెండింగ్."

"నువ్వు ఆ ఊళ్ళో జాతర్లో మాంచి ఫోటోస్ తీసి ఎగ్జిబిషన్లో పెడితే.. ఏ అభిషేక్ బచ్చనో, ఏ రణ్బీర్ కపూరో.. చూసి కొనేసుకుంటారు." సీరియస్ గా చెప్పింది మహతి.

"పులి ఫోటోయేనా.. నిజమే!" అంగీకరిస్తూ తలూపింది గౌతమి. పకపకా నవ్వాడు వంశీ. కళ్ళలో నీళ్ళొచ్చేలా.. మహతిని చూస్తూ..

"ప్చు.. నేను రాను పొండి." ఉడుక్కుంటున్న మహతిని చూసి నవ్వుతూ, గౌతమి వంశీ వైపు చూపు సారించింది. టిష్యూతో కళ్ళు తుడుచుకుంటూ నవ్వుతున్నాడింకా.

"ఎన్ని గంటలకి బయలుదేరుదాం?" అడిగింది గౌతమి.

ఒక్క క్షణం ఆశ్చర్యంగా చూసి తమాయించుకుని చెప్పాడు.. "తొమ్మిదిన్నరకి బస్.. "

# 6

*ఆకాశం మీద అప్సరసలు*

*ఒయ్యారంగా పరుగులెత్తుతున్నారు*

*వారి పాదాల తారామంజీరాలు*

*ఘల్లుఘల్లని మ్రోగుతున్నాయి*

"ఎంత బా చెప్పాడసలు! నిజంగానే అప్సరసలు తిలక్ కంటపడే ఉంటారు. ఏ చామీకర చషకంతోనో అమృతం తాగించే ఉంటారు. అదే నన్ను ముక్కుపట్టి తాగించినా ఒక్క చుక్కైనా మింగుతానా? No way! ఇంతోటి గానుగ ఆడ్డానికీ కలకాలం ఉండిపోవాలా ఏంటీ..!" నవ్వుకున్నాడు వంశీ. కదులుతున్న బస్ కిటికీలోంచి వెనక్కి పరిగెడుతున్న ఆకాశం చుక్కలతో మెరిసిపడుతోంది. నడిమింటనున్న జాబిలి పదిహేనేళ్ళమ్మాయిలా ఒక్క కళ తక్కువగా మిసమిసలాడుతోంది. ఒకటీ అరా మబ్బులు హాయిగా తేలుతున్నాయి.

"సినిమాల్లో చూపించినట్టూ ఈ బస్ కనుకా మధ్యలో చెడిపోయి ఆగిపోతే నన్ను నిద్రలేపండోయ్ బాబూ! వదిలేసి దిగిపోకండి. నాకసలే నిద్రపడితే తెల్లారేదాకా తెలివిరాదు." శాలువా బిగించి సీట్లో మునగదీసుకుంటూ మహతి చెప్పిన మాటలు గుర్తొచ్చి, నవ్వొచ్చింది వంశీకి. ముందు సీట్లో కిటికీ పక్కన గౌతమి, ఐల్ లో మహతి కూర్చున్నారు.

"శుభమా అని బస్ ఆగిపోడం కూడానా తల్లీ! అయినా నువ్వు తెల్లారేదాకా పడుకోడానికి కుదర్దమ్మాయ్. నాలుగ్గంటలకి దిగుతాం రావిపాడులో. Good night!" చెప్పాడు వంశీ రాత్రి పడుకునే ముందు.

ఇంకో పావుగంటలో బస్ రావిపాడు జంక్షన్ చేరుతుందనగా గౌతమి ఫోన్ లో అలారం మోగింది. లేచి టైం చూసుకుని బధ్ధకంగా ఆవులింతలాపుకుంటూ వెనక్కి చూసింది. కిటికీలోంచి బయటకు చూస్తున్నాడు వంశీ. లయగా కదులుతున్న బస్. గాలిని వణికిస్తున్న చలి. మహతిని తట్టిలేపింది గౌతమి. తుళ్ళి పడి లేచి "వంశీ.. లే.. లే.." అంటూ ఒళ్ళో ఉన్న హేండ్ బ్యాగ్ ని తీసి భుజానికి తగిలించుకుని లేవడానికి సిధ్ధపడింది.

***

రోడ్ పక్కగా నిలబడి ఒళ్ళు విరుచుకున్నాడు వంశీ. మహతీ, గౌతమీ చుట్టూ చూస్తున్నారు. దూరంగా వెలుగుతున్న టీ కొట్టు వైపు చూపిస్తూ.. "అక్కడ ఉంటానని చెప్పాడు రాంబాబు. పదండి." అని నడిచాడు వంశీ.

"రాంబాబా! రానేదనుకుంతా సారూ. ఫోను సేసి సూడండి. " ఉచితసలహా ఇచ్చాడు టీ షాప్ అబ్బాయి. ఫోన్ చెయ్యబోతూంటే ఆపింది మహతి.

"ఎంతదూరం ఊరు?"

"రెండు కిలోమీటర్లుంటుంది. ఆటో తెస్తానని చెప్పాడు. పదినిముషాల్లో వచ్చేస్తాడిప్పుడు బయల్దేరినా.." చెప్పాడు వంశీ.

"అక్కర్లేదైతే. నడిచేద్దాం." గౌతమి వైపు కూడా చూస్తూ అంది మహతి.

"చలిలో నడకా..!"

"మొక్క మొలిచిపోం కానీ.. " మహతి తన మాటలు తనకే అప్పచెప్పిందని గ్రహించి నవ్వాడు వంశీ. సాలోచనగా గౌతమి వైపు చూశాడు.

"నాకేం పర్లేదు. కూల్! నడిచేద్దాం." తలూపింది గౌతమి.

"దారి బానే ఉంటుంది కదా.." టీ అబ్బాయిని అడిగాడు ఎందుకైనా మంచిదని.

"బెమ్మాండం సారూ. తార్రోడ్డు. యెన్నెల." -

"*నల్లజర్ల అడవి మీద చంద్రుడు భయంకరంగా ఉదయించాడు.*- అని అవధాని చేత చెప్పించిందీ అదే తిలక్!" అనుకున్నాడు వంశీ. ముగ్గురూ మౌనంగా నడుస్తున్నారు. కీచురాళ్ళ పాటకి వాళ్ళ అడుగుల శబ్దం తాళమేస్తోంది. ఓ పదినిముషాల నడక తరువాత రోడ్డుకి ఇరువైపులా ఖాళీ స్థలం.. రోడ్ పక్కనే ఉన్న ఓ రాయి మీద కూర్చుంది మహతి.

"అయిపోయిందా ఓపిక?" నవ్వింది గౌతమి.

"ఉహూ.. అలా చూడు." ఆకాశం వైపు చూపించింది.

"స్టార్ గేజింగా ఇప్పుడు!" అనబోయి ఆగాడు వంశీ.

"ఇంత క్లియర్ స్కై సిటీలో కనిపించదు. వెన్నెలున్నా ఎంత స్పష్టంగా కనిపిస్తోందో ursa major!" మహతి తలపైకెత్తి చురుగ్గా పరిశీలిస్తోంది.

అదే రాయి మీద తనూ సర్దుకు కూర్చుంది గౌతమి. బ్యాగ్ కిందకి దింపి చేతులు రుద్దుకుంటూ నిలబడ్డాడు వంశీ.

"ఊ.. చెప్పు!" అడిగింది గౌతమి.

"వద్దులే.. పోదాం." మహతి లేవబోయింది.

"చూసుకో చూసుకో.. నేనేం అనలేదు నిన్ను. మళ్ళీ ఇంతా చేసి 'మీ ఊళ్లో ఫ్రీగా చుక్కల్ని కూడా చూడనివ్వలేదన్న' అప్రతిష్ట నాకెందుకూ!" వంశీ కవ్వించాడు.

"నాకేం అక్కర్లేదులే! ఎక్కడికెళ్ళి నా ఇదే గోలా అని మళ్ళీ తిట్టుకుంటారు. " చిన్నబుచ్చుకుంది మహతి.

"లేదు మహీ. చెప్పు. ఇంటరెస్టింగ్ గా చెప్పాలి మరి! స్వాహిలీలో మాట్లాడకుండా." నవ్వాపుకుంటూ ప్రోత్సహించాడు.

"సరే అచ్చ తెలుగులోనే చెప్తాను. అటు చూడు. ఆగ్నేయంలో.. "

"ఆగ్నేయమా..! నీకో దణ్ణం తల్లీ! కొంకిణీలో కానిచ్చేయ్ ఈ సారికి." వంశీ మాటలకి సన్నగా నవ్వింది గౌతమి.

ఆ మాటలు అస్సలు పట్టించుకోకుండా ఆకాశాన్ని చూస్తూ చెప్పుకుపోతోంది మహతి."రేపు పున్నమి కదా. అదే అమావాస్యయితే ఎంత బావుండేదో! ఇంకా స్పష్టంగా కనిపించేది Milky Way. North లో సప్తర్షి మండలం, South East లో Milky Way.. అదే.. పాలపుంతా కనిపిస్తాయ్. మన పురాణాల్లో చెప్తారు కదా విష్ణుమూర్తి పాలసముద్రంలో ఉంటాడనీ! ఆ పాలసముద్రమే ఈ పాలపుంత అనుకుంటే.. దక్షిణాన విష్ణుమూర్తి ఉంటే, ఉత్తరాన సప్తర్షులు ఉండడం ఎంత లాజికల్ కదా! వైకుంఠ ఏకాదశికి మనం అందుకే ఉత్తరద్వారం నుండి దర్శనం చేసుకుంటాం."

"ఆగాగు! అరచేతిలో వైకుంఠం చూపించడం అంటారు కానీ, ఆకాశంలో.. అనరు సైంటిస్టూ! అయినా నువ్విలా పురాణాలన్నీ చుక్కల్లో చూపించేస్తున్నావే! ఇవన్నీ నిజమే!" ఆశ్చర్యాలు పోయాడు వంశీ.

"ఏహే వినూ. You gotta imagine! క్షీరసాగరం లక్ష్మీదేవికి పుట్టిల్లంటారు కదా. మరి లక్ష్మి అక్కగారి పేరేవిటీ?"

"జ్యేష్ఠాదేవీ.." ట్రివియా గర్వంగా ఆన్సర్ చేసేసాడు.

"ఊ.. ఆ జ్యేష్ఠాదేవే జ్యేష్ఠా నక్షత్రం అనుకుంటే.. అది పాలపుంత పక్కనే కనిపిస్తుంది తెలుసా.. అదే దిక్కులో! Scorpius అంటారు దాన్ని. అది కనిపించాకే.. అంటే అక్కగారి వెనుకే తమ్ముడు వస్తాడు ఆకాశంలోకి. ఎవరోయ్ ఆ తమ్ముడూ? చందమామ! జ్యేష్ఠ, చందమామ, పాలపుంత .. ఒక సీజన్లో ఇదే ఆర్డర్ లో రైజ్ అవుతాయి. Makes sense కదా!"

"నిజమా!" నమ్మలేనట్టు అడిగింది గౌతమి.

"యెస్.. పురాణాలు నిజమా కాదా అనేది పక్కన పెట్టేస్తే, ఆ వ్యాసుడనే రైటర్ చాలా Smarty pants తెలుసా! తారోంకో జమీన్ పె ఉతారా! ఆ మాటకొస్తే మన పూర్వీకులందరూ భలే తెలివైనవాళ్ళు లే! చాలా గొప్ప astronomical details ఎంచక్కా కథల్లో దాచేసారు. మనం మర్చిపోకుండా అన్నమాట! అంతవరకూ ఎందుకూ.. ధ్రువుడు విష్ణుమూర్తి భక్తుడని చెప్తారా.. ధ్రువనక్షత్రం కూడా పాలపుంతని చూస్తున్న డైరెక్షన్ లో అంటే నార్త్ లో, సప్తర్షుల పక్కగా ఉంటుంది. ధ్రువుడు మహాభక్తుడు అని ఓ మంచి కథ అల్లి, 'ఆకాశంలో ధ్రువనక్షత్రంలా కదలకుండా ఎప్పటికీ నిలిచిపోమని వరమిచ్చాడు విష్ణుమూర్తి!' అని నూరిపోసేసారు మనకి. ఎందుకంటే.. ధ్రువ

నక్షత్రం.. Polaris ని చూసే పూర్వం నావికులు, ప్రయాణాలు చేసేవారూ దిక్కులు తెలుసుకొనేవాళ్ళట. Polaris చాలా faint గా ఉన్నా అస్సలు కదలదు. ఆకాశంలో ఏ నక్షత్రం మారినా అది మారదు."

"గ్రేట్!!" ఇద్దరూ ఒకేసారి అన్నారు.

"అవును. నిజంగా గ్రేట్! మన పూర్వీకులు Sky maps ని చాలా తెలివిగా ఇలా కథల్లో పెట్టి మనకి ఇచ్చేసారెప్పుడో!" రాయి మీద నుండి లేచింది మహతి.

"జ్యేష్టాదేవి ఏదీ?" అడిగాడు వంశీ ఆకాశంలోకి చూస్తూ.

"హహహ్.. చాలా అందంగా ఉంటుంది తెలుసా! ఎంత ఒయ్యారంగా ఉంటుందో Scorpius. Beautiful constellation!" ఆగ్నేయం వైపుగా లీలగా కనిపిస్తున్న పాలపుంతనీ, కళ్ళు చికిలించుకున్నా అర్థం కానట్టున్న జ్యేష్ఠ నీ చూపించింది.

"అబ్బా! ఏం కనిపిస్తోందసలు! అంతా ఊహించుకోవడమే. అప్పుడెప్పుడో అరుంధతినీ అలాగే చూసాను." విసుగ్గా చెప్పాడు వంశీ.

"హేయ్, అరుంధతి కనిపించలేదా నీకు? నేను రాలేదు కానీ నీ పెళ్ళికీ.. లేదంటే చూపించి తీరేదాన్ని." నవ్వింది మహతి.

"ఆ.. నా తలకాయ! పెళ్ళిలో అరుంధతినీ, పెళ్ళయ్యాక మనశ్శాంతినీ చూడగలిగినవాడు భూప్రపంచంలో లేడు." నడుస్తూ చెప్పాడు.

"హహ్హహ్.. ఏం స్టేట్మెంట్లు ఇస్తున్నావోయ్ కుటుంబరావ్! అంతలేసి పాట్లేం పడిపోతున్నావూ.."

మౌనంగా నవ్వుతూ నడుస్తున్న గౌతమి ఆసక్తిగా తలెత్తి చూసింది. ఊరివైపు వడివడిగా నడుస్తున్నాడు వంశీ. అతని నడకని అందుకోడానికి పరుగందుకోవలసివచ్చింది అమ్మాయిలిద్దరికీ.

***

"రాంబాబుకే చెప్పావూ! వాడు రాత్రి తాగింది దిగాక వెళ్తాడు జంక్షన్ కి. నేనేదో ఏర్పాటు చేసేవాణ్ణిగా! పాపం, ఆడపిల్లలని నడిపించావు ఉదయాన్నే. మీ అత్తనడిగితే వచ్చేస్తానన్నాడు వంశీ అనేసింది. నువ్వే కార్ లోనో వస్తావేమో అనుకున్నాను." నొచ్చుకున్నాడు గోపాల్రావు మావయ్య.

"పర్లేదు మావయ్య గారూ. మార్నింగ్ వాక్!" పేపర్ అందుకుంటూ చనువుగా ఆయనకి కాస్త పక్కగా, ఇంటి అరుగెక్కి కూర్చుంది మహతి.

వంశీ ఆయనకి ఎదురుగా కూర్చున్నాడు. కాఫీ గ్లాస్ తో బయటికి వచ్చి మహతి పక్కనే సెటిలయ్యింది గౌతమి. నువ్వు తాగావా అన్నట్టు

మహతికి సైగ చేస్తూ..

"ఓ.. అయిపోయింది పిల్లా. అన్నట్టు మావయ్య గారూ, జాతర కాకుండా మీ ఊళ్ళో చూడ్డానికేమున్నాయండీ?" గోపాల్రావుని ఇంటర్వ్యూ చెయ్యడం మొదలుపెట్టింది.

"పాండవుల కోనేరుందమ్మా. బావుంటుంది. ఇంకా ఏవున్నాయీ..! చీకటి పడితే జాతర్లో పులివేషాలు చూడొచ్చు."

కిసుక్కున నవ్వాడు వంశీ. గౌతమికీ నవ్వొచ్చేసింది.

"పులివేషాలు కాకుండా.." ఉడుక్కుంటూ ఒత్తి పలికింది మహతి.

"ఏవుంటాయమ్మా పల్లెటూళ్ళో! సుబ్బరంగా కావల్సినవి చేయించుకు తిని, ఊరంతా చుట్టిరండి. మీకే బోలెడు వింతలు కనిపిస్తాయ్. రేపు వేణుగోపాలస్వామి కల్యాణం, రాత్రికి గరుడముద్ద."

"అవునయ్యా వంశీ, మీ ఆవిడని తీసుకురావల్సింది కదా? గరుడముద్దకి ఉండేది. పెళ్ళై మూడేళ్ళు కావస్తోందేమో!" గుమ్మంలో నిలబడి అడిగింది రాజ్యం.

"లేదత్తా, వాళ్ళ బాబాయింట్లో ఏదో ఫంక్షన్." ముక్తసరిగా చెప్పాడు.

"లేవండమ్మా అమ్మాయిలూ, స్నానాలు కానిచ్చి కోవెల్లోకి వెళ్ళండి. వచ్చే ఏడాదికి మీ పెళ్ళిళ్ళైపోనిదే మా వేణుగోపాలస్వామి ఊరుకోడు." రాజ్యం లోపలికెళ్తూ చెప్పింది.

మహతీ, గౌతమీ మొహాలు చూసుకుని లోపలికి నడిచారు. గౌతమి పెదాలమీద నవ్వు చెరగలేదు. మహతి పెదవి మునిపంటి కింద నలగక తప్పలేదు.

***

"వాటీజ్ దిస్ గరుడముద్దా? ఆకాశంలో ఎగిరే గద్దలకి ఆహారపథకం లాంటిదేమన్నానా?" వేణుగోపాలస్వామి కోవెల వెనకవైపున్న కోనేటిమెట్లమీద కూర్చుని కొబ్బరి చెక్క పగలగొడుతూ అడిగింది మహతి.

"వాటేనైడియా సర్జీ! ఊహించుకోడానికే భలే వెరైటీగా ఉంది. గద్దలకి ముద్దలెగరెయ్యడం." వేళాకోళం చేసాడు వంశీ.

తెలతెల్లటి కోవెలగోపురం మీదనున్న బంగారుకలశాలకి ఉదయపుటెండ మెరుగులు పెడుతోంది. కోయిల కూత గాలిలో గిరికీలు కొడుతోంది. కోనేటి తరగల మీదనుండి తేలివస్తున్న వేప పూల సువాసన, ఉండుండి తులసివనం పంపుతున్న పరిమళంతో కలిసి

వింతగా గుబాళిస్తోంది. ప్రశాంతత నిశబ్దంలో మాత్రమే ఉండదని నిరూపిస్తూ, ఉండుండి గంభీరంగా ఖంగుమంటోంది కోవెలగంట. మెట్టు మీద కూర్చుని చల్లటి నీళ్ళలో కాళ్ళు వేలాడేసుకుని తదేకంగా నీటితరగలని చూస్తోంది గౌతమి.

"సంతాన వేణుగోపాలస్వామి కదా ఈయన. ఈ ప్రాంగణంలో గరుడముద్దకి కొంగుపడితే పిల్లలు పుడతారని నమ్మకం. బావుంటుంది తంతు. రేపు సాయంత్రం చూద్దువుగాని."

"ఒహ్హో.. అందుకేనా నీ పేరు వంశీ?" గొప్ప విషయాన్ని కనిపెట్టినట్టు మొహం పెట్టింది మహతి.

నవ్వి ఇక వెళ్దామన్నట్టు ముందుకు కదిలాడు వంశీ. అనుసరించారిద్దరూ..

***

"వంశీ..." వెనకనుండి వినిపిస్తున్న పిలుపుకి ఆగి వెనక్కి చూశాడు. మహతీ, గౌతమీ కోవెల ముందు దుకాణాలలో వస్తువుల్ని పరిశీలిస్తూ నడుస్తున్నారు. కోవెల్లోంచి గబగబా నడుచుకు వస్తున్న ఆమెను సులువుగానే గుర్తుపట్టాడు.

"రజనీ ఆంటీ!!" మనసులో ఆశ్చర్యంగా అనుకుని నాలుగడుగులు కోవెలవైపు వేసాడు.

"ఏమయ్యా.. గుర్తుపట్టావా? ఎలా ఉన్నావూ?" పలకరించిందామె. ఐదున్నరడుగుల విగ్రహం, పచ్చని ఛాయ.. ముక్కుకి మెరుస్తున్న బేసరి. నవ్వుతున్న కళ్ళు . నల్లని ముచ్చట ముడిలో అక్కడక్కడ తొంగిచూస్తున్న తెల్లవెంట్రుకలు ఆమెకి వింత సోయగాన్నిస్తున్నాయి. ముదరాకుపచ్చ కోడంబాకం చీరలో నిండుగా ఉంది.

"మీరసలు మారితేగా గుర్తుపట్టకపోవడానికి!! రజనీ ఆంటీ.. ఎలా ఉన్నారు?" నవ్వుతూ పలకరించాడు.

ఆప్యాయంగా వంశీ చేతిని పట్టుకుని "బావున్నానయ్యా.." అంటూ అటుగా వస్తున్న మహతినీ, గౌతమినీ చూస్తూ ప్రశ్నగా వంశీ వైపు తిరిగింది.

"ఫ్రెండ్స్ ఆంటీ. జాతర చూస్తామంటేనూ.." చెప్పాడు.

"మీ ఆవిడ రాలేదా? నేను చూడనే లేదు. మోహన చెప్తూ ఉంటుంది. చిదిమి దీపం పెట్టుకోవచ్చమ్మా వంశీ పెళ్ళాన్నీ అని." నవ్వింది.

"మీకంటేనా! ఏమీ మారలేదు మీరు. మా చిన్నప్పుడెలా ఉన్నారో అలాగే ఉన్నారుగా!" ప్రశంసించాడు.

"పోవయ్యా.. తల నెరవట్లేదూ! బాలనెరుపనుకుంటున్నావా ఏం?" అంటూ వంశీ చేతిమీద చిన్నగా కొట్టి అమ్మాయిల వైపు చూసి పలకరింపుగా నవ్విందామె.

"మా ఊరివాళ్ళే నండీ. పెదరామయ్య గారి మనవరాలీ అమ్మాయ్. మహతి. ఆకివీడాయన. మీకు తెలుసు కదా. ఈ అమ్మాయి గౌతమి. రాచకొండవాళ్ళమ్మాయి." పరిచయం చేశాడు. చేతులు జోడించారిద్దరూ.

"నమస్కారమమ్మా. ఊరంతా చక్కగా చూపించయ్యా వంశీ. ఇంటికి రండి సాయంత్రం." నవ్వుతూ ఆహ్వానించింది.

"తప్పకుండా. మీరు కోవెల్లోకి వెళ్తున్నట్టున్నారూ.." ఆమె చేతిలో పూజసామగ్రి ఉన్న బుట్టవైపు చూస్తూ అడిగాడు.

"అవునయ్యా. నిన్ను చూసి వెనక్కొచ్చా. సరేమరి. సాయంత్రం రా. మీరూ రండమ్మా.." చెప్పి వెనుతిరిగిందామె.

"ఎంత బావున్నారో కదూ!" నడిచివెళ్తున్న ఆమెను చూస్తూ ముచ్చటపడిపోయింది మహతి. అవునన్నట్టు తలూపింది గౌతమి.

"వీళ్ళమ్మాయి పెళ్ళి నేనే చేసాను. ఎవరో చెప్పుకో చూద్దాం.." నవ్వుతూ అడిగాడు వంశీ.

"అవునా! ఎవరూ.. నాకు తెలుసా?" మహతి ఆశ్చర్యపోయింది.

"ఊ.. శ్రీధర్రావు గారి నందూ. గుర్తున్నాడా? మా వెనకిల్లు. మన జూనియర్. వీళ్ళమ్మాయ్ మోహనని చేసుకున్నాడు. పెద్ద కథలే. చెప్తా పద." నడిచాడు వంశీ.

"ఓ ఓ.. వెయిటే మినిట్! గుర్తొచ్చింది. ఏదో అడ్వెంచర్ చేసావు కదూ అప్పట్లో. అర్థరాత్రి ఇంటికొచ్చేసారనీ ఏదో చెప్పావు."

"ఊ.. ఊ.."

"మరి ఈవిడ నీతో ఇంత కూల్ గా ఎలా మాట్లాడుతున్నారు! కట్టేసి కొట్టాలే ఈ పాటికి!"

"వాళ్ళ పెళ్ళికి ఆంటీ అడ్డు చెప్పలేదు. అసలు పెళ్ళికి సమస్య ఈమే.." చెప్తూ మహతి మొహంలో అయోమయం చూసి పకపకా నవ్వేసాడు.

"పద పద.. చెప్తానన్నానుగా. నీకు మాంచి ఎంటర్టైన్మెంట్ ఇస్తున్నా చూడు. బ్రహ్మాండమైన లవ్ స్టోరీ." మహతి తలమీద చిన్నగా మొట్టి కదిలాడు.

"ఓయ్..పరిగెత్తకూ.. నాకు లవ్ స్టోరీస్ అంటే భలే ఇష్టం. చెప్పవూ.." మహతి గబగబా అడుగులేసింది. గౌతమి నవ్వుతూ అనుసరించింది.

## 7

"కొబ్బరి మావిడండయ్యా.. బలే ఉంటాది. కారవెక్కువెట్టొచ్చా అమ్మాయ్ గోరూ.." మహతి, గౌతమిలిద్దర్నీ అడిగాడు నారయ్య. అతని చేతిలో ఉన్న చిన్న చాకు.. చిన్న కొబ్బరికాయ సైజ్ లో ఉన్న మామిడి కాయని వైనంగా పక్షాలు చేసి ఒక్కో ముక్కనీ రెమ్మల్లా కోస్తోంది. సెంటర్ లోని కొబ్బరిబొండాల దుకాణం బయట నారయ్య సైకిల్ స్టాండ్ వేసి ఆపివుంది. సైకిల్ కి కట్టిన జంగిడిలో, సత్తు టిఫిన్ బాక్స్ లో ఉప్పు కలిపిన కారం ఎర్రగా ధగధగలాడుతోంది.

"లేతపరువు కాయల్లా లేవూ! కొబ్బరి మావిడంటే ఎంతుండేదీ!" నారయ్యనడిగాడు వంశీ.
"ఉగాది రాలేదుగా ఇంకా.. " గౌతమి మాటలకి తలెత్తి చూసాడు వంశీ. ఆసక్తిగా నారయ్య వేళ్ళ ని గమనిస్తున్న గౌతమి హేండ్ బ్యాగ్ లోంచి చిన్న డిజిటల్ కేమెరాని తీసి ఫోటో తీసుకుంది. అది గమనించిన నారయ్య సిగ్గుపడ్డాడు.
"సిగ్గుపడకూ.. పొగడ్రు రాసుకొచ్చి మరో రెండు ఫోటోలు తీయించుకో. ఆవిడ బాగా తీస్తారు." వంశీ న్యూస్ పేపర్ లో పెట్టి నారయ్య అందించిన మామిడికాయ ముక్కలు అందుకుంటూ నవ్వాడు. కొబ్బరి బొండాం లో స్ట్రా తీసేసి ఎత్తి మిగిలిన కాసిని నీళ్ళూ నోట్లో ఒంపుకుంటున్న మహతిని చూసి గౌతమి మరో ఫోటో తీసుకుంది.
"ఓయ్ పిల్లా.. పరువు తీసే ఫోటోస్ తియ్యకు చెప్తున్నా.." అరిచింది మహతి.
"పొగమంచు బాబూ.. కాయల్లేవీసారి." సైకిలెక్కాడు నారయ్య.

***

మామిడి ముక్కలు నములుతూ మట్టి రోడ్డమ్మట నడుస్తున్నారు ముగ్గురూ.
"ఊ.. చెప్పు." అడిగింది మహతి.
"అక్కడ కూర్చుందామా.. " ఓ చిన్న పాక ముందు ఉన్న చెక్కబెంచీలు చూపించాడు. పక్కనే ఉన్న బ్రహ్మాండమైన రావిచెట్టు ఆకులు రాలుస్తోంది ఉండుండీ..

"రజనీ ఆంటీని మేనబావకే ఇచ్చారట. అతనికి epilepsy ఉండేదనీ, మూర్ఛ వస్తే గంటసేపు ఉండిపోయేదనీ అనేవారు. అతన్ని చిన్నప్పుడెపుడో చూసాను. గుర్తులేదు. ఆంటీకి మొదట ఓ పిల్లాడున్నాడు. జయరాం అని.. నేను అమ్మమ్మగారింటికి వచ్చినప్పుడు ఆడుకునేవాళ్ళం. జయరాం కీ మూర్ఛలున్నాయి. మేమందరం ఆడుకునేటపుడు కూడా రజనీ ఆంటీ మా వెనుకే ఉండేవారు. నాకు ఎనిమిదేళ్ళనుకుంటా.. జయరాం ఆంటీకి చెప్పకుండా వెళ్ళి , పిల్లలతో ఆడుకుంటూ చెట్టెక్కి పడిపోయి పోయాడని తెలిసింది. ఆంటీ

దాదాపు ఏడాది పాటు ఇంట్లోంచి బయటికి రాలేదట. మేనత్తే కదా అత్తగారు.. 'పోయినవాడితో పోతామా.. మరో పిల్లాడు సుబ్బరంగా పుడతాడు కనమని' బలవంతపెట్టేదని చెప్పుకుంటారు. ఏడాదికి మోహన పుట్టింది. కానీ.."

"అబ్బా.. మోహనకి కూడా..?" బాధగా అడిగింది మహతి.

"ఉహూ.. మోహన perfectly alright. కానీ.. మోహనవి Hazel eyes.. అచ్చం మా పాణి మావయ్యలాగా."

"You mean..!!"

"యెస్. ఊరంతా గోల.. గొడవ"

"మరి ఆంటీ ఏమీ అనలేదా? ఆంటీ వాళ్ళ ఆయనో?"

"అతనిదేం లేదు. ప్రాజాపత్యం తల్లిదే. రజనీ ఆంటీ ప్రగ్నంట్ అని తెలిసిన రోజు వాళ్ళత్తగారు నిలదీసి, ఏదో మందు తినమని బలవంతం చేసిందట. ఆంటీ వీధిలోకి వచ్చి, నలుగుర్నీ పిలిచి చెప్పేసారట."

"ఎంత తెగింపూ! ఆశ్చర్యంగా ఉంది. మరోసారి పిల్లల్ని కంటే వాళ్ళకీ ఎపిలెప్సీ వచ్చే చాన్సెస్ అయితే ఉన్నాయ్. జయరాం ప్రూవ్ చేసాడు కదా.. అది hereditary అని." సాలోచన గా చెప్పింది మహతి.

"అప్పటి గొడవ అది. విషయం ఇదీ అని ఊరంతా తెలిసినా ఆంటీ అందరినీ ఎదిరించి ఊళ్ళోనే విడిగా తనొక్కర్తే ఉండిపోయారు. మోహన పుట్టింది. మోహనని ఈ ఊరు అమ్మమ్మగారింటికి వచ్చివెళ్ళే నందూ ప్రేమించాడు. పెళ్ళి చేసుకోడానికి నందూ వాళ్ళింట్లో ఒప్పుకోలేదు. పైగా బెదిరించారు. అంతే.. ఇద్దరూ నా ఎదుట తేలారు."

"మోహన గొడవ సరే.. పాతికేళ్ళ క్రితం రజనీ ఆంటీ తీసుకున్న డెసిషన్ చాలా చిత్రంగా ఉంది. ఇంతకీ మీ పాణి మావయ్య?"

"పాణి మావయ్య ఉజ్జయినీలో ఉన్నాడు. నిరంతరాన్వేషి అంటారు చూడు.. అలా చదువుతూ, కొత్త ప్రదేశాలు చూస్తూ తిరుగుతూ ఉంటాడు. కాళిదాసు కావ్యాలలో మనస్తత్వ చిత్రణ గురించి రీసర్చ చేసారాయన."

"అతని భార్య ఏమీ అనలేదా ఇలా రజనీ ఆంటీతో ఆయన.."

"అతను ప్రపంచపు అతికొద్దిమంది అదృష్టవంతుల్లో ఒకడులే.."

"గాడ్! ఆవిడ ఏమీ అనలేదా?"

"అటల్ బిహరీ వాజ్పేయ్, అబ్దుల్ కలామ్.. మళ్ళీ పాణి మావయ్య.." నవ్వాడు వంశీ.

"జోకా! నాకు అర్థం కాదని తెలుసు కదా.." క్విజ్ కి అన్సర్ తెలియని ఐదో క్లాసు పిల్లలా మొహం పెట్టింది మహతి.

చేత్తో నుదుటిమీద కొట్టుకుంటూ బెంచీ మీదనుంచి లేచాడు వంశీ. నవ్వుతూ తనూ లేచి రోడ్ మీదకి నడిచింది గౌతమి.

"సైంటిస్టూ.. మడిసన్నాక కాస్త జనరల్ నాలెడ్జ్ కూడా ఉండాలమ్మా.. వాళ్ళు బ్రహ్మచారులు కదూ!" పక్కన నడుస్తున్న మహతితో చెప్పాడు.

"అలా కాదు కానీ, Newton, Al Pacino.. మా పాణి మావయ్య అని చెప్పుంటే అర్ధమయ్యేది మహతికి.." ఆటపట్టించింది గౌతమి.

ఉడుక్కుంటూ చెప్పింది మహతి "నీక్కూడా లోకువైపోయానా? నాకు తెలుసు వాళ్ళు బేచిలర్స్ అని. సడెన్ గా గుర్తురాలేదంతే. నీకు జోక్ అర్ధం కాకపోతే తెలిసేది.. ఎంత బాధగా ఉంటుందో! అప్పుడు నేను కూడా.. ఏ డావిన్సీ నో..."

"జార్జ్ ఈస్ట్ మనో.." అందించాడు వంశీ.

"వావ్!" అప్రయత్నంగా అంది గౌతమి మెరిసే కళ్ళతో..

"ఎవరాయన!" అడిగింది మహతి మరోసారి ప్రశ్నార్ధకంలా మొహం పెట్టి.

"కోడాక్ కంపెనీ తెలుసుగా... ఆ షాపుల ఓనరాయనే. ఫోటో రీలు తయారుచేసి అమ్మేవాడు." మహతితో చెప్పాడు వంశీ గౌతమి వైపు చూడనైనా చూడకుండా.

"వీళ్ళందరిలోనూ Al Pacino, George Eastman మాత్రమే మీ పాణిమావయ్య పక్కన నిలబడగలరు. మిగిలినవాళ్ళకి పిల్లలు లేరు పాపం." గౌతమి నవ్వుతూ చెప్పింది.

***

వీధరుగు మీదనుండి వినిపిస్తున్న గోపాల్రావు గొంతుకి తెలివొచ్చింది వంశీకి. మధ్యాహ్నం రాజ్యం అత్త కొసరి కొసరి వడ్డించినదంతా బలవంతాన తిని వక్కపలుకు నవులుతూ, పట్టెమంచం మీద వాలిన జ్ఞాపకం. వాచ్ చూసుకుని దిగ్గున లేచాడు. అప్పటికే ఐదు కావొస్తోంది. "మైగాడ్.. రెండు గంటలు పడుకున్నానా!" అనుకుని లోపలికి నడిచాడు.

పెరట్లో నూతిగట్టు మీద గిన్నెలు తోముతున్న పనిమనిషి అసిరితో కబుర్లు చెప్తున్నారు రాజ్యం అత్త, మహతి.

"లేచావా? టీ కాగుతోంది." చెప్పింది రాజ్యం.

సిమెంట్ గోలెంలో ఉన్న నీళ్ళు మొహం మీద చిలకరించుకుని, దండెం మీదున్న తువ్వాలు అందుకున్నాడు వంశీ.

"టీ తాగనత్తా. అలా వీధిలోకి బయలుదేరుతాం ఇంక. కల్యాణం వేళకి కోవెలకొచ్చేస్తాం." చెప్తూ మహతి వైపు చూసాడు బయలుదేరుదామా అన్నట్టు.

"గౌతమి రెడీగానే ఉంది. మీ మావయ్య ఆధార్ కార్డ్ లకి ఫోటో తీసినవాడు సరిగ్గా తియ్యలేదని ఇందాకా కంప్లైంటు చేసారని, పాపం ఆయనకీ నాకూ మంచి ఫోటోలు తీసింది. ఆ పిల్ల ఫోటోగ్రాఫరట కదా! సీడీ రాసిస్తానని లోపలికెళ్ళింది. పిలుస్తానుండు." లోపలికెళ్తున్న రాజ్యం వైపు చూస్తూ, ఆమె లోపలికి వెళ్ళగానే "నిజమా..!" అని అడిగాడు మహతిని.

నవ్వాపుకుంటూ.."ఊ.. ఈ రెండు రోజుల్లోనూ ది గ్రేట్ "స్వదేశ్" ఫోటోగ్రాఫర్ చేత ఆధార్ కార్డ్ లకి, రేషన్ కార్డ్ లకీ ఫోటోలు తీయించినా తీయిస్తారు మీ మావయ్య. పద పద.." చెప్పింది మహతి.

"ఓహ్.. స్వదేశ్ కి తీస్తుందా ఫోటోస్." అడిగాడు వంశీ ఆసక్తిగా.

"తీసేది.. ఇప్పుడు ఫ్రీలాన్స్." చెప్తూ నడుస్తున్న మహతి గుమ్మం తన్నుకు పడబోయి ఆపుకుంది. "ఓయ్ జాగ్రత్తా.." అని చెప్తూ బయటికి నడిచాడు వంశీ.

***

ఊళ్ళో జాతర హడావిడి మొదలైన దగ్గరనుంచీ మహతి ఉత్సాహానికి ఆనకట్టల్లేవు. బొంగరంలా బజారంతా కలతిరిగేస్తోంది. బయటపడకపోయినా ఆ వాతావరణానికి వంశీకి, గౌతమికీ కూడా ఉత్సాహంగానే ఉంది. ఎక్కడెక్కడినుంచో సంతాన వేణుగోపాలస్వామి కల్యాణానికి వచ్చిన ప్రజ నెమ్మదిగా కోవెల దగ్గరకి చేరుతున్నారు. పువ్వులు, అరిటిపళ్ళు , పసుపూ కుంకుమల వాసనతో కోవెల ముందు దుకాణాలు గమగమలాడుతున్నాయి. మునిమాపువేళయింది. చీకట్లు నెమ్మదిగా కమ్ముకుంటున్నాయి. విద్యుద్దీపాల అలంకరణతో బజారు ధగధ్గాయమానంగా వెలుగుతోంది. మైక్ లో ఖంగుమని వినిపిస్తున్న అర్చకస్వామి గొంతు మారుమ్రోగుతోంది.

ముగ్గురూ నెమ్మదిగా జనాలను తప్పించుకుని లోపలికి చేరారు. వీఐపీలూ, ధర్మకర్తల కుటుంబాల కోసం ప్రత్యేకంగా కట్టిన బారికేడ్ల మధ్య కూర్చున్న రాజ్యాన్ని చూసి, మహతి అక్కడికి చేరుకుంది గౌతమి చెయ్యి పట్టుకుని. వంశీ మరో వైపు నిలబడి కల్యాణగోపాలస్వామి ఉత్సవ విగ్రహాన్ని చూస్తున్నాడు. గంటలు క్షణాల్లా దొర్లిపోయాయి. రుక్మిణీ సత్యభామల మెడలో గోపాలకృష్ణుడు మాంగల్యం కట్టేసాడు. పెళ్ళి బాజాలు మిన్నంటాయి.

"గరుడముద్ద చూసి వెళ్దామా?" గొంతు పెంచి వంశీ చెవిలో అరిచింది మహతి.

"చూద్దాం చూద్దాం.." ధ్వజస్థంభం వైపు చూపిస్తూ అటుగా జనాల మధ్యలోంచి నడిచి గోపాల్రావు పక్కకి చేరుకున్నాడు. వెనకే వచ్చి చేరారు ఆడవాళ్ళు ముగ్గురూ. ధ్వజస్థంభం ముందు వలయాకారంలో కట్టిన బారికేడ్ లోపలికి క్యూలో చేరుకుంటున్న ఆడవాళ్ళని చూస్తూ ఆశ్చర్యపోయారు మహతీ, గౌతమి. పుష్కరిణి స్నానం చేసి వరుసగా వస్తున్నారు.. పిల్లలకోసం తపస్సు చేస్తున్నవారు. వెన్నెల వెలుగులో నిటారుగా, ఠీవిగా నిలబడ్డ ధ్వజస్థంభం దగ్గర మంత్రపూతజలంతో కలశాభిషేకం చేసి గరుడధ్వజానికి అర్చన చేసారు. గోవింద నామాల మధ్య వలయాకారంలో నిలబడిన ఆడువారు కొంగు చాచి ఉన్నారు. అర్చకులిద్దరు పెద్ద కంచుపళ్ళెరంలో ఉంచిన

పొంగలి ముద్దల్ని ధ్వజ స్థంభానికి చూపి, వారి కొంగుల్లో పడేలా విసురుతున్నారు. కొంగుచాచి పట్టిన ప్రసాదాన్ని కళ్ళకద్దుకుని నోట్లో వేసుకుంటున్నారు భక్తిగా..

"విజయగోపాలతే మంగళం విశ్వంభరతే మంగళం" మంగళహారతి వినిపిస్తున్న వైపు తిరిగారందరూ.. లంగావోణీల్లో నలుగురైదుగురు అమ్మాయిలు.. వెనుకగా నిలబడిన రజనీ ఆంటీ.

"రజనీ ఆంటీ స్టూడెంట్స్ అనుకుంటా వాళ్ళు .." మహతి చెవిలో చెప్పాడు వంశీ.

"ఈరోజు కుదరలేదు. నువ్వు గుర్రుపెట్టి పడుకున్నావు. రేపు వెళ్దాం." చెప్పింది మహతి నీలం పట్టుచీరలో మెరుస్తున్న రజనీ ఆంటీని చూస్తూ..

"పరవాలేదులే.. ఆవిడేం అనుకోరు."

"నేననుకుంటాను.. ఆమెతో మాట్లాడాలి." చేతులు జోడించి పక్కకి తిరిగి వంశీ కళ్ళలోకి చూస్తూ చెప్పింది.

యధాలాపంగా చూస్తున్న రజనీ ఆంటీ దృష్టి వంశీ మీద ఆగింది. కళ్ళతోనే పలకరింపులయిపోయాయి. మహతి ఉత్సాహంగా చెయ్యూపింది. ఆవిడా చిన్నగా నవ్వుతూ చెయ్యూపి, మూడు వేళ్ళు చూపించి ప్రశ్నార్ధకంగా చూసారు. వంశీ తనకీ, మహతికీ పక్కగా నిలబడ్డ గౌతమిని వేలితో చూపించాడు.

## 8

మంద్రంగా గాలిలో తేలివస్తున్న తంబురా నాదం ఆ వీధిలో ప్రవేశిస్తున్న ఆ ముగ్గురికీ స్వాగతం పలికింది. కాస్త ఎత్తుగా ఉన్న ఆ పెంకుటింటి అరుగులు చిన్న నుండి కొంచెం పెద్దదాకా రకరకాల సైజుల చెప్పులతో నిండిపోయి ఉన్నాయి. ఎత్తుగా ఉన్న గడప దాటి లోపలికి అడుగుపెట్టారు. వసారా దాటి లోపలికి వెళ్ళగానే మండువా లోగిలి పంచపట్టున తంబుర మీటుతూ అపర సరస్వతిలా కూర్చున్న రజనీ ఆంటీ కనిపించారు. కాసేపున్నాక వచ్చి ఉండాల్సిందన్నట్టు వెనక్కి తగ్గిన వాళ్ళకి ఆమె చెయ్యి పైకిలేచి, గోడకి వేసి ఉన్న కుర్చీలను చూపించింది. పావుగంటలో పిల్లలు ఇల్లు ఖాళీ చేసి వెళ్ళిపోయారు.

"ఏమ్మా బావున్నారా? వంశీ..." అంటూ వచ్చి కుర్చీలో కూర్చోబోతూ ఆగి "కాఫీ తెస్తానుండండి.. టీ తాగుతారా?" అడిగారు రజనీ ఆంటీ.

"ఏం వద్దాంటీ. అంటే.. నాకు అక్కర్లేదు." నవ్వాడు వంశీ.

"కాఫీ బెటర్.. థాంక్యూ!" చెప్పింది మహతి.

"నీకూ.." అన్నట్టు చూసారామె గౌతమి వైపు.

"కాఫీ.. థాంక్స్ ఆంటీ.."

పెరట్లో నూతి చప్టాకి పక్కగా వేసి ఉన్న సిమెంట్ బల్ల మీద కూర్చున్నారందరూ.

"అయితే రీసర్చ్ చేస్తున్నావన్నమాట. దేని గురించీ.." మహతిని ప్రశ్నించారావిడ.

"జెనెటిక్స్ ఆంటీ.. mutations మీద." ఉత్సాహంగా చెప్పబోతూ వంశీ వైపు చూసి ఆగిపోయింది.

"నా మొహం చూస్తావేం. కానీ.. కానీ.. కొంకణి కనీసం. గుర్తుపెట్టుకో.." సీరియస్ గా చెప్పాడు.

"పెహ్.. " ఉడుక్కుంది మహతి.

జోక్ అర్థమై గౌతమీ, మహతి మొహం చూసి రజనీ ఆంటీ నవ్వేసారు.

"నువ్వు చెప్పమ్మా.. నేను వింటాను కదా!" నవ్వుతూనే అన్నారామె.

"లేదాంటీ.. అంత ఇంట్రెస్టింగ్ ఏం కాదు. మీ గురించి చెప్పండి." ముందుకు వంగుతూ అడిగింది.

"నా గురించా?" ఆశ్చర్యంగా అడిగారు.

గాభరాగా మహతి వైపు చూసి కళ్ళతోనే వారించబోయాడు వంశీ. మహతి పట్టించుకోలేదు.

"అదే ఆంటీ.. మీకు గతం గుర్తు తెచ్చి ఇబ్బంది పెట్టడం నాకూ ఇష్టం లేదు కానీ.. నా రీసర్చ్ కి ఏమైనా ఉపయోగపడొచ్చేమో అని.." సులువుగా బొంకేసింది.

"దేని గురించమ్మా.." అర్థం కానట్టు మొహం పెట్టారు రజనీ ఆంటీ.

"మీ అబ్బాయి గురించి, తరువాత దాదాపు పదేళ్ళకి మోహన హెల్దీగా పుట్టడం గురించి.. ఇలా అడక్కూడదని తెలుసు. కానీ.. మీ కథ వినాలని ఉంది."

వంశీకి ఏం జరుగుతోందో అర్థం కాలేదు. మాట్లాడాలంటే మామూలు ఉత్సాహమే అనుకున్నాడు కానీ.. మహతి నేరుగా ఇలా విషయం కదిపేస్తుందని అసలూహించలేదతను. వంశీకి ఉన్నపళాన మహతిని రెక్కపట్టుకుని బరబరా బయటికి లాక్కెళ్ళే ఆలోచన కలిగింది ఒక్క క్షణం. గౌతమి కంగారుగా బెంచీ మీద నుంచి సగం లేచి మహతి చెయ్యి పట్టుకోబోయింది.

"పాణి గురించా.." పల్చని నవ్వొకటి ఆమె పెదాల మీద వచ్చి చేరింది. నిర్ఘాంతపోయాడు వంశీ. అప్పటిదాకా ఆమె గురించి ఎవరో చెప్పగా వినడమే కానీ, ఆమె నోటినుంచి పాణిమావయ్య పేరు వినేసరికి మతిపోయిందతనికి.

చీకట్లు ముసురుకుంటున్నాయి. లేచి పెరటి చూరుకున్న లైట్ ఆన్ చేసి వచ్చి కూర్చున్నారామె.

"దోమలు ఎక్కువౌతాయింక. లోపలికి పోదామా.." మళ్ళీ లేచి అడిగారు. లేచి ఆమె వెనుకే వాళ్ళు ఇంట్లోకి నడిచారు.

"నా గురించి చెప్పాలంటే.. ఏం చెప్పాలి? అత్తకొడుకుకి ఇచ్చి చేసారు నన్ను. మూర్చ ఉండేది అతనికి. మంచి వాడే. కానీ మూర్ఖత్వం. అనారోగ్యానికే అనుకుంటా ఆ కోపం, మొండితనం. అబ్బాయి పుట్టాడు. వాడికీ మూర్చలున్నాయి. మరో పదిరోజుల్లో ఎనిమిదో ఏడు రాబోతోందనగా.. ఎవర్ని చూసి, ఎలా ఎక్కాడో చెట్టెక్కి.. పడి.. " ఆగారు.

పట్టలేని కోపాన్ని పంటిబిగువున ఆపుకుంటూ మహతి వైపే చూస్తున్నాడు వంశీ. ఆసక్తిగా ముందుకు వంగి వింటోందా అమ్మాయి. గౌతమి ఏం చెయ్యాలో పాలుపోనట్టు మార్చిమార్చి ఇద్దర్నీ చూస్తోంది. చేతిగోళ్ళు చూసుకుంటూ మాట్లాడుతున్నారు రజనీ ఆంటీ.

"జయరాం పోయాక చెప్పలేని నిశబ్దం. ఏ మాటా, చప్పుడూ వినిపించేవి కాదు. దుఃఖం.. పట్టలేని దుఃఖం. బయటికి వచ్చేది కాదు. పాడడం మానేసాను. బాగా ఆకలేస్తే వెర్రెత్తినట్టూ తినేసేదాన్ని. ఒక్కోసారి రెండేసి రోజులు ఏమీ తినాలనిపించేది కాదు. ఎక్కడికైనా అలా ఒళ్ళు అలిసిపోయేదాకా నడవాలనిపించేది. ఇది చాలదన్నట్టు మరో పిల్లాడిని కనమని అత్తమ్మ పోరేది. వంశం ఆగిపోకూడదని. అతనూ సిద్ధపడ్డారు మరోసారి కనడానికి. నాకే.. ఏమీ అర్ధమయ్యేది కాదు. నేనిలా ఎందుకుండాలి? జరిగిన దానిలో నా తప్పేమీ లేకుండానే ఎందుకు హింసపడాలి. భరించలేని ఈ బాధని ఎలా మర్చిపోవాలి. రోజురోజుకీ ఎక్కువే అవుతోంది కానీ తగ్గడం లేదిది. జయరాం చంటిపిల్లాడిగా ఉన్నప్పుడు వాడిని ఒళ్ళో వేసుక్కూర్చుని పాడిన పాటలన్నీ గుర్తొచ్చి ఏడుపొచ్చేసేది. అర్ధరాత్రి తెలివొచ్చేసరికి పక్కన ఖాళీగా.. " రుద్ధమైన కంఠాన్ని.. సవరించుకున్నారో క్షణం.

"మరోసారి కంటే.. ఆ పిల్లాడిని చూస్తూ జయరాం ని మర్చిపోనేమో కానీ.. మళ్ళీ వాడే వచ్చేసాడని నన్ను నేను మభ్యపెట్టుకోవచ్చేమో అనిపించింది. కానీ.. వంశం వట్టిపోతుందని కనడమా? ఏమవుతుంది మహా అయితే.. ఓ ఇంటిపేరు ఆగిపోతుంది. అంతేగా.. ప్రపంచం తెల్లారకపోదు కదా. నాకోసం నేను కనాలి. నాకోసం మాత్రమే. స్వార్ధమే నాది. కానీ.. నా కష్టమో! నేనేం పశువుని కాదు కదా.. లాక్కెళ్ళి .. " ఆవేశంగా ఊపిరి వదిలారు. క్షణకాలం ఆగారామె.. "అందుకే ఎంచుకున్నాను.. పాణి ని." స్థిరంగా చెప్పారు.

"ఆంటీ.." ఆమె చేతి మీద చెయ్యి వేసింది మహతి.. "సారీ.."

"లేదులేమ్మా.. మీతో చెప్పాలని నాకెందుకనిపించిందో. మోహన గుర్తొచ్చి ఉంటుంది మిమ్మల్ని చూస్తే.. " నవ్వేసారావిడ పేలవంగా. అందమైన ఆవిడ ముఖంలో నీలినీడలు దోబూచులాడుతున్నాయి. కళ్ళు తళతళా మెరుస్తున్నాయి.

"మూర్ఛతో సహా.. జయరాం కి తండ్రిపోలికలు చాలానే వచ్చాయి. మిగిలిన వాటిసంగతెలా ఉన్నా.. మళ్ళీ కంటే మాత్రం ఆరోగ్యంగా పుడతారా అనే ఆలోచన వచ్చేది. ఈలోగా నా నిశబ్దాన్ని భరించలేక నన్ను హింసించడం మొదలుపెట్టాడాయన. రోజు రోజుకీ ఒత్తిడి ఎక్కువయ్యేది. నాకు మొండితనమొచ్చేసింది. ఇలాంటివాడి సంతుని నేను మొయ్యడమా.. అనిపించింది. తప్పేనేమో.. లోకం దృష్టిలో. కానీ నాకోసం.. కేవలం నాకోసం.. పాణితో కన్నాను. నాకూ మనసులో అతని మీద ఇష్టం ఉందేమో అంతకు ముందే.. తెలివైన వాడని ఆకర్షించబడ్డానో.. ఏమో. చాలానే గొడవలయ్యాయ్. బుకాయించి ఉండచ్చు. మరోలా దాచే ప్రయత్నం చెయ్యొచ్చు. కానీ.. అప్పుడు నా పరిస్థితికి ఏది తోస్తే అది చేసుకుపోయాను. తెగింపు వచ్చేసింది. పాణి వచ్చేయమన్నాడు. ఎందుకో ఏ బంధం వద్దనుకున్నవాడిని సంసారంలోకి లాగడమెందుకనిపించింది. అదీ కాక.. ఏం ఒక్కర్తినీ పోషించుకోలేనా అనిపించింది. ఏమోనమ్మాయ్.. సమర్ధించుకోవాలంటే ధర్మరాజు కథ చెప్పొచ్చు నీకు. ఉహూ.. జరిగిందిది అని చెప్తున్నానంతే." ఆగిపోయారు. మహతి ఏదో ప్రశ్నించబోయి ఆగిపోయింది.

"పాణి నా చిన్నప్పటి ఫ్రెండ్. ఆడుకునేవాళ్ళం. చాలా తెలివైనవాడు. తెలుగు సంవత్సరాల పేర్లు తిరగేసి చెప్తేనే వాళ్ళ పెరట్లో గులాబిజామ చెట్టు ఎక్కనిస్తాననే వాడు." నవ్వారామె. వంశీ ప్రాణం కాస్త తెరిపినపడింది. అయినా మహతిని ఎలా హింసిస్తే తన కోపం చల్లారుతుందా అని ఆలోచన సాగుతూనే ఉందతని బుర్రలో.

"జరిగినదేదైనా.. నేను నష్టపోలేదు. మోహనని చూసిన ప్రతీసారీ చెప్పలేని ధైర్యం కలిగేది. ఊళ్ళో వెలెయ్యాలని చూసారు. మొండికేసాను. కాపురాన్ని చెడగొట్టుకున్నదాన్ని కదా.. చాలానే చూడాల్సి వచ్చింది. మా అమ్మ ఉండేది పదేళ్ళ క్రితం వరకూ.. నన్ను అర్ధం చేసుకుంది. లేకపోయినా బతికేసేదాన్నేమో ఎలాగో.. " నవ్వడానికి ప్రయత్నించి విఫలమయ్యారామె. గతం కళ్ళముందు తిరుగుతోంది. ఏదో లోకంలో ఉన్నట్టున్నాయామె కళ్ళు .

"అర్ధమవుతున్నారాంటీ." ఆమె చేతిమీద చెయ్యి వేసి చెప్పింది మహతి. గౌతమి, వంశీ ఇంకా దిగ్భ్రాంతిలోనుండి తేరుకోలేకపోతున్నారు. విన్నదంతా నెమ్మదిగా ఇంకుతోంది.

"ఒకే ఒక్క ప్రశ్నాంటీ.. "

"ఊ.."

"పాణి అంకుల్.. "

"వివరంగా చెప్పలేను కానీ.. ఒకే ప్రశ్న అడిగాడు. పిల్లలు కావాలి పాణీ అనగానే.. 'అన్నీ ఆలోచించుకున్నావా..?' అని. నీ కాళ్ళకి అడ్డం కానూ అని చెప్పాను. అయినా భరిస్తానన్నాడు. ఆ అవసరం రానివ్వలేదు నేను."

"ఒంటరిగా అనిపించలేదా.. మోహనకి తండ్రి తెలియకుండా.. తప్పనిపించలేదా?"

"అమ్మాయీ.. అందరికీ అన్నీ దక్కవు. నేనూ తండ్రిలేకుండానే పెరిగాను. నా మీద నాకు నమ్మకం ఉంది. మోహనని సరిగ్గా పెంచగలనని."

***

"నిన్ను ఏం చేసినా పాపం లేదు మహతీ.." ఆ ఇంటి గుమ్మం దిగగానే ఉగ్రనరసింహావతారం ఎత్తాడు వంశీ..

"ఆవిడేం అనుకునే మనిషి కాదనిపించింది వంశీ. ఎంత బోల్డ్ అసలు!"

"ఇప్పుడీ ఇంటర్వ్యూ ఎందుకు తీసుకున్నట్టూ.. రీసర్చ్ కోసమేనా నిజంగా?" అనుమానంగా అడిగింది గౌతమి.

ముగ్గురూ ఇంటిదారి పట్టారు. మిణుగురులు ఎగురుతున్నాయ్. కీచురాళ్ల సంగీతం మొదలయింది. ఒకటీ అరా జనసంచారం మినహా ఊరంతా సద్దుమణిగిపోయింది.

"నేనేం రీసర్చ్ చెయ్యక్కర్లేదు. అల్రెడీ చేసేసారు. డార్విన్ థియరీని ఈవిడా తోసిపారేసింది."

"....."

"అబ్బా.. అలా చూడకు వంశీ. సరే..చెప్తావిను. డార్విన్ చెప్పినదేవిటంటే.. మనిషి మనుగడకోసమే ఈ పోరాటం చేస్తాడు. ప్రాణమే ముఖ్యం అని. కానీ.. పీకాక్స్ ఉన్నాయ్ చూడూ.. "

"ఏవీ.. పీకాక్స్.." చేతులు గాల్లోకి పైకెత్తి ఆడించాడు.

"ఛో.. నేను చెప్పను."

"నువ్వు చెప్పు మహతీ.. " ఆసక్తిగా అడుగుతున్న గౌతమివైపు చిత్రంగా చూసాడు వంశీ.

"ఆడనెమలిని అందమైన పింఛం ఉన్న మగనెమలి ఆకర్షిస్తుంది. కానీ, అంతలేసి పింఛాలతో మగనెమలి పరిగెత్తడం, ప్రాణాలు దక్కించుకోవడం కష్టం. అయినప్పటికీ అలాంటి నెమళ్ళే కావాలంటాయి ఆడనెమళ్ళు. పొట్టితోక ఉన్న మగనెమళ్ళు ఎక్కువరోజులు

బతికినా వాటిని మేటింగ్ లో ఉపయోగించుకోవు ఆడనెమళ్ళు. అంటే వాటికి డార్విన్ చెప్పినట్టు మనుగడ ముఖ్యం కాదు. మంచి సంతానమే ముఖ్యం. పెద్ద పింఛం ఆరోగ్యానికి సంకేతమన్నమాట. ఎలాగో ఒకలా పిల్లలని కనేయడం కాదు వాటికి కావలసింది.. మన మనుషుల్లా."

"మాతృస్వామ్య వ్యవస్థ ఉన్నప్పుడిలా ఉండేది కాదేమో కదా.. ఆమె ఎంచుకునేది. క్వీన్ బీ లాగ.." గౌతమి అడిగింది.

"అవును. గుహల్లో బతికే రోజుల్లో.. " చెప్పాడు వంశీ. ప్రశ్నార్ధకంగా చూసింది మహతి.

"రాహుల్ సాంకృత్యాయన్ అని ఓ కుర్రాడున్నాడులే. అతను చెప్పాడు."

"కరెక్ట్ గానే చెప్పాడైతే." సీరియస్ గా చెప్పింది. అంతే సీరియస్ గా చూస్తున్న వంశీని చూసి నవ్వాపుకుంది గౌతమి.

వెన్నెల వెలుగులో ఊరు సద్దుమణుగుతోంది. నిశబ్దంగా నడుస్తున్నారు.

"ఏటికి నేనెదురీదానని నన్ను చూసి నేర్చుకోమనను కానీ.. నా బతుకు నాది. ఎందుకిలా చేసానూ అనెప్పుడూ అనుకోలేదు. మోహన.. నాకోసం నేను చేసుకున్న బొమ్మ మోహన." రజనీ ఆంటీ మాటలు మారుమోగుతున్నాయి ముగ్గురి చెవుల్లోనూ..

"ఏలూరెళ్ళాలి.." సడెన్ గా అన్నాడు వంశీ.

"ఎప్పుడూ..?" అడిగింది మహతి.

"ఉహూ.. సారీ. ఏదో కథ గుర్తొచ్చింది. ఆ కథపేరు 'ఏలూరెళ్ళాలి..' "

"చెప్పవా చెప్పవా.."

"తల్లీ.. చెప్తే ఇప్పుడు నువ్వెళ్ళి ఆ కథలో మాణిక్యాంబ గారిని ఇంటర్వ్యూ చేసేద్దామంటావ్. కుదర్దు. చేస్తే గీస్తే రాసినాయన్ని చెయ్యాలి."

"ఎవరాయన?"

"చాసో అనీ.. "

"చాసో నా? సారీ.. వినలేదే."

"గొప్పాయన."

"ఎంత గొప్పా?"

"సురేంద్రనాద్ బేనర్జీ అంత గొప్ప."

"హబ్బా.. ఈ సురేంద్రనాథ్ బేనర్జీ ఎవరూ?" అయోమయంగా, బాధగా అడుగుతున్న మహతిని చూసి పకపకా నవ్వేసింది గౌతమి.

రోడ్ మీద ఆగిపోయి నవ్వుతున్న గౌతమిని సీరియస్ గా అడిగాడు వంశీ. "నీకు తెలుసా నవ్వుతున్నావూ?"

నవ్వాపేసుకుని అడ్డంగా తలూపింది గౌతమి. కీచురాళ్ళ రొద ఎక్కువయింది.

"ప్చు.. సురేంద్రనాథ్ బేనర్జీ అందరికంటే గొప్పవాడు." నిట్టూర్చాడు వంశీ.

వీధి మలుపు తిరుగుతూండగా అడిగింది మహతి.. "వంశీ, నువ్వెప్పుడు కంటావ్ పిల్లలనీ.."

"కనను.."

నడుస్తున్న మహతి ఆశ్చర్యంగా ఆగిచూస్తోంది. వెనక్కి తిరిగి నవ్వుతూ చెప్పాడు వంశీ.. "బాన పొట్ట బాగోదు నాకు."

"హబ్బా.. నీకు అన్నీ జోకులే.."

"పద పద.. వాళ్ళ బోయినాల టైం దాటిపోయింది. ఎదురుచూస్తూంటారు." వాళ్ళిద్దరికీ దారిచ్చి మెట్ల కింద నిలబడ్డాడు.

"రాజ్యం ఆంటీ.. " పిలుస్తూ తలుపు కొడుతున్న మహతి పక్కన నిలబడి, యధాలాపంగా వెనక్కి చూసిన గౌతమికి.. పెదవి కొరుక్కుంటూ ఎటో చూస్తూ ఆలోచిస్తున్న వంశీ కనబడ్డాడు.

9

అధికారి నెమ్మదితనం,

ప్రియురాలి కోపం,

సమర్ధుడి క్షమ,

పండితుడి మాట,

మూర్ఖుడి మౌనం.. చాలా అరుదైన అదృష్టాలట! వంశీకి ఆ అదృష్టం పట్టి పదినిముషాలైనా కాకముందే టీపాయ్ మీదున్న ఫోన్ రింగ్ అయింది. విసురుగా వచ్చి ఆన్సర్ చేసింది సీమ.

" పార్క్ పక్క సందులో కుడివరసలో నాలుగో ఇల్లు బాబాయ్.. ఎర్రగేటు." ఫోన్ పెట్టేసి వంశీ వైపు చూసింది. వంశీ చేతిలో ఉన్న పుస్తకాన్ని విసిరికొట్టాలనే కోరికని బలంగా అణుచుకుని, సాధ్యమైనంత నెమ్మదిగా చెప్పింది.

"కాసేపు ఆ పుస్తకం పక్కన పెడతావా? వచ్చేది నా బంధువులైనా, వస్తున్నది నీ ఇంటికి కదా.. పలకరించకపోతే బావుండదు."

"రానీ.. అయినా ఎందుకు పలకరించనూ...?" ఆమె మాటల్లో దాగిన కోపాన్ని గమనించనట్టు అతిమామూలుగా చెప్పాడు.

"ఏమోలే.. ఆకులు నాకేవాడికి మూతులు నాకేవాడనీ.. నాకే ఈ ఇంట్లో దిక్కులేదు. ఇంక నా కోసం గెస్టు కూడానా..!" సాగదీసింది.

"........"

పుస్తకంలోంచి కళ్ళు తిప్పుని వంశీని తేరిపార చూసింది. ఏం చెయ్యాలో పాలుపోలేదామెకి. ఉక్రోషం తన్నుకొస్తోంది. పంటిబిగువున చుట్టాలకి అతిథిమర్యాదలు చేసి సాగనంపింది. వాళ్ళు గడపదాటగానే చరచరా హాల్లోకి వచ్చింది. వంశీ అక్కడ లేడు. మేడ మీది బాల్కనీలో నిలబడి ఫోన్ మాట్లాడుతున్నాడు. అస్పష్టంగా వినిపిస్తున్న మాటలు.. సీమ చెవుల్లో హోరెత్తిపోయింది.

కాల్ పూర్తి చేసి గదిలోకి అడుగుపెట్టిన వంశీకి, మంచం మీద బోర్లా పడుక్కుని వెక్కిళ్ళు పెడుతున్న సీమ కనిపించింది. ఎప్పట్లా దగ్గరికి వెళ్ళలేకపోయాడు.

"నేనెందుకు నీకు? నీకు నీ వాళ్ళూ , నీ సరదాలు, షికార్లు ముఖ్యం. ఇంట్లో పెళ్ళాం ఉందనీ, దానికీ ప్రాణం ఉందనీ నీకు గుర్తుండదు. స్వార్ధం. పచ్చి స్వార్ధం."

"....."

"అరిచి, ఏడ్చి ఇదే ఊరుకుంటుందిలే అని.. ఊరుకోక ఏం చేస్తుందిలే అని. చూడు.. బెల్లం కొట్టిన రాయిలా ఎలా చూస్తున్నాడో..!" చివాలున లేచి కూర్చుంది.

"సీమా.. నీకేం కావాలో నాకు తెలీదు. నీకూ తెలుసని నేననుకోను. పండక్కి రమ్మన్నాను. కుదరదన్నావు. రావిపాడు రావడానికి ఏదో అడ్డు చెప్పావు. అన్నిటికీ నువ్వే భాష్యం చెప్పేసుకుని, పెడర్ధాలు తీసేసుకుని మనసు పాడుచేసుకుంటున్నావ్. ముందా నెగిటివ్ థింకింగ్ లోంచి బయటికి రా.. మనకేం లోటుందని?"

"పెడర్ధాలు తీసేది నేను. మనసు పాడుచేసుకునేదీ నేనే.. నువ్వు మాత్రం టింగురంగా అని నచ్చినదాంతో కులుకుతూ ఉంటే, నేను ఇంట్లో పడుండి, నీకు నచ్చినప్పుడు నీతో కాపురం చేస్తూ, పిల్లల్ని కంటూ, నువ్వు చెప్పేదంతా విని నమ్ముతూంటే అప్పుడు మంచిదాన్ని. ఏం.. అంతేనా?"

"**ప్చ్**.. సీమా.. ఎలా చెప్తే నీకు అర్ధమవుతుంది?" అసహనంగా మంచానికి దగ్గరగా కుర్చీ లాక్కుని కూర్చుంటూ అడిగాడు.

"నాకేం అర్ధం కానక్కర్లేదు. నీకు నచ్చినట్టు ఊరేగు. రావిపాడు ఎవరితో వెళ్ళావ్?" చీకట్లో బాణం వేస్తూ అడిగింది.

"నువ్వొ వస్తే తెలిసేది. ఇన్ని ప్రశ్నలుండేవి కావు కదా నీకు.." నవ్వాడు.

"అదిగో.. అలా నవ్వకు. నాకు ఒళ్ళు మండిపోతోంది. అయినా నీకెక్కడికక్కడ ఖాతాలున్నాయ్ కదా..! తల్లి అక్కడ, కూతురిక్కడ. సరిపోదంటే మావయ్య పెళ్ళాం మూ మనకి వరసే..!" మాట పూర్తవక మునుపే సీమ కళ్ళు బైర్లు కమ్మాయి.

మెట్లు దిగుతున్న వంశీ మొహం జేవురించి ఉంది. విసురుగా తలుపేసుకుని వీధిలోకి నడిచాడు.

***

"లెఫ్టీస్ కి ఇన్సోమ్నియా ఉంటుందట! నిజమేనన్నమాట!! " ఎడమ చేత్తో నోట్ బుక్ లో ఏదో రాసుకుంటున్న గౌతమి ఎదురుగా కూర్చున్నాడు వంశీ. రావిపాడు అప్పటికే తొలిజాము నిద్రలో సోలుతోంది.

"హహ్హహా.. ఇంకా నయం స్కిజోఫ్రేనియా ఉంటుందనలేదు." పుస్తకం పక్కన పెట్టేసింది.

"డిస్టర్బ్ చేసానా? రాసుకుంటున్నావ్ కదా.. ఏదో.."

"ఉహు.. మహతి నిద్రపోయింది. నాకింకా నిద్దర్రాలేదు. ఊరికే ఏదో.. " కుర్చీలో ముందుకు జరుగుతూ చెప్పింది.

"కవిత్వమా? డైరీనా?" సీరియస్ గా అడిగాడు.

"ఉహూ.. అకౌంట్స్. నాన్నగారిచ్చిన మూడుంపావలాకీ ఇంటికెళ్ళాక లెక్క చెప్పొద్దూ!"

"పావలాలు చెల్లే ఊరూ, ఖర్చులిచ్చే తండ్రీ.. envy you!"

"హహహ్హా.. నీతో మాట్లాడలేం వంశీ.."

"మాట్లాడద్దంటావ్ అయితే.. " సీరియస్ గా లేవబోయాడు. ఠక్కున చెయ్యి పట్టుకుని ఆపేసింది. ఆపై కంగారు అణుచుకుంటూ.. నవ్వేసింది.

మండువా గుమ్మానికి పక్కగా వేసున్న కుర్చీల్లో కూర్చున్నారిద్దరూ. ఎడమచేతి వేళ్ళతో కుడిచేతి వేళ్ళని దీక్షగా చక్కదిద్దుతూ ఆమె..

"ఫోటోలు తియ్యడం కూడా ఎడంచేతి వాటమేనా?" గడ్డం కింద చేతులు పెట్టుకుని కుర్చీలో ముందుకు వాలి అడిగాడు.

"Does it make any difference?" నవ్వింది.

"ఏమో.. నువ్వే చెప్పాలి." నిజాయితీగా అడిగాడు.

"ఫోటోగ్రఫీలో కాదు కానీ, క్లాసెస్ కి వెళ్ళేప్పుడు మాత్రం ఇబ్బంది పడ్డాను." ఆగి చెప్పింది.. " క్లాస్ రూమ్ చైర్స్.. వాటికి రైట్ సైడ్ ఉంటాయ్ కదా రైటింగ్ పాడ్స్.. రాసుకోడానికి ఇబ్బంది."

" ఊ.. ఇంకా.."

"కుడి చేత్తో కొబ్బరికాయ కొట్టలేను కోవెలకెళ్తే. ఏదైనా వడ్డించాలంటే గభాలున ఎడం చెయ్యే ముందుకొచ్చేస్తుంది." నవ్వుతూ చెప్పింది.

కోలగా ఉన్న ఆమె మొహంలో మెరుస్తున్న కళ్ళని, పైకి బిగించిన పోనీటైల్ వల్ల విశాలంగా కనిపిస్తున్న నుదురునీ పరీక్షగా చూస్తూ అడిగాడు.. "సిజర్స్ కూడా ఇబ్బందే కదూ!"

"ఓ..యా..! నా దగ్గర లెఫ్ట్ హేండర్స్ సిజర్స్ ఉన్నాయ్. చాలా కష్టం లేకపోతే. నువ్వు ఈసారెప్పుడైనా ఎడం చేత్తో కత్తిరించి చూడు తెలుస్తుంది ఎంత ఇబ్బందో.."

"అయితే ఏం... క్రియేటివ్ కదా! ఎడం చేతివాటం వాళ్ళకి బ్రహ్మాండమైన ఐక్యూ ఉంటుందంటారు." సానుభూతిగా చెప్పాడు.

వంశీ మొహం చూస్తూ నవ్వాపుకోలేకపోయింది గౌతమి.

"రాయడం కష్టం. లెఫ్టీస్ బాల్ పాయింట్ పెన్ తో రాసేప్పుడు పుష్ చేస్తాం పెన్ ని. నిజానికి ఇంక్ ఫ్లో తో సమాంతరంగా పుల్ చేస్తూ రాసుకుంటూ వెళ్తే సులువు అంటారు. కుదరదుగా మాకు.. " చెప్పింది పుస్తకం వెనక పేజ్ మీద "వంశీ.." అని రాసి చూపిస్తూ.. కాస్త ఒంపుగా ఉన్న నల్లటి తెలుగు అక్షరాలలో తన పేరు వైపు చూస్తూండిపోయాడో క్షణం.

"ఓ మాంచి లెఫ్ట్ హేండెడ్ జోక్ గుర్తొస్తోంది." సన్నగా నవ్వుకుంటూ చెప్పాడు.

"ఏదీ.. లిటిల్ బాబీ.. జీసస్ జోకేనా?" అడిగింది గౌతమి ఆసక్తిగా.

"ఉహూ.. ఏవిటది?"

"అంత నవ్వేం రాదు కానీ.. నువ్వు చెప్పు."

"వస్తుందో రాదో చెప్తేగా తెలిసేదీ.."

"ఉహూ.. నువ్వు చెప్పు."

"ఇలాగే మధురం 'చిత్రం చిత్రం మహాచిత్రం కథ' చెప్పదు ఎప్పటికీ.. "

"మధురం?"

"మధురవాణిలే.. కన్యాశుల్కంలో.."

"బాగా చదువుతావేం నువ్వూ..?"

"ఊ.. కొంచెం. నువ్వు?"

**"ప్చ్..."**

"........."

"ఇంతకీ జోక్ చెప్పు వంశీ.."

"వంటింటిపని పూర్తి చేసుకొచ్చి, పక్కన కూర్చుని ప్రేమగా చిలకలందిస్తున్న భార్యని, భర్త అడిగాడట ఓ రోజు. "నేను చచ్చిపోతే మళ్ళీ పెళ్ళాడుతావటే..?" అని. "After a considerable period of grieving, yes.. I would. We all need companionship." అని చెప్పిందట."

"భార్యకి ఇంగ్లీషొచ్చా?"

"చొప్పదంటు ప్రశ్నలని వీటినే అంటారన్నమాట.." కోపంగా చెప్పాడు.

"Sorry.. Sorry.. చెప్పు.. చెప్పు.."

"అప్పుడు భర్త కాస్త కళవళపడి అడిగాడటా.. "నేను చచ్చిపోయి, నువ్వు మళ్ళీ పెళ్ళాడితే.. నీ మారుమొగుడు ఈ ఇంట్లోనే ఉంటాట్టా..?" అని.."

"ఊ.."

"అదేం ప్రశ్నండీ.. ఎంత కష్టపడి ఇటుకా సున్నం పేర్చి కట్టుకున్నాం బొమ్మరిల్లు.. వదిలేసుకుపోలేను కదా!! I'm not going to get rid of my house. I guess he would." అని ఢంకా మీద దెబ్బ కొట్టి మరీ చెప్పిందట."

"హహ్హహా.. పాపం!"

"అప్పుడా మానవుడడిగాడూ.. "నేను చచ్చిపోయి, నువ్వు మళ్ళీ పెళ్ళాడి, నీ మారుమొగుడు ఈ ఇంట్లోనే ఉన్నట్టైనా.. "

"........" నవ్వాపుకుంటూ చూస్తోంది గౌతమి.

".. ఉన్నట్టైనా.. would he sleep in our bed?"

"ఊ.."

"అప్పుడా సాధ్వి చెప్పిందీ.. "హయ్యో నా నెత్తిరాతా.. ఇవేం అనుమానాలండీ?? మీరు లేరని మంచం పాడుబెడతానుటండీ!! లక్షలు పోసి చెక్కించుకున్న చిలకల పందిరి పట్టెమంచం!! so I guess he would." అందట.."

పకపకా నవ్వేసింది వంశీ మొహంలో హావభావాలు చూస్తూ..

"ఇంకా ఊరుకోలేని పతిదేవుడడిగాట్ట పాపం.. ""If I died and you remarried, and he lived in this house and slept in our bed, would he use my golf clubs?" అని.. ఆమె చాలా కూల్ గా చెప్పిందట.. "No, Sweetheart!! He's left-handed!" అని.

నవ్వుతున్న గౌతమిని పరీక్షిస్తున్నట్టు అడిగాడు వంశీ.. "ఇంతకీ ఈ కథలో నీతేమిటీ?"

"Golf is an expensive sport. అని." అంతే పెంకిగా నవ్వుతూ చెప్పింది.

"Clever girl!!" మెచ్చుకోలుగా చూస్తూ చెప్పాడు. పకపకా నవ్వింది.

ఆ నవ్వు ఇద్దరి మొహాల్లోనూ చాలా సేపు వెలుగుతూ ఉండిపోయింది.

"ఊరు నచ్చిందా?" తన ప్రశ్న తనకే వింతగా అనిపించిందతనికి.

"మనూరి కంటే కొంచెం పల్లెటూరు కదా.. బావుంది." చున్నీ తలచుట్టూ తిప్పి కప్పుకుంటూ చెప్పింది.

"నా రూట్స్ ఉన్నాయిక్కడ." ఏవిటిలా మాట్లాడుతున్నానని మరోసారి విస్తుపోయాడు తనలో తానే..

"ఊ.. "

"ఇష్టం.. రావిపాడంటే. ఇప్పుడెవరూ లేకపోయినా వచ్చి తడిమిచూసుకుంటూ ఉంటాను. ఏడాదికోసారి."

"ఊ.."

"ఒక ప్లేస్ తో ఇంత అనుబంధం.. విచిత్రమే కానీ.."

"ఉహూ.. కాదు. నాకూ ఉన్నాయ్ అలాంటి వింత ఇష్టాలు. మా పెదబాబాయ్ వాళ్ళున్నారు లక్కవరపుకోటలో.. వాళ్ళ ఇల్లంటే చాలా ఇష్టం. కొనేసుకుని తాళం వేసేసుకోవాలన్నంత ఇష్టం. వాళ్ళమ్మరు కానీ.. నేనక్కడే పెరిగాను ఏడేళ్ళొచ్చేదాకా." చిన్నగా నవ్వింది.

"ఓహ్.. అయితే నువ్వు ఊళ్లోకి వచ్చినేడాదే అనుకుంటా భద్రావతికి ఉప్పెన." సాలోచనగా చెప్పాడు.

"నిన్నూ... " ఎడమచెయ్యెత్తి కొడతానన్నట్టు అభినయిస్తూ నవ్వేసింది.

" నువ్వు తీసిన ఫోటో.. మహతి బెడ్రూమ్ లో.. చూసాను. చాలా బావుంది."

"జెమినీడ్స్ ఫొటో? ఊ.. థాంక్స్.. ఈ ఊళ్ళో అయితే ఇంకా బాగా వచ్చుండేది." తల దించుకున్నదల్లా మళ్ళీ తననే చూస్తున్న వంశీ కళ్ళలో కళ్ళు కలుపుతూ చెప్పింది.

"క్లియర్ స్కై... ఊ.. అవును."

"లెస్ హ్యుమిడిటీ కూడా.. నైట్ స్కై తీసేటప్పుడు వాతావరణం హ్యుమిడ్ గా ఉండకూడదు. ఈ ఊరి గాలి పొడిగా ఉంది."

"ఓహ్... ఒకే." తల పంకించాడు చాలా అర్థమైనట్టు.

ఏం మాట్లాడుకోవాలో అర్థం కానట్టూ కాసేపు మౌనం. చీకటి రొద మరీ ఎక్కువైంది.

"ఉదయాన్నే బయలుదేరాలి." అదేదో చంద్రమండలయాత్రన్నంత గంభీరంగా చెప్పాడు.

"ఊ.. ఊ.." అంతే సీరియస్ గా తలూపింది.

"ఆకలేస్తోంది." ప్రకటించాడు.

"చాక్లెట్ ఓకేనా?" కుర్చీ పక్కనున్న హేండ్ బేగ్ తీస్తూ అడిగింది.

పంచుకుతిన్న చాక్లెట్ రేపర్ ని భద్రంగా మళ్ళీ బేగ్ లో వేస్తోంది గౌతమి.. గుడ్నైట్ చెప్పి వెళ్తూ ఎందుకో వెనక్కి తిరిగిన వంశీ చూసేసరికి. చురుకైన కళ్ళతో కోపంగా చూస్తూ తన చెంప పగలగొట్టి, చూపుడు వేలు చూపిస్తూ "చెప్పులు కాలువలోంచి తీసి, కడిగి ఆరబెట్టి.. నేను ట్యూషన్ లోంచి వచ్చేసరికి అక్కడ పెట్టాలి.. జాగ్రత్త." అని ఉరుముతున్న గౌతమి గుర్తొచ్చింది. నవ్వుకుంటూ లోపలికెళ్ళి మంచం మీద ఒరిగాడు.

***

నడిచీ నడిచీ విశ్రాంతి కోరుతున్న కాళ్ళని లవ్ సీట్ హేండ్ రెస్ట్ మీద వేసుకుని, లేప్టాప్ ఒళ్ళో పెట్టుకుని పక్కకు తిరిగి కూర్చున్నాడు వంశీ. రావిపాడు నుండి వచ్చాక మైల్ చెక్ చెయ్యలేదని గుర్తొచ్చింది. 'ఏదీ.. వచ్చీ రాగానే యుద్ధం..' విసుక్కున్నాడు మనసులోనే. కాసేపట్లో లేప్టాప్ మూసేయబోతూ ఆగి, ఓ వస్తువు కోసం గూగుల్ చేసి ఆర్డర్ ఇచ్చాడు. వెనక్కి వాలి కళ్ళు మూసుకున్నాడు. పల్చని చెక్కిళ్ళతో కోలగా ఉన్న గౌతమి మొహం కళ్ళముందు కదిలిందో క్షణం. ఉలిక్కిపడి సరిగా కూర్చున్నాడు.. ఆలోచిస్తూ.

***

నిద్రలేచేసరికి హాలంతా పరుచుకున్న వెలుతురు వంశీ కళ్ళలో గుచ్చుకుంది. బద్ధకంగా ఆవులిస్తూ టైం చూసేసరికి ఏడున్నర. 'మొద్దు నిద్రపోయానే..!' అనుకుంటూ.. మేడ మీదకి నడిచాడు. మెట్లెక్కుతూ యధాలాపంగా వెనక్కి తిరిగి చూసిన వంశీకి వీధితలుపు పూర్తిగా తీసి కనిపించింది. రాత్రి మర్చిపోయానా.. అని ఆలోచిస్తూ, హఠాత్తుగా ఏదో తట్టి గబగబా గదిలోకి వెళ్ళాడు.

ఊహించినట్టే ఖాళీ గది.. డ్రసింగ్ టేబుల్ దగ్గర రెపరెపలాడుతున్న కాగితం ఎగిరిపోకుండా, దానిమీద బరువుగా మెరుస్తున్న సీమ రాళ్ళ హెయిర్ క్లిప్..

## 10

"హేయ్ డూడ్.. ఉరుముల్లేని వానలా ఏవిటిలా?" తలుపు గడియ వేసి లోపలికొస్తూ, సోఫాలో కూర్చుంటున్న వంశీని అడిగింది మహతి.

"చెప్పి వచ్చుంటే నవకాయ పిండివంటలతో బోయినం వడ్డించేదానివా?" నవ్వాడు.

"ఈ నవకాయేంటీ.. వంకాయ కి రివర్స్ కోడింగ్ లా ఉంది?" ఆసక్తిగా అడుగుతూ పక్కన కూర్చుంది.

నిశబ్దంగా నెత్తిబాదుకుంటున్న వంశీని చూసి క్షణకాలం బిక్కమొహం వేసి, నవ్వేసింది.

"నువ్వు ఉంటావో ఉండవో అనుకుంటూనే వచ్చాననుకో." మహతి కళ్ళలోకి చూడకుండా మళ్ళించుకున్నాడు చూపు.

"కొద్దిగా తలనొప్పి. ఐదున్నరకే ఇంటికొచ్చి పడుకున్నా. ఇప్పుడు ఒకే లే. సీమ ఊళ్ళో లేదా?" ఏడున్నర దాటుతున్నట్టు చూపిస్తున్న వాల్ క్లాక్ ని చూస్తూ అడిగింది.

"ఉహూ... ఊ.. లేదు."

"పోన్లే. బానే వచ్చావ్. రావిపాడు ట్రిప్ తో కనీసం మూడు నెలలు మాయమైపోతావనుకున్నాను. మూడు రోజుల సెలవుని కాంపన్సేట్ చెయ్యొద్దూ ఆఫీస్ లో.."

"పనెక్కువే ఉంది. చిరాగ్గా ఉండి ఇటొచ్చేసా.. ఇంటికెళ్ళి మొదలెట్టాలి మళ్ళీ.." నిట్టూర్చాడు.

"అబ్బా... నాకూ ఉందోయ్ పని. ఒక్క పూటకేం అయిపోదులే కానీ.. ఏం తిందాం?" లేచి వంటింట్లోకెళ్తూ అడిగింది.

"మంచి నీళ్ళిచ్చి, చెప్పులేసుకో. బయటికెళ్దాం." చెప్పాడు.

సోఫాలోంచి లేస్తూ... "గౌతమి లేదా?" అంటూ ఇల్లంతా పరికించాడోసారి.

మంచినీళ్ళ గ్లాస్ అందిస్తూ చెప్పింది మహతి "వస్తూనే ఎగ్జిబిషన్ ఉందని ముంబై వెళ్ళిపోయింది. పదిరోజుల ట్రిప్ అనుకుంటా."

***

"ఎన్నైనా చెప్పు వంశీ. ఇడ్లీని మించినది మరోటి లేదనుకో." మహతి ఉండే కాలనీ మొదట్లో ఉన్న రెస్టరెంట్ నుండి ఇంటి వైపు నడుస్తున్నారిద్దరూ.

"అవునవును. చందమామలా ఉంటుంది కదా..." నవ్వాడు.

"ప్చ్.. అందుకేం కాదు. " తలెత్తి కృష్ణపక్షచంద్రుడిని చూస్తూ "Waning moon.. నవమి ఇవాళ.." చెప్పింది.

"ఊ.. "

"ఊ... మన పోయెట్స్ ఎడాపెడా వాడేసుకున్నారేం చంద్రుడిని, వెన్నెలనీ.." నవ్వింది.

"...."

"అరుంధతి మీద ఒక్కరైనా రాసారా కవిత్వం?"

"ఏం రాయాలో నువ్వే చెప్పు.. " ఎటో చూస్తూ అన్నాడు అన్యమనస్కంగా .

"నువ్వే కదూ అన్నావు.. పెళ్ళిలో అరుంధతినీ.. పెళ్ళయ్యాక మనశ్శాంతినీ చూసినవాడు లేడని."

"ఊ.. నిజమే కదా?"

"నేను అరుంధతిని చూపిస్తాను నీకు.. అదిగో Northern sky చూడు. చూడూ...." నడిరోడ్డు మీద ఆగిపోయి కళ్ళు చికిలించుకుని చూస్తోంది ఆకాశంలోకి.

చేతులు కట్టుకుని ఆగి చూస్తూ ఊ కొడుతున్నాడు.

"వశిష్టుడు, అరుంధతి.. Mizar and Alcor... Even people with quite poor eye sight also can see them. అవి గుర్తుపట్టగలిగితే దిక్కు తోచక తప్పిపోవడమన్నదే ఉండదన్నమాట. "

"సంసారంలోనా? "

"పోనీ అలాగే అనుకో? అవి binary stars. ఒకదాని చుట్టూ ఒకటి తిరుగుతూ ఉంటాయ్."

"అప్పట్నుంచీ ఒకర్నొకరు విడిచిపెట్టకుండా అలా కాల్చుకుతింటూ ఉండాలన్నమాట .." జేబుల్లో చేతులు పెట్టుకుని నడుస్తూ మహతి మొహంలోకి చూసి నవ్వాడు.

"అబ్బా.. అసలు కథేమిటంటే సప్తర్షులు నార్త్ పోల్ కి తపస్సుకి వెళ్తూంటే, మిగిలిన ఆరుగురి భార్యలూ మధ్యలోనే ఆగిపోయారట. ఇక మేం నడవలేం బాబూ అని. ఒక్క అరుంధతి మాత్రం సప్తర్షిమండలం దాకా వెళ్ళి వశిష్టుడిని విడిచిపెట్టకుండా ఉందట. కృత్తికా నక్షత్రం అంటారు కదా.. అది ఒక cluster of stars. Midway లో ఉంటుంది. అది మిగిలిన ఆరుగురు ఋషిపత్నులూ అని చెప్తారు. అరుంధతి, వశిష్టుడు మాత్రం బెస్ట్ కపుల్ అన్నమాట! ఈ స్కై మేప్ కి ఎంత చక్కటి కథ అల్లారో చూడు."

"అంటే ఏడుగురిలో ఒక్కడి కాపురం మాత్రమే సజావుగా సాగుతోందని logistics అన్నమాట. Not bad!!" సాలోచనగా చూస్తూ చెప్పాడు వంశీ.

వంశీ చేతిమీద కోపంగా కొట్టింది మహతి.

"పోనీ.. ఏడుగురిలో ఆరుగురు అదృష్టవంతులు అనుకుందామా? అదెంత పచ్చి అబద్ధమో చూడు. ఈ వీధిలో వరుసగా ఉన్న ఏడు ఇళ్ళలో.. బ్రహ్మచారులెంతమంది ఉన్నారో లెక్కేద్దామా?"

"ఓయ్.. ఇంత pessimistic గా తయారయ్యావేంటీ? నీలాంటి వాళ్ళని చూస్తే పెళ్ళంటేనే భయమేస్తుంది." సీరియస్ గా చెప్పింది.

"నాకూ భయమేస్తోంది.. పెళ్ళంటే.."

"వంశీ.." నడుస్తున్నదల్లా ఆగిపోయి వంశీ మొహంలోకి చూసింది.

నవ్వుతూ మహతి తలపై చిన్నగా కొట్టి నడవమని సైగ చేసాడు.

***

"ఎన్నాళ్ళ నుండీ ఇలా...?" సోఫాలో వెనక్కి వాలి కళ్ళు మూసుకున్న వంశీని చూస్తూ బాధగా అడిగింది.

"ఎన్నాళ్ళేముంది. అసలు కంపేటబుల్ కాదు మేమిద్దరం." జరిగినదంతా మహతికి చెప్పుకోవడమే ఇంకా వింతగా ఉందతనికి. 'తనకి వెంట్ కావల్సి ఇక్కడికి వచ్చానా..?' అని ఆలోచించుకుంటున్నాడు.

"నేనంటే పోనీ పడదనుకున్నాను. అందరితోనూ ప్రాబ్లం అంటే కష్టం కదా.."

"లేదు మహతీ.. అత్తమామల కాళ్ళు కడిగి నీళ్ళు నెత్తిన జల్లుకోవాలి అనే అజెండాతో ఏ ఆడపిల్లా పెళ్ళి చేసుకోదు. సారీ.. కానీ ఇది నిజం. పుట్టిపెరిగిన ఇల్లు వదిలి వేరే ఫేమిలీతో కలవడం కష్టమే. అరె.. కొత్త వర్క్ ప్లేస్ లో అడ్జస్ట్ అవడానికే ఎంత స్ట్రగుల్ అవుతాం మనం! కొత్త మనుషులతో ఇరవైనాలుగు గంటలూ సర్దుకుపోమని ఏ అమ్మాయినీ అడగలేం. కుదురుతుందా.. మంచిది. లేదా.. ఇద్దరూ ఇద్దరి తల్లిదండ్రులకీ దూరంగా కొత్త లైఫ్ మొదలుపెట్టడం చాలా ఉత్తమం. కానీ.. భార్య కోసం.. అదీ అరేంజ్డ్ మేరేజ్ చేసుకున్న అమ్మాయికోసం... నా వాళ్ళతో రాకాపోకా కూడా మానేసుకోవాలంటే ఎలా? అలాగే పొసెసివ్ నెస్. ఉండాలి.. ప్రేమ ఉన్నచోట అది ఉంటుంది. నా దృష్టిలో అది sense of belongingness. కానీ.. పొసెసివ్ నెస్ ప్రేమని మింగేయకూడదు. మనిషిలో అపనమ్మకం ఒక కేన్సర్ లా పెరిగిపోకూడదు. సర్దుకుపోయాను... మార్చుకోడానికి ప్రయత్నించాను. ఉహూ.. ఆ ప్రాసెస్ లో నన్ను నేను కోల్పోతున్నాను. ఊపిరాడట్లేదా ఇంట్లో. అఫ్కోర్స్.. తనూ సంతోషంగా లేదు." నిట్టూర్చాడు.

"పెళ్ళికి ముందు మాట్లాడుకోవలసింది."

"ఉహూ.. అలా తెలిసేవి కావు కొన్ని."

"అసలీ మేరేజ్ సిస్టమ్ మీద కోపమొస్తుందిందుకే.. గంటల్లో జీవితాలు డిసైడ్ చేసేస్తారు." కోపంగా అంది.

"అన్నేళ్ళ కోర్ట్ షిప్ నీ ప్రేమని కాపాడలేకపోయిందేం?" అనేసి తొందరపడ్డానేమో అని నొచ్చుకున్నాడు.

"నిజమే..." మహతి మొహం మామూలుగా ఉంది. పాతగాయాన్ని నిర్వికారంగా చూసుకుంటున్నట్టు...

"సారీ మహీ.."

"లేదు వంశీ. ఆలోచిస్తున్నాను. హేపీ మేరేజ్ కి ఫార్ములా ఏమిటా అని."

"ఈ విషయం మీద రీసర్చ్ మొదలెట్టేవు గనుక.. జీవితంలో పీహెచ్డీ పూర్తవదు."

మహతి నవ్వలేదు.

"సిస్టమ్ లో తప్పేం లేదు మహతీ. పెళ్ళి అనేది సరైన వ్యక్తుల మధ్య జరిగితే.. జీవితంలో వాళ్ళని ఏ పరిస్థితీ విడదీయలేదు. ఎంత సుఖమది! అదే ఆ ఇద్దరికీ నప్పలేదో.. అంత నరకం మరోటి ఉండదు. రాజీపడుతూ పోవడమా, అశాంతితో రెండు జీవితాలు నలిగిపోవడమా అనేది ఎవరి మనస్తత్వాన్ని బట్టి వారు డిసైడ్ చేసుకోవల్సిందే." నిక్కచ్చిగా చెప్పాడు.

"పోనీ, కౌన్సిలింగ్ కి వెళ్ళాల్సింది. నాకు తనేదో డిప్రెషన్ తో బాధపడుతోందనిపిస్తోంది."

"ఒప్పుకోదు. పోనీ, వెళ్ళినా మనస్తత్వాలు మారిపోవు మహతీ. కొంత సర్దుబాటు ఉండచ్చేమో కానీ, అదెన్నాళ్ళు ?"

"దీనికి సొల్యూషన్..?"

"అదే అర్థం కావడం లేదు."

"వెళ్ళి తీసుకొస్తావా రేపు?"

"ఏమో..."

"అలా ఎలా వదిలేస్తావు వంశీ? తనూ నువ్వు కొట్టావన్న కోపంలో వెళ్ళిపోయి ఉంటుంది. మాట్లాడి చూడు." అనునయంగా అంటున్నదల్లా వంశీ మొహం చూసి ఆగిపోయింది.

"ఆడామగా సమానమే కదా? మరి మగాడి మనశ్శాంతి, ప్రాణాలు అంత చీప్ అయిపోయాయేం మీకు?" కసిగా, సూటిగా అడిగాడు. క్షణంలో చప్పున చల్లారిపోయాడు. మహతి బొమ్మలా చూస్తోంది.

"నా ఫ్రస్టేషన్స్ నీ మీద చూపిస్తున్నాను. సారీ.." అసహనంగా తల విదిలించాడు.

"ఉహూ.. లేదు వంశీ. రూట్ కాజ్ వెతుక్కునో, ప్రపంచాన్ని తిట్టో నువ్వూ, నేనూ సాధించేదేం లేదు. ఈ సమస్యకి పరిష్కారం ఏమిటని?"

"పరిష్కారం లేని సమస్యలేమైనా ఉంటే.. ఇదిగో ఇది మొదటి మెట్టు మీద నిలబడుతుంది. ఏం చేస్తాను? 'నేను చెప్పినట్టల్లా ఆడకపోతే, చస్తానని ' చీటీ రాసిపెట్టి వెళ్ళిపోయిన అమ్మాయిని బతిమాలి, ఇంటికి తెచ్చుకుని ఏం సుఖపడతాను? పోనీ వదిలేస్తే ఎక్కడికి పోతుంది? తెల్లారేసరికి నేను వెళ్ళకపోయినా తనే వస్తుంది. నాకు బాగా తెలుసు. నీకు నా చావు కూడా లెక్కలేదు అని సాధిస్తూ వస్తుంది."

"మనకి సరిపడదని డివోర్స్ తీసేసుకోవచ్చు కదా?"

"మహతీ.. మహతీ.. ఇండియన్ లా మగాడిని నమ్మదు. అందులోనూ అలాంటి డెలికేట్ సైకలాజికల్ కండిషన్ లో ఉన్న సీమ.. నేను విడాకులన్నానంటే నిజంగా ప్రాణం తీసుకున్నా ఆశ్చర్యం లేదు. నిండు ప్రాణం తీసేయలేను కదా చూస్తూ చూస్తూ..."

"అలా అని నువ్వు నలిగిపోలేవు కదా?" సీమని తలుచుకుంటే పిచ్చికోపం వస్తోంది మహతికి.

"నలిగిపోక తప్పేలా లేదు."

"ఛా.. ఏం జీవితం ఇది? నచ్చకపోతే వద్దనుకుని కొత్త లైఫ్ మొదలెట్టాలి కానీ.. ఇలా సాధించుకుంటూ.. తనకి మాత్రం సుఖమా చెప్పు?"

"ఉహూ.. తనూ హేపీగా లేదు. కానీ.. ఏం చెయ్యాలో తనకీ తెలీదు. అలా అని వదిలేసుకునీ ఉండలేదు. ఇంచుమించు నాలాంటి డైలమాలోనే ఉంది తను కూడా..."

"సీరియస్ గా చెప్పి చూడు. మార్పులేకపోతే కుదరదని.."

"మారినా కుదరదు మహతీ. మనసు విరిగిపోయింది. turned off.. completely."

***

ధారగా కారుతున్న చమటల్ని కర్చీఫ్ తో తుడుచుకుంటూ తలుపు తీసుకుని ఇంట్లోకొచ్చింది గౌతమి. భుజాన బరువుగా వేలాడుతున్న ట్రావెల్ బేగ్ ని, కేమెరా బేగ్ నీ హాల్లో దింపి ఫేన్ ఆన్ చేసింది. పవర్ కట్! విసుగ్గా వంటింట్లోకి వెళ్ళి మంచినీళ్ళు తీసుకుతాగింది. టీపాయ్ మీదున్న పేపర్ కాసేపు తిరగేసి, స్నానానికి లేచింది. బెడ్రూమ్ లోకి నడుస్తూండగా హాల్లో ఫేన్ తిరగడం మొదలైన శబ్దం. హమ్మయ్య అనుకుంటూ ఫేన్ స్విచాఫ్ చేసి, బాత్రూమ్ లోకి దూరింది.

స్నానం చేసి కాఫీరంగు కాటన్ పేంట్స్ పై లేత పసుపు పువ్వులున్న టీ షర్ట్ వేసుకుంది. నిస్త్రాణగా మంచం మీద వాలిన గౌతమి కళ్ళకి, మంచం పక్కనున్న టేబుల్ పై తనకి వచ్చిన ఉత్తరాలన్నీ దొంతుగా ఎదురుచూస్తూ కనిపించాయ్. లేచి ఒక్కో కవరూ ఓపెన్ చేస్తున్నదల్లా, ఆగి టేబుల్ వైపు చూసింది. చతురస్రాకారపు పెట్టె ఒకటుందక్కడ! ఫ్రమ్ అడ్రస్ కోసం వెతుక్కుంది. వంశీ!!

ఉత్తరాలు మంచం మీద పడేసి, టేబుల్ సొరుగులోంచి కత్తెర తీసి ఆ కార్డ్ బోర్డ్ పెట్టె పై అతికించున్న టేప్ జాగ్రత్తగా కత్తిరించింది. లోపల బబుల్ రాప్ చుట్టి ఉన్న వస్తువేదో!! అది షిప్ చేసిన కంపెనీ పేరు ముద్రించిన పేపర్ మీద.. *"Does it really make any difference? You tell me! ~ Friendly, Vamsi."* అని రాసున్న మెసేజ్ చూసి ఆత్రంగా బబుల్ రాప్ కట్ చేసింది.

"కాఫీ మగ్! లెఫ్ట్ హేండర్స్ కాఫీ మగ్." పైకే అనేసింది ఆశ్చర్యంగా.. *"Southpaw"* అని ఆకుపచ్చ అక్షరాలు ప్రింట్ చేయబడిన బిస్కట్ కలర్ మగ్ ని, మెసేజ్ ఉన్న కాగితాన్నీ మార్చి మార్చి చూసింది.

***

"వంశీ పంపాడా? నిజమా?" ఆశ్చర్యం నటిస్తున్న మహతి భుజం మీద గట్టిగా గిచ్చింది గౌతమి. ఇద్దరూ మంచం మీద కూర్చుని మధ్యలో ఉన్న కాఫీ మగ్ ని నిశితంగా పరిశీలించారు.

"నీకు తెలీదా తను పంపినట్టు? అబద్ధం చెప్పకు. తోడుదొంగలేగా ఇద్దరూ?" అడిగింది గౌతమి.

"నిజంగా తెలీదమ్మా. ఒట్టు! బాక్స్ మీద పేరు చూసాననుకో.. ఏమిటో అనుకున్నా"

"సరేలే. థాంక్స్ చెప్పేస్తా.."

లేప్టాప్ ఆన్ చేస్తున్న గౌతమి వైపు చిత్రంగా చూస్తూ, "ఓ ఫోన్ కాల్ చేస్తే నీ సొమ్మేం పోతుంది?" అనడిగింది.

"ఏం అక్కర్లేదు. ఫేస్ బుక్ ఉన్నదెందుకూ?"

"ఎవరో అన్నారెప్పుడో... ఫేస్ బుక్ లో అంత యాక్టివ్ కాదు నేనూ అని.." మహతి సాగదీసింది కళ్ళార్పుతూ.

సమాధానం చెప్పకుండా నవ్వుతూ మెసేజ్ టైప్ చేస్తూ మహతి వైపు చూసి అడిగింది.. "వంశీ బర్త్ డే ఎప్పుడు?"

"ఫేస్ బుక్ ఉన్నదెందుకూ?" చెప్పింది మహతి.

"So.. Ms.Southpaw, Can we have coffee sometime?" తన థాంక్స్ కి రిప్లైగా వెంటనే వచ్చిన మెసేజ్ బయటికి చదివి మహతి వైపు ఆశ్చర్యంగా చూసింది.

"కాఫీ మానేసానని చెప్పాడు నాకు..." క్షణకాలం మహతి మొహంలో రంగులు మారాయి.

11

"కాస్త మగ్గాక ఉప్పు జల్లి ఓ నిముషం పాటు మూత పెట్టేయ్. "

"ఓ... ఉప్పు అప్పుడు వెయ్యాలా?" నాన్ స్టిక్ పాన్ కి ఉన్న మూతలోంచి బెండకాయ ముక్కలని చూస్తూ అడిగింది మహతి.

"ఏ కూరకైనా ఉప్పు చివర్లోనే వెయ్యాలి. బెండకాయకి మరీనూ.. జిగురొచ్చేస్తుంది లేదంటే. జీడిపప్పు విడిగా వేపుకుని, అదీ, కొబ్బరీ వేసి ఉప్పూ, కారం చూసుకుని దింపేయడమే. ఎక్కువసేపు మూత పెట్టకు." చెప్పాడు వంశీ.

"........."

"ఓయ్.. ఏం చేస్తున్నావ్?"

"జీడిపప్పు ఎక్కడుందా అని వెతుకుతున్నాను."

"సరిపోయింది. దొరికితే నీ అదృష్టం. దొరకకపోతే దాని అదృష్టం. సరే మరి.. ఉండనా?"

"ఊ.. ఊ.."

"అయినా తమరికి తోచిన మహాపాకాలు వండుకోకుండా.. ఏవిటీ ఫోన్లో సలహాలడిగి మరీ?"

"ఎవరో ఫ్రెండ్ ని డిన్నర్ కి పిలిచావ్లే."

"ఒహ్హో... ఎవరో!"

"ఎవరో..."

"చెప్పొచ్చుగా.." బతిమాలాడు వంశీ.

"ఆనంద్ అనీ.. "

"మగ పురుషుడా!! కూల్...." విజిలేసాడు.

"ఏం? అంత ఆశ్చర్యం!"

"ఏమీ లేదూ... ఎడతెగని వర్షాలెందుకా అనుకున్నాను."

"అంత లేదులే.."

"ఊ.. ఊ... నీ అంతటి నువ్వు బెండకాయ వేపుడు వండి మరీ బోయినానికి పిలిచావంటే ఎంత లేదూ!"

"అతనితో నాకేదో పనో మరోటో ఉందని ఎందుకనుకోవూ... "

"దాచుకో దాచుకో.. నాకేం చెప్పకులే." నిష్టూరాలాడాడు.

"దాచుకుంటున్నదెవరో.. కాఫీ మగ్గుల్ని.." దొరికాడని అనాలనుకున్నది అనేసింది.

"దాచుకునేలా ఉంటే నీ అడ్రస్ కి ఎందుకు పంపుతాను మహీ...!"

మహతి ఏమీ మాట్లాడలేదు.

***

ఊహించినట్టే పాండీ కేఫ్ కి రమ్మని కాల్ చేసాడు వంశీ. వెళ్ళే దారిలో ఆలోచిస్తూనే ఉంది మహతి.. తన గురించి ఏమడుగుతాడని కాదు. అతని గురించి ఏం వినాల్సిరావచ్చో అని..

"No beating around the bush. Are you interested in her?" బాదం టీ సిప్ చేస్తూ అడిగింది మహతి.

"అలా నీకెందుకనిపించింది మహతీ?" ప్రశాంతంగా ఉంది వంశీ మొహం.

"ఏమో.. ఆ గిఫ్ట్ చూసి అనుకున్నాను."

"నీకూ గౌతమి గిఫ్ట్ ఇచ్చింది కదా.. జెమినీడ్స్ ఫోటో.. ఇదీ అలానే అనుకోవచ్చుగా.."

"కమాన్ వంశీ. మనం గ్రోనప్స్ లా మాట్లాడుకుందాం. సీమతో టర్మ్స్ బాలేవు. ఇదే సమయంలో గౌతమి ఇంటెరెస్టింగ్ గా అనిపించడంలో ఆశ్చర్యం లేదు. కానీ క్లారిటీ ఉండాలి కదా నీకు?"

"సీమతో తప్పదు. జీవితాంతం..." నిట్టూర్చాడు.

"నిజమే.. మరి ఈ క్రష్ సంగతేంటి?"

"నీ సంగతి చెప్పు ముందు..." నవ్వుతూ మహతి చేతిమీద చిన్నగా తట్టి అడిగాడు.

"టాపిక్ మార్చకు వంశీ."

"చెప్తాను మహీ... ముందు నీ డిన్నర్ పార్టీ గురించి చెప్పు.."

"ఏముంది.. సీనియర్. వేరే డిపార్ట్మెంట్ లే. డాక్టర్ తను. ప్రపోజ్ చేసాడెప్పుడో.."

"ఊ..."

"రిలేషన్ కి నేను రెడీగా లేనని చెప్పాను."

"అదేం..!!"

"ఉన్నమాటేగా.."

"మహతీ.. time to move on!"

"లేదు వంశీ. ఇతనూ మగాడేగా! నమ్మలేకపోతున్నా. సారీ.. కానీ ఇది నిజం."

"నేనూ అలాగే అనుకుంటే.. నీతో కూడా మాట్లాడకూడదు మహతీ. అఫ్కోర్స్ నువ్వు నన్నూ నమ్మకూడదు. దెబ్బ తగిలినంత మాత్రాన... నడవడానికి భయపడం కదా!"

"ఉహూ.. నిజానికి రిలేషన్, మేరేజ్.. వీటిలోనే ఏదో లోపముంది. నాల్రోజులయ్యాక.. డోపమైన్ లెవల్స్ నార్మల్ అయిపోయాక అన్నీ చప్పగా ఉంటాయి. నన్నేదో మోసం చేసేస్తాడనో, వదిలేస్తాడనో కాదు. నూటికి తొంభై తొమ్మిది మంది అనే మాటే.. 'కొత్త మోజు' అని. మొదట్లో ఉన్నంత ఎక్సైటింగ్ గా ఏదీ ఉండదు. అక్కడి నుండీ రొటీన్ కి అలవాటు పడడం, లేదా దాన్ని బ్రేక్ చెయ్యడానికి ప్రయత్నాలు చేస్తూ లైఫంతా గడిపేయడం. ఏమో.. నా ఆలోచనల్లో నాకే క్లారిటీ లేదనిపిస్తోంది. అందుకే దేనికీ రెడీగా లేనన్నాను." ఒళ్లో చేతులు పెట్టుకు నెమ్మదిగా మాట్లాడుతున్న మహతిని చూస్తే వంశీకి బాధనిపించింది. అసహనంగా నుదురు చేత్తో రుద్దుకున్నాడు.

"లే... " లేచి టిప్ టేబుల్ మీద వదిలి నడిచాడు.

"వెళ్ళాలి వంశీ నేను. నిన్నా ఆఫ్ తీసుకున్నాను మధ్యాహ్నం. వెధవ బెండకాయ కూర.. కుదిరి చావలేదు ఇంత కష్టపడి చేసినా.."

"బెండకాయకి నువ్వు బ్రేక్  తీసుకున్నావని తెలీదుగా.. కూర్చో.." కార్ డోర్ అన్లాక్ చేస్తూ చెప్పాడు.

***

"సీమ ఏమంటోంది." పార్క్ లో బెంచ్ మీద కూర్చుంటూ అడిగింది మహతి.

"ఏముంది. వచ్చింది.. 'నేనెందుకు పోవాలి? ఇది నా ఇల్లు. నా జీవితం నువ్వే నాశనం చేసావు.' అని తన జీవితాన్ని క్లైమ్ చేస్తూ.." నవ్వాడు. ఆ నవ్వులో నీలినీడలున్నాయి.. సుస్పష్టంగా..

"నువ్వేమీ అనలేదా?"

"ఏమనను? 'నీ జీవితం' అనే ఒక్క మాటని డిఫైన్ చెయ్ అన్నానే అనుకో.. ఏం చెప్తుంది?"

"మరేం చేస్తావ్ వంశీ?"

"మహతీ, హేపీ మేరేజ్ కి రెసిపీ నాకూ తెలీదు.  అన్నీ ఉన్నాయ్... ఉద్యోగం. ఫర్నిచర్, బంగారం, ఆస్తిపాస్తులు. కానీ... జీవితం చాలా డ్రైగా ఉంది. ప్రేమ కి నా డెఫినిషన్ ఏంటో తెలుసా... కూర చివర్లో వేసే ఉప్పులాంటిది. దానితోనే రుచి. పడాల్సినంత పడితేనే రుచి. ఒక్క ప్రేమతోనే బతకలేం.. అలా అని లేకుండానూ బతకలేం. అదీ సమస్య."

"మరి నన్నే ధైర్యంతో పెళ్ళి చేసుకోమని సలహా ఇస్తున్నావ్?"

"ఉహూ.. పెళ్ళి చేసుకోమనడం లేదు. నెగిటివ్ థింకింగ్ వద్దంటున్నాను. ఏ మలుపులో ఏముందో.. అక్కడి దాకా నడిచివెళ్ళాక కదా తెలిసేదీ! ఇక్కడే ఆగిపోకు. ఆ ఆనంద్ నీ సోల్ మేట్ అవుతాడేమో.. అవకాశం ఎందుకు కాదనుకోవడం?"

"మనసుతో ఎక్స్పెరిమెంట్ చెయ్యలేను. మళ్ళీ గాయపడితే?"

"నీకెలా చెప్పాలో తెలియడం లేదు మహతీ. నమ్మకం కోల్పోకు.. మనుషుల మీద.. లైఫ్ మీద.."

"......"

"ఇంతకీ నో చెప్పడానికా పిలిచావ్ డిన్నర్ కి?" ఆటపట్టిస్తున్నట్టూ అడిగాడు.

"ఊ... మొదటిసారి రిజెక్ట్ చేసినపుడు ఇంత అన్రొమాంటిక్ ప్లేస్ లో ప్రపోజ్ చెయ్యడం నాదే తప్పు అని నవ్వేసాడు. మళ్ళీ ఆలోచించు.. అని Read the specimen once again! అన్నంత సులువుగా చెప్పాడు."

"ఊ...."

"అందుకే.. రొమాంటిక్ ఈవెనింగ్ నా నిర్ణయాన్ని మార్చలేదని చెప్పాను నిన్న..."

"Gosh.. You are impossible!! పాపం మానవుడు."

"ఓ మాట చెప్పనా వంశీ.. " కాస్త ఆగి ఆలోచిస్తూ చెప్పింది.

"ప్లీజ్...." ముందుకు వంగి మహతి మొహంలోకే చూస్తూ చెప్పాడు.

"నిన్నటి ఈవెనింగ్ చివర్లో.. నేను అవునని చెప్పుంటే.. ఈరోజు చాలా బావుండేది. ఇద్దరం స్వీట్ నథింగ్స్ మాట్లాడుకుంటూ ఉండేవాళ్ళం. కానీ... ఏదో ఒక రోజు వస్తుంది. నేనో తనో.. విసుక్కునే రోజు. ప్రేమ తగ్గిపోయిందనో, సరిపోదనో కంప్లైంట్ చేసుకునే రోజు, కోపంలో అరుచుకునే రోజు.. వస్తుంది. కాదంటావా?"

"చీకటి పడితే తప్ప కనిపించని నక్షత్రాలని నమ్మే మహతేనా.. ఎదురుగా కనిపించే ప్రేమని చూడకుండా కళ్ళు మూసుకుంటున్నది!" ఆశ్చర్యంగా అడిగాడు.

"అవక్కడే ఉంటాయ్ వంశీ. వెలుగులో కనిపించవు.. నమ్మొచ్చు." నవ్వింది.

"ప్రేమా ఉంటుంది మహతీ.. కోపంలో కనిపించకపోవచ్చు. నమ్మాలి." అదే టోన్ లో చెప్పాడు.

"మరి సీమలో కూడా ప్రేమ ఉందా?"

"ప్చ.... అది డిఫరెంట్ కేస్ లే.." చప్పరించేసాడు.

"నువ్వు ప్రయత్నించావా? నువ్వు తనని మార్చుకోవాలని ప్రయత్నించావా?" నిలదీసింది.

"నేను ఎవరితోనూ షేర్ చేసుకోకపోవడానికి కారణం ఇదే మహీ.. Stepping into my shoes.. it's not that easy! నేను నీకు చెప్పినవి ఓ టెన్ పర్సెంట్ ఉంటాయేమో. బహుశా జరిగే దానిలో నా తప్పూ ఉందేమో. కానీ, మారడం, మార్చడం ఇలాంటి థియరిటికల్ సొల్యూషన్స్ కి లొంగని సమస్యలుంటాయని ఆ సమస్యలో మునిగి ఉన్నవాడికి మాత్రమే అర్థమవుతుంది. సీమా, నేను.. ఇద్దరం సినిమాల్లో చూపించే రైల్ పట్టాల్లా సమాంతరంగా నడిచిపోవడమే.."

"ఎక్కడో ఇంకెవరో క్రాస్ అవుతారా ఓ రైలు పట్టాకి? కాఫీ మగ్గుతో.." వెటకారంగా అడిగింది.

"అందుకే నువ్వు మంచి ఫ్రెండ్ వి. ఎక్కడా విడిచిపెట్టవు." పకపకా నవ్వాడు మహతి మొహంలోకి చూసి.

"గౌతమి కి ఆశలు రేపొద్దు వంశీ.." సీరియస్ గా చెప్పింది మహతి.

"పోనీ ఏం చెయ్యమంటావో నువ్వే చెప్పు... సీమకి లొంగిపోమంటావా? నన్ను నేను కోల్పోమంటావా? తనకున్న ఇన్సెక్యూరిటీస్ ని భరిస్తూ, తన అనుమానాలకి బలవుతూ, నా నిండు జీవితం ఖరీదు చెల్లించి కూడా కాస్తైనా మనశ్శాంతిని పొందలేక సతమతమవుతూ.. ఇలా శేషజీవితం గడిపేయమంటావా! తనకున్న బలహీనతలకి జాలిపడితే, నామీద నేనే జాలిపడాల్సి వస్తుంది. స్వార్థంలా అనిపిస్తుందేమో నీకు.. కానీ ఆలోచించు. నన్ను నేను వదిలేసుకుంటే.. అప్పుడైనా సుఖముంటుందని నమ్మకం లేదు. నా ఫేమిలీని, నా పర్సనల్ స్పేస్ ని ఓ మనిషిని సంతోషపరచడానికి కోల్పోవాలి నేను." వంశీ కళ్ళలో కోపం మండుతోంది.

చాలాసేపు ఇద్దరూ ఏమీ మాట్లాడుకోలేదు. చీకటి చిక్కబడుతూండగా బెంచ్ మీద నుండి లేచి బయటికి నడిచారు. కార్ లో మౌనంగా కూర్చున్నాక ఓ నిర్ణయానికి వచ్చినట్టు చెప్పింది మహతి.

"నీ విషయమేవిటో తేలే దాకా గౌతమి గురించి ఆలోచించకు వంశీ..."

"మహతీ... గౌతమి పట్ల నేను అట్రాక్ట్ అయిన మాట నిజం. కానీ, అది ప్లాన్డ్ మాత్రం కాదు. యాదృచ్ఛికం. ఇంతకు మించి ఇప్పుడేం చెప్పలేను. ఆశలు కల్పించడం.. ఉహు.. గౌతమి అంత అమాయకురాలు కాదు. ఓ కాఫీ మగ్ కో, ఓ కాఫీ డేట్ కో ధామ్మని పడిపోయి పెళ్ళైనవాడిని ప్రేమించేస్తుందంటావా!!" డ్రైవ్ చేస్తూనే మహతివైపు ఓ సారి తలతిప్పి నవ్వాడు. ఆ నవ్వులో కల్మషం కనిపిస్తుందేమో అని వెతికింది మహతి.

ఉన్నట్టుండి గుర్తొచ్చి వంశీ మీద గయ్యిమని లేచిందింతలో..

"దుర్మార్గుడా.. కాఫీ మానేసానని చెప్పావ్ నాతో.."

అర్థం కానట్టు చూసాడు.

"గౌతమిని కాఫీకి రమ్మన్నావుగా!"

"హహ్హహ్హహా... అదా! మొన్న నేనేం తాగానో గౌతమిని అడుగు."

"ఓహో.. అల్రెడీ డేట్ కి తీసుకెళ్ళావనమాట. నేను వారంరోజులై ఊపిరి సలపకుండా తిరుగుతున్నాను. బావుందయ్యా.. చాలా బావుంది." ఫోన్ లో గౌతమి నంబర్ డయల్ చేస్తూ చెప్పింది.

"ఓయ్ పిల్లా.. ఓ విషయం అడుగుతాను నిన్ను.."

"...."

"మొన్న వంశీ కాఫీ తాగాడా?"

"......"

"మరి కాఫీకి రమ్మని ఎందుకు పిలిచాడటా?"

"......"

"ఏం చెప్పింది?" మహతి కాల్ కట్ చేసాక అడిగాడు వంశీ.

"Can I take a rain check? అని చాలా పొలైట్ గా అడిగి స్మూదీ తాగావట కదా!"

నిశబ్దంగా నవ్వుతున్నాడు వంశీ.

"కాఫీ ఎందుకు మానేసావు వంశీ?" కార్ డోర్ వేసి, వంశీ వైపుకి వచ్చి నిలబడి అడిగింది. ఇంటి గేట్ ముందు ఆడుతున్న పిల్లలు గోలగోలగా అరుస్తున్నారు.

"కాఫీ అనే లగ్జరీని వదిలేసుకున్నాను.. లోటు బడ్జెట్ వల్ల." మహతి కళ్ళలోకి చూస్తూ చెప్పాడు.

"అంత లోటేమొచ్చింది?"

"అలా నిలదీస్తే కష్టమమ్మాయ్!" నవ్వు వెలుగు కాస్త తగ్గిందతని మొహంలో.. "ఉప్పు నిండుకుంది ఇంట్లో.." కార్ ముందుకు పోనిచ్చాడు.

***

ఏసీ గాలి చల్లగా శరీరాన్ని నిమురుతోంది. బెడ్ లేంప్ కిరణాలు గోడమీద నీడలతో సమాంతరంగా తారట్లాడుతున్నాయి. అర్ధరాత్రిని సమీపిస్తున్న రేయి నిశబ్దంగా జోకొడుతోంది.

పక్కకి తిరిగి నిద్రపోతున్న వంశీని వెనుక నుండి హత్తుకుంది సీమ. ఉలిక్కిపడ్డాడు. శరీరానికి కలిగిన జలదరింపుని అణిచిపెడుతూ పళ్ళు బిగించాడు. భుజం పట్టి తనవైపుకి తిప్పుకుందతన్ని..

"పడుకో సీమా.." ఆ మాట చురకత్తిలా సీమ అహాన్ని కస్సున కోసిపారేసింది.

"తలనొప్పా?" అతని భుజం మీద ఆమె చెయ్యి బిగిసింది.

సమాధానం చెప్పలేదతను.

కాసేపట్లో బాత్రూమ్ లోంచి వినిపిస్తున్న శబ్దాలకి తుళ్ళి పడి లేచాడు. ఓరగా తీసున్న తలుపు తోసుకుని లోపలికెళ్ళేసరికి హేండ్ మిర్రర్ నేలమీద బద్దలై పడుంది.

"ఏమయింది?" తీక్షణంగా అడిగాడు.

"నీకు నా అందం తక్కువయిందేమో అని చూసుకుంటున్నాను.." ఆమె కళ్ళు ఉక్రోషంతో రగిలిపోతున్నాయి.

"పద.. పడుకో.." నిర్లక్ష్యంగా బెడ్రూమ్ లోకి నడిచాడు.

"ఎలా పడుకోమంటావ్! ఏముంది నాకీ ఇంట్లో..? కోపమొచ్చి వెళ్ళిపోతే కూడా పట్టించుకోవు. ఏడిస్తే ఓదార్చవు." అరిచింది కసిగా.. నిశబ్దంగా మంచంపై వాలి కళ్ళు మూసుకున్నాడు. చరచరా నడిచి వచ్చింది గదిలోకి.

"నాలుగురోజులు నేను కనుమరుగైతే చాలు.. నీకు నూరిపొయ్యాల్సినవన్నీ పోసేస్తుందావిడ. చెప్పిందా నాతో కాపురం చెయ్యద్దని?" విసురుగా లైట్ ఆన్ చేసి వంశీని కుదుపుతూ అడిగింది.

"నిన్నెవడు వెళ్ళిపోమన్నాడు? వెనక్కి రాగానే నవ్వుతూ స్వాగతం పలకాలా?" లేచి కూర్చుంటూ అడిగాడు. అతని గొంతు మామూలుగా ఉంది.

"నా లెక్క నీకేముంది? నువ్వు పారేసే డబ్బుకోసం లక్ష మంది ఆడకుక్కలు నీ చుట్టూ తిరుగుతున్నారు కదా!!" రెట్టించింది.

సూటిగా ఆమె వైపు చూసాడు. అసహ్యం కంటే ఎక్కువైనదేదో ఉందా చూపులో..

"ఏం.. అలా చూస్తావేం."

"....."

"నాకు పిల్లలు కావాలి. అప్పుడు కానీ నాకు విలువ ఉండదు." ఒక్కోమాటా చాలా స్థిరంగా పలికింది.

"నీకు పిల్లలు కావాలంటే నీ ఇష్టం. నాతో మాత్రం కుదరదు." అంతే స్థిరంగా చెప్పాడు.

"వంశీ...." నమ్మలేనట్టు చూస్తూ ఉండిపోయింది.

చాలా ప్రశాంతంగా చూస్తున్నాడు.

"నన్ను.. అనుమానిస్తున్నావా?" దెబ్బతిన్న ఆడపులిలా ఉందామె గొంతు.

"లేదు సీమా. నాకు సంస్కారం ఉంది. అందుకే నేరుగానే చెప్తున్నాను. నీ ఇష్టం అని."

మాటలుడిగి నిలబడిపోయింది సీమ.

"నీకు నా మీద నమ్మకం లేదు. ఇష్టం లేదు. పోనీ.. నేను చెడ్డవాడినే నువ్వనుకుంటున్నట్టూ. నా వాళ్ళందరూ చెడ్డవాళ్ళే . మరి అలాంటి నాతో నీకు పిల్లలెందుకు?" సూటిగా అడిగాడు.

"కాపురం నిలబెట్టుకోవాలనే చూస్తుంది ఏ ఆడదైనా..." రోషంగా సమాధానమిచ్చింది.

"కాపురం కోసం పిల్లలు!" పెదవి విరిచాడు.

వింతేముందన్నట్టు చూసింది.

"పిల్లలని కనడానికి ఆడామగా సరిపోతారేమో... పెంచడానికి అమ్మా నాన్నా కావాలి." స్పష్టంగా పలికిందతని గొంతు.

***

"We believe we re choosing a partner. But we may merely be the happy victims of nature s lovely plan."

"అలా అన్నాడా?" ఆశ్చర్యంగా కళ్ళు విప్పార్చి అడిగింది గౌతమి. అవునన్నట్టు తలూపింది మహతి.

"అంటే..? marriages are made in heaven టైప్సా ఈ నేచర్స్ లవ్లీ ప్లాన్ అంటే.. కొటేషన్ బావుందోయ్!" నవ్వింది.

"ఉహూ.. కాదు నువ్విలా నిలబడు చెప్తాను." డాబా పిట్టగోడకి ఆనుకుని ఉన్న గౌతమిని తన ఎదురుగా లాక్కుని చేతులు పట్టుకుని వేళ్ళతో తన అరచేతుల్లో రాస్తూ చెప్పింది.

"ఊ.. కితకితలూ..." గౌతమి కిలకిల్లాడింది.

"అబ్బా ఉండూ.. ఇలా నిలబడ్డాడు. నన్నిలా ఎదురుగా నిలబెట్టుకుని చెప్పాడనమాట. ఇప్పుడు నువ్వు మహతి. నేను..." పేరు మింగేసింది.

"అబ్బో.. అబ్బో... ఊ.. ఊ.." మహతి గుండ్రటి మొహంలో జిగేల్మని మెరిసిన సిగ్గుని చూసి పకపకా నవ్వింది గౌతమి.

"ఎవరినైనా నువ్వు ఇష్టపడ్డావంటే.. దానికి 55% వాళ్ళ body language కారణమట. 38% కారణం వాళ్ళ గొంతు వలన. tone and speed of their voice వలన అన్నమాట. ఇక కేవలం 7% మాత్రమే వాళ్ళు నీతో ఏం మాట్లాడారూ అనే దానివలన.."

"ఊ..." ఆసక్తిగా చూస్తోంది గౌతమి.

"మనం ఎన్నో చూసుకుని ఎంచుకున్నామనుకుంటాం కానీ.. ఇదంతా నేచర్స్ ప్లాన్ అంటాడు తను. ఎందుకంటే.. With an irresistible cocktail of chemicals, our brain entices us to fall in love. బ్రైన్ లో కెమికల్స్ వలనే మనం ప్రేమలో పడతాం అని.."

"నిజమా!!"

"ఊ ఊ.. నిజమే."

"కెమికల్ రియాక్షన్ వల్ల ఇంకేదో జరుగుతుంది కానీ లవ్.. ఉహూ.." కన్నుగీటింది గౌతమి.

"లవ్వంటే 'నువ్వాదరినీ.. నేనీదరినీ' టైపు ప్లెటోనిక్ లవ్ కాదమ్మా.. అతి మామూలు మనుషుల మధ్య లవ్! లస్ట్, అట్రాక్షన్, అటాచ్మెంట్. ప్రేమలో ఇవి మూడు ఫేజెస్ అనుకుంటే.. ఆడ మగా ఒకరినొకరు చూసుకోగానే టెస్టోస్టిరాన్, ఈస్ట్రోజెన్ రిలీజ్ అవుతాయట. ఇది లస్ట్ కి కారణం." చెప్పింది మహతి.

"మేల్, ఫీమేల్ హార్మోన్స్ కదా ఇవి?" గౌతమి చేతులు ఇంకా మహతి చేతుల్లోనే ఉన్నాయి.

"యెస్. రెండో ఫేజ్.. అట్రాక్షన్. సడెన్ గా ఏ షాపింగ్ మాల్ లోనో, ఏ బయోకెమిస్ట్రీ లేబ్ లోనో అతను ఎదురయ్యాడనుకో.. నోరు తడారిపోయి, చమటలు పట్టేసి గుండె దడా దడా కొట్టేసుకుంటుంది చూడు.. దానికి కారణం Adrenaline అనమాట."

"స్వదేశ్ కి ఇంటర్వ్యూకి వెళ్ళినప్పుడు నాలో ఇదే రిలీజయిందనమాట!" నవ్వింది గౌతమి.

"ఓ..యా! ఇదే. ఇక ప్రేమలో పడితే.. 'గాల్లో తేలినట్టుందే... గుండె పేలినట్టుందే..' అన్నట్టుంటుంది చూడూ. బోలెడంత హుషారొచ్చేస్తుంది. ఆకలెయ్యదు. నిద్రపట్టదు. హైపర్ అయిపోతాం. కొకైన్ తీసుకున్నట్టూ.. దానికి కారణం Dopamine. నిజంగా కొకైన్ తీసుకుంటే బ్రైన్ మీద ఏ ఎఫెక్ట్ ఉంటుందో.. ఈ డోపమైన్ రిలీజ్ అయినా అంతే. అట్రాక్షన్ ఫేజ్ లో రిలీజయ్యే రెండో హార్మోన్ ఇది."

గౌతమి నమ్మలేనట్టు చూస్తోంది. మహతి ఉత్సాహంగా చెప్పుకుపోతోంది.

"ఇక మూడోదీ అతి ముఖ్యమైనదీ Serotonin. OCD అంటారు తెలుసా నీకూ? Obsessive Compulsive Disorder. ఈ జబ్బున్నవాళ్ళలో సెరటోనిన్ లెవెల్స్ ఎంతో అంత ఉంటుందట ప్రేమలో పడ్డ వాళ్ళ శరీరంలో.. దీని వలన ఏమవుతుందో తెలుసా?" ఆగి నవ్వింది.

"బాబోయ్.. అయితే ప్రేమ రోగమేననమాట! ఊ చెప్పు."

"టూ ప్లస్ టూ.."

"అంటే మనమిద్దరం మనకిద్దరూనా? అప్పుడే!" అంటున్న గౌతమి చేతిమీద కొట్టి నవ్వింది మహతి.

"తను ప్రేమించిన అబ్బాయి 'two plus two equals to four' అని చెప్పినా 'అబ్బ! ఏం చెప్పాడసలూ..!' అంటుందట అమ్మాయ్. అంటే వాళ్ళలో ఉన్న మంచి కొండంతలవుతుంది. flaws కనిపించవు. అంతా rosy గా ఊహించేసుకుంటామనమాట!"

"హహ్హా.. అదా టూ ప్లస్ టూ అంటే!" నవ్వింది గౌతమి.

"ఊ.. నా డైలాగ్ కాదులే. ఎప్పుడో వంశీ చెప్పాడు. ఎక్కడో చదివానని.." వంశీ పేరు గౌతమిలో ఏ మార్పు తెస్తుందా అని కనుకొలకుల్లోంచి గమనించింది మహతి. క్షణకాలం గౌతమి పెదాలు బిగించి విడిచింది.

"ఇక అటాచ్మెంట్ పిల్లా... Oxytocin and Vasopressin ఈ రెండు neurotransmitters అవసరం ఇద్దరు జీవితకాలం కలిసి ఉండాలంటే."

"వైర్లూ ట్యూబులూ కనిపిస్తున్నాయి నాకు నువ్వు చెప్తున్న పేర్లు వింటూంటే?" నవ్వాపుకుంది గౌతమి. సీరియస్ గా చూస్తున్న మహతితో చెప్పమన్నట్టు సైగ చేసింది.

"Oxytocin చైల్డ్ బర్త్ లో ఇంపార్టంట్ రోల్ ప్లే చేస్తుంది. తల్లీ బిడ్డల మధ్య అటాచ్మెంట్ కి ఈ ఆక్సిటోసినే కారణం." చెప్పింది మహతి.

"అవునా!! ఇదే రిలీజ్ అవుతుందా ఆడా మగా మధ్యా..!!"

"ఊ.. ఎప్పుడో తెలుసా.. ఆర్గాజమ్ కలిగినపుడు."

నమ్మలేనట్టు చూసింది గౌతమి. అవునన్నట్టు తలూపింది మహతి.

"Intense love making. It deepens the feelings of attachment and makes couples feel much closer to one another after they have had sex. సృష్టిరహస్యం ఇదే! ఇక

Vasopressin కూడా అప్పుడు రిలీజ్ అయ్యే హార్మోనే. లాంగ్ టర్మ్ కమిట్ మెంట్ కి ఇది చాలా హెల్ప్ చేస్తుందట."

నిశబ్దంగా వింటూ ఉండిపోయింది గౌతమి.

"Complete strangers ఇద్దరు అరగంట కూర్చుని కాఫీ తాగుతూ, ఒకరి గురించి ఒకరు కబుర్లు చెప్పుకుని, ఆ తరువాత నాలుగంటే నాలుగే నిముషాలు ఒకరి కళ్ళలోకి ఒకరు చూస్తే.. లవ్ హార్మోన్స్ రిలీజ్ అయిపోతాయట! మొదటి స్టేజ్ లోకి ఎంటరైపోతారు. ఆపై ఆ ఇద్దరి కృషీ అనమాట!" నవ్వింది.

కాసేపాగి చెప్పింది మహతి.. నెమ్మదిగా కలలో మాట్లాడినట్టూ..

"నా చేతులు పట్టుకు చెప్పాడు గౌతమీ.. ఇలాంటి చల్లటి వేళలో.. చుక్కలు పొడుస్తూండగా.. నా కళ్ళలోకి చూస్తూ.. 'నా బైక్ మీద నిన్ను లేబ్ కి దించి నీ టైం లో నాలుగు నిముషాలు సేవ్ చేస్తా ప్రతీ రోజూ. నీ కళ్ళలోకి చూసేందుకు.. ఇలాంటి నాలుగు నిముషాలు ప్రతిరోజూ..' అని."

మహతి భుజాల చుట్టూ చెయ్యి వేసింది గౌతమి. రెండు నిముషాల తరువాత అడిగింది..

"పెళ్ళి చేసుకుంటావా ఆనంద్ ని?"

"ప్రేమ నిజమే అయితే... దాన్ని కట్టేసుకోవాలా తాళ్ళతో?" మహతి కళ్ళలో నక్షత్రాల వెలుగు తళతళా మెరిసింది.

## 12

"కంగ్రాట్స్ గౌతమీ! ప్రైడ్ చూశాను." లోపలికి వస్తూనే పాండీ కేఫ్ మారుమ్రోగేలా అరిచింది మహతి.

అప్పటికే వచ్చి తన కోసం ఎదురుచూస్తున్న వంశీ, గౌతమి కూర్చున్న టేబుల్ దగ్గరకి గబగబా వచ్చింది.

ఏమిటన్నట్టు గౌతమి మొహంలోకి చూశాడు వంశీ. కుర్చీలో కూర్చుంటూ మహతి అందించిన చేతిని నవ్వుతూ అందుకుంది గౌతమి.

"భలే ఉన్నాయ్ ఏనుగులు.. ఎప్పుడు తీశావు ఫోటో?" మహతి మొహంలో సంబరం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

"మనం రావిపాడు వెళ్ళొచ్చాక ముంబై వెళ్ళాను కదా.. అప్పుడే ఓ ఫ్రెండ్ ని కలవడానికి అలా జైపూర్ వెళ్ళాల్సివచ్చింది. మనం

రావిపాడులో ఉన్న పౌర్ణమికే జైపూర్ లో ఎలిఫెంట్ ఫెస్టివల్ అవుతుంది. రాయల్ ఫోర్ట్ దగ్గర పెరేడ్ జరుగుతుందిలే. మిస్ అయ్యానీసారి. ఆ ఏనుగులే అవి. ఎక్కడికో తీసుకెళ్తున్నారు. నా కంట పడ్డాయి.. ఐ మీన్ నా కేమెరా కంట.."గౌతమి నవ్వుతూ చెప్పింది.

"మా ప్రొఫెసర్ చేతిలో చూశాను మేగజైన్. అదే ఇష్యూలో "Poaching the Pride" అని ఎలిఫెంట్స్ గురించి ప్రైడ్ కి స్పెషల్ ఆర్టికల్ రాశారాయన. చదవమని ఇచ్చారు. చదువుతూ కవర్ పేజ్ బావుందని చూశాను. ఎడారిలో ఏనుగులేంటా అని.. లోపల నీ పేరు చూడగానే నేను గెంతులు!! ఆయన నవ్వుతున్నారు. 'నా ఆర్టికల్ కంటే నీ ఫ్రెండ్ తీసిన ఫోటోకే ఎక్సైట్ అవుతున్నావు నువ్వు..' అని." గలగలా చెప్పేస్తూ వంశీ ఆర్డర్ చేసుకున్న ఐస్క్రీమ్ ని వెయిటర్ చేతిలోంచి అందుకుంది.

"ఊ.. కానీ..." అన్నట్టు చూశాడు.

"నువ్వు తెప్పించుకోవోయ్ మరోటి. లేడీస్ ఫస్ట్."

"అదే.. గౌతమి రెండు ఐస్క్రీమ్ లు తినగలదా అని.." సీరియస్ గా అన్నాడు.

"హా.. హా.. హ్హో.... కుళ్ళు జోకు" వెక్కిరించింది.

"ఇంతకీ మేగజైన్ తెచ్చావా? నేనూ చూసేవాణ్ణి కదా.." మహతిని అడుగుతూనే, "కంగ్రాట్స్ మేడమ్.." అని గౌతమితో చెప్పాడు.

"థాంక్యూ థాంక్యూ.. " తన హేండ్ బేగ్ లోంచి మేగజైన్ తీసి అతని చేతికి అందించింది గౌతమి.

బంగారువన్నెలో మెరిసిపోతున్న ఇసుకలో ఒకదానినికటి ఒరుసుకుని నడుస్తున్న రెండు ఏనుగులు.. ఇండియన్ టూరిజం మేగజైన్ "The Pride" కవర్ పేజ్ పై! లోపలి పేజీలో కవర్ పేజ్ ఫొటో క్రెడిట్ 'గౌతమి రాచకొండ' అని రాసి ఉంది.

"బావుంది.. నేచర్ ఫోటోగ్రఫీ నీ ఇంట్రస్ట్ ఏరియా అనుకుంటా?" పుస్తకం తిరిగిచ్చేస్తూ అడిగాడు.

"అలా అనేం లేదు. నేచర్ ఇప్పుడిప్పుడే తీస్తున్నాను."

"ఓ.. స్వదేశ్ లో చేసేదానివి కదూ?"

"ఊ.. "

"ఇప్పుడు..?"

"ఓ కన్సల్టెన్సీ కి చేస్తున్నాను.. వాళ్ళ ప్రైమ్ వెండార్.. ఇండియన్ టూరిజం కార్ప్ అనమాట"

"స్వదేశ్ కూడా మంచి పేపరే కదా! ఎందుకొదిలేసావ్? ఎంచక్కా రోజూ నీ పేరు పేపర్లో పడేది." అడిగింది మహతి.

"రోజూ ఏం వేసేసుకోరు, మనం ఫోటోలు తీసాం కదా అని.. " గౌతమి నవ్వింది.

"స్వదేశ్ లో వర్క్ బావుండేది. కానీ మానేసాను." మళ్ళీ తనే చెప్పింది.

"ఏమయిందీ.. బాస్ తో పడలేదా?" అడుగుతున్న మహతి వైపు చురుగ్గా చూశాడు వంశీ.

"అదేం కాదు. మా జగ్మోహన్ మహంతీ.. కూలెస్ట్ బాస్ అసలు! ఓ ఫెర్టిలైజర్స్ కంపెనీతో గొడవ. వాళ్ళు నన్ను మేనేజ్ చేద్దామనుకున్నారు. నేను ఒప్పుకోలేదు. మానేసాను."

"ఒక్ఖ ముక్క అర్ధం కాకుండా భలే చెప్పావు.." వంశీని అనుకరిస్తూ సీరియస్ గా చెప్పింది మహతి.

ఇద్దర్నీ మార్చి మార్చి చూస్తున్నవాడు కాస్తా నవ్వాపుకుంటూ మహతి తలమీద మొట్టాడు.

"చెప్తా చెప్తా.. బేలూర్ లో చేసేదాన్ని. రాంధావన్ ఫెర్టిలైజర్స్ అని వినే ఉంటారు కదా! వాళ్ళకి ఊరి చివర్లో ఓ ప్రెమిసెస్ లో రెండు ప్లాంట్లున్నాయ్. అక్కడే మూడో ప్లాంట్ మొదలుపెట్టాలనుకున్నారు వాళ్ళు .. రన్ చేసుకోవడం సులువు కదా అని. అప్పటికే ఉన్న ప్లాంట్స్ వల్ల చుట్టుపక్కల ఆరేడు కిలోమీటర్ల రేడియస్ లో బాగా పొల్యూట్ అయిపోయింది. అలాంటిచోట మళ్ళీ ఇంకోటంటే.. చాలా హజార్డస్. హై ప్రెషర్ బాయిలర్స్ ఉంటాయ్ ప్లాంట్స్ లో. అన్నీ పక్కపక్కనే ఉంటే ఏ ఒక్క ప్లాంట్ లో ఏం జరిగినా... చాలా పెద్దదవుతుంది."

"భోపాల్ లో పేలినట్టూ... అమ్మో! ఆ తరువాత ఎన్ని జెనిటిక్ డిజార్డర్స్ వస్తాయో అసలు!" బాధగా చెప్పింది మహతి.

"ఎగ్జాక్ట్లీ..! సరే ఎప్పుడో పేలడం సంగతెలా ఉన్నా, ప్రస్తుతం ఉన్నదానివల్ల ఆ చుట్టుపక్కల నీరు పాడైపోయింది. గాలి బాగులేదు. అప్పటికే కళ్ళకీ, స్కిన్ కీ జబ్బులొచ్చి ఉన్నారు అక్కడి జనం. మూడో ప్లాంట్ వీల్లేదన్నారు. ఎన్విరాన్మెంటల్ పబ్లిక్ హియరింగ్ లో కలెక్టర్ కి నో చెప్పేసారు. కానీ.. రాంధావన్ వాళ్ళు కలెక్టర్ ని మేనేజ్ చేసారు. విషయం పేపర్లలో కూడా రాకపోతే ఇక సమస్య ఉండేది కాదు. కానీ నేను ఫోటో ఫీచర్ చేసేశాను."

"ఏం ఫోటోలు..?" వంశీ ఆసక్తిగా అడిగాడు.

ఒక్క క్షణం కళ్ళు కలిసాయి. చటుక్కున విడిపించుకుంది గౌతమి.

"ఫోటోలంటే.. అక్కడి బోర్ వెల్ లో పసుప్పచ్చటి నీళ్ళొస్తాయి. చెప్పాను కదా.. స్కిన్ డిసీజెస్, లంగ్స్ పాడైనవాళ్ళు . ఓ చిన్నపాప కళ్ళకి ఏదో జబ్బుతో పుట్టింది. ఆ పిల్ల చూడలేదంటే నమ్మబుద్ధి కాలేదు నాకు. ఇవన్నీ ఫీచర్ చేసాను."

"కలక్టర్ నో అబ్జక్షన్ ఇచ్చేసాక నువ్వేం చెయ్యగలవు?" మహతి ప్రశ్న.

"మీడియా చాలా పవర్ఫుల్ కదా మహతీ. పేపర్లలో వచ్చిన దాన్ని చూపిస్తూ ఎవరైనా కోర్ట్ కి వెళ్ళొచ్చు. మహంతీ చొరవ వల్ల నా ఫీచర్

పేపర్లో వచ్చేసింది. అదీ నేషనల్ పేజ్ లో! రాంధావన్ వాళ్ళు చూస్తూ ఊరుకోరు కదా! నన్ను చాలా ఇబ్బందిపెట్టారు. మనశ్శాంతి లేకుండా ఎందుకని.. రిజైన్ చేసాను." గౌతమి ముగించింది.

"సో, యూ క్విట్. ఎందుకలా! ఫైట్ చెయ్యలేకా?" అడగకుండా ఉండలేకపోయాడు వంశీ.

"అక్కడ అనుకున్న పనైతే చేసేశాను కదా.. వర్క్ తో పాటూ పీసాఫ్ మైండ్ కూడా ముఖ్యం. ఇంకో ఫోటోగ్రాఫర్ దొరుకుతాడు స్వదేశ్ కి. నాకూ ఇంకో జాబ్ దొరుకుతుంది." తేలిగ్గా చెప్తున్న గౌతమి వైపు పరిశీలనగా చూశాడు.

"లైఫ్ ని ఇంత ఈజీగా తీసుకుంటుందా..!!" మనసులో అనుకున్నాడు.

"లైఫ్ ని ఈజీగా తీసుకోవడమని కాదు కానీ.. అదంతే!" వంశీ మనసు చదివినట్టు చెప్పింది గౌతమి.

ఆలోచిస్తూ ఉండిపోయాడు వంశీ.

***

హఠాత్తుగా కళ్ళు విప్పిన మహతికి గోపీచందనం రంగు గోడమీద టిక్ టిక్ మంటున్న గడియారం కనిపించింది. పది!! ఉదయమా..? ఇంత వెలుగేంటీ అని చటుక్కున లేచింది. టైం తప్పేమో అనిపించి చేతికున్న వాచ్ చూసుకుంది. నాలుగున్నర అని చూపిస్తోందే!! ఏది కరెక్ట్? మంచం దిగి చుట్టూ చూసింది. హాస్టల్ గది!!

తను ఎనిమిదేళ్ళ క్రితం విడిచిపెట్టేసిన కాలేజ్ హాస్టల్! కల కంటోందా? కళ్ళు తెరిస్తే తెలివి రాదేమీ.. చీకటి కనిపించదేం? ఎన్నో వందలసార్లు ఆ గది తలుపులు మూసి తీసి ఉంటుంది. ఆ మంచం మీద పడుకుని ఆ గోడ గడియారం చూస్తూ నిద్రలేచేది. అక్కడ అణువణువూ తనకు చిరపరిచితం. కల కంటోందా? టైం పగలు పది కాదు.. తెల్లవారుజాము నాలుగున్నరే అయియుండాలి. కళ్ళు విప్పితే చాలు. కలలోంచి బయటకి వచ్చేయచ్చు. చెమటలు పడుతున్నాయ్. ఎలా! పోనీ ఎవరికైనా ఫోన్ చేస్తేనో..

గభాలున చేతిలో చూసుకుంటే సెల్ ఫోన్ ఉంది. పాతది!! గాడ్.. ఫోన్ లో ఎవరి నంబర్లూ లేవేం? ఎవరొస్తారు తనని నిద్రలేపడానికి..? ఆనంద్..??

కళ్ళు తెరిచింది మహతి. చుట్టూ చీకటి. హమ్మయ్య అనుకుంటూ బెడ్ లేంప్ ఆన్ చేసింది. కిటికీలోంచి మసక వెలుతురొస్తోంది. పావు తక్కువ అయిదు!! How long does a dream last?

లేచి బాత్రూమ్ లోకి వెళ్ళి  మొహం కడుక్కుంది. చెప్పలేని నీరసం. వెనక్కి వచ్చి బెడ్ సైడ్ టేబుల్ మీద ఉన్న బాటిల్ ఎత్తి గటగటా నీళ్ళన్నీ తాగేసింది. మొహం చేతులతో రుద్దుకుంటూ మంచం మీద కూర్చుంది.

ఏవిటీ కల! ఇంకెవరూ గుర్తు రాలేదేం? ఆనంద్? ఇష్టపడుతోందా? మళ్ళీ  ప్రేమా? చాలా సేపు ఆలోచిస్తూ ఉండిపోయింది.

బాత్రూం లోంచి స్నానం చేసి వస్తూండగా ముందురోజు వంశీతో సంభాషణ గుర్తొచ్చింది.

"చిరుతపులులు కాదబ్బాయ్.. ప్రేమ అంతరించిపోతోంది. చరిత్రలో చెప్పుకుంటున్న ప్రేమకీ, ఈ రోజుల్లో మనుషులకీ తేడా ఎలా వచ్చింది? Is that an evolution? తెల్లారి లేచి ఫేస్ బుక్ చూడు. అమ్మాయిల మీద అబ్బాయిల జోకులు. ఆడవాళ్ళే మో మేల్ చావనిజం మీద లెక్చర్లూ. జ్ఞానం ఎక్కువైపోయి.. బాగా పికీ అయిపోతున్నామనిపిస్తోంది." చెప్తున్న మహతి వైపు చూస్తూ ఉండిపోయాడు వంశీ.

"ఒక్క మాట చెప్పనా మహతీ. చెప్పినదే చెప్తున్నాననుకోకు. సిస్టమ్ లో తప్పు లేదు. ఎప్పటికీ లేదు. లోపాలేమున్నా మనలోనే ఉంటాయ్. ఎవరి ఫ్రస్టేషన్స్ వాళ్ళు  సోషల్ నెట్వర్కింగ్ సైట్ లలోనో, ఊసుపోని కబుర్లలోనో బయటపెట్టుకుంటున్నాం. ప్రతీ మనిషికీ తోడు కావాలి. Nature's law అది. నమ్ము.. మనుషుల్నీ, ప్రేమనీ నమ్ము. అలా అని నిన్ను నువ్వు వదిలేసుకోకు." బుజ్జగించాడు తన చిన్ననాటి నేస్తాన్ని.

కాఫీ సిప్ చేస్తూ వాచ్ చూసుకుంది. ఆలోచనలు ఓ పద్ధతిగా నడుస్తున్నాయిప్పుడు.

***

"నాకేం పరవాలేదు మహతీ.. సొసైటీలో వేలెత్తి చూపేది ఆడపిల్లనే!" కన్నార్పకుండా మహతి మొహంలోకే చూస్తూ చెప్పాడు ఆనంద్. మహతి మాటలు విన్నాక ఆశ్చర్యం నుండి తేరుకోడానికి ఒకే ఒక్క క్షణం పట్టిందతనికి.

"చింతకాయపచ్చడి కబుర్లొద్దు డాక్టర్. " నవ్వింది మహతి.

"పోనీ నాకే రిలేషన్ లో సెక్యూరిటీ కావాలనిపిస్తేనో! నా పేరెంట్స్ కి చెప్పుకోవాలి కదా నేను కూడా.." చురుగ్గా అడిగాడు.

"అది నీ హెడేక్. ఆలోచించుకో." మహతి మాట మామూలుగా ఉంది.

విశాలమైన యూనివర్సిటీ ప్రాంగణంలో ఓ చెట్టుకింద నిలబడ్డారు ఇద్దరూ. దూరంగా పార్కింగ్ లాట్ దగ్గర కనస్ట్రక్షన్ వర్కర్స్ చేస్తున్న శబ్దాలు లీలగా వినిపిస్తున్నాయి. మిట్టమధ్యాహ్నపు ఉక్కపోతకి మహతి చెంపల మీదుగా చెమటలు కారుతున్నాయి. ఉండుండీ వీస్తున్న గాలి సరిపోవడం లేదు.

ఆనంద్ ఒక అడుగు ముందుకు వేసాడు. మహతి సన్నటి వేళ్ళని చేతుల్లోకి తీసుకున్నాడు. గుండ్రంగా ఉన్న ఆమె తేనెరంగు కళ్ళలోకి సూటిగా చూస్తూ అడిగాడు.

"నీ ప్రపోజల్ వెనుక కారణమేంటో తెలుసుకోవాలని ఉంది మహతీ. పెళ్ళి వద్దని ఏ ఇండియన్ గాళ్ అనదు, నాకు తెలిసి.."

"నాకు పెళ్ళంటే ఎలాంటి ఫీలింగ్ లేదు ఆనంద్. అటు మంచీ లేదు. ఇటు చెడూ లేదు. పెళ్ళెందుకూ అంటే అదో వేడుక.. అదో చట్టం.. అదో కట్టుబాటు. పెళ్ళెందుకొద్దంటే... నాకు అలాంటి సెలెబ్రేషన్ ఏమీ వద్దు కనుక. లా తోనూ, కట్టుబాట్లతోనూ.. నిన్ను నేను, నన్ను నువ్వు కట్టేసుకోవడం అనవసరమనిపిస్తోంది కనుక." అతని చేతుల్లోంచి తన చేతుల్ని సున్నితంగా విడిపించుకుంది.

"పిల్లలు పుడితే..?"

"పుట్టనీ.."

"వాళ్ళకి సెక్యూరిటీ ఏది?"

"ఆనంద్.. నీ పిల్లలనే ఫీలింగ్ నీకు ఉంటే వాళ్ళని నువ్వే చూస్తావు. లేదనుకో, నువ్వు మారిపోయావనుకో వాళ్ళకి నువ్వక్కర్లేదు. Lawfully నీనుండీ సాధించుకునే ఆస్తిపాస్తుల కోసమే అయితే, అవి నేనూ సంపాదించి పెట్టగలను కదా! Grow up!! " తేల్చిపారేసింది.

"కొన్నాళ్ళకి నీకు పెళ్ళి కావాలనిపిస్తే నిర్మొహమాటంగా చెప్పాలి మరి..." క్షణకాలపు ఆలోచన తరువాత సన్నగా నవ్వుతూ చెప్పాడు.

"Then I'll propose you on my knee. సరేనా?"నవ్వింది.

"ఇల్లు చూసుకుందాం అయితే.."

"Sure! Let's move in together." ఆనంద్ చేతిని నెమ్మదిగా నొక్కి వదిలింది.

***

"నిన్న సాయంత్రం సూపర్ బజార్ లో మీ మిసెస్ కనిపించారండీ. పలకరించాను." కల్పన.. వంశీ కేబిన్ లోకి వస్తూ చెప్పింది.

"ఓ.. " సిస్టమ్ లోంచి తలెత్తలేదు వంశీ.

"ఏమైనా ప్రాబ్లం ఉందాండీ మీ మధ్య. అంటే.. డిఫరెన్సెస్.."

చటుక్కున తలెత్తి చూద్దామనుకున్నవాడే సంబాళించుకున్నాడు. నెమ్మదిగా ఆమెతో చూపు కలిపాడు.

"ఏం లేదు వంశీ. తనేదో చాలా డిస్టర్బ్ డ్ గా ఉన్నారు. I can understand. కానీ.. ఇంకెవరినైనా ఇలా.. అనుమానిస్తే కష్టం కదా! అదీ నా పక్కన ఎవరూ లేరు కనుక సరిపోయింది. లేదంటే నాకూ ఇబ్బందిగా ఉండేది! మీతో చెప్పడం మంచిది కదా అని.."

మొహంలోకి పొంగివస్తున్న నెత్తురు ఆవిర్లు చిమ్మడం స్పష్టంగా తెలుస్తోందతనికి.

"Sorry for the inconvenience, కల్పనా.." వంశీ గొంతు పెగలనంటోంది.

పెదవి నలుగుతోంది. ఆవేశం పల్చబడి ఆలోచనగా మారేదాకా కళ్ళు మూసుకుని ఉండిపోయాడు. ఏం చెయ్యాలిప్పుడు? గొడవపెట్టుకోవాలా? లొంగిపోవాలా?

"ఆ పిల్లకి అపార్థాలెక్కువరా.. నీకు నేనేదో మప్పుతున్నాననుకుంటోంది. నేను ఇలా చెప్పానని అనకు మళ్ళీ . సర్దుకుపోవాలి నాన్నా! మీరిద్దరూ సవ్యంగా ఉంటే చాలు. మాతో రాకాపోకా లేకపోయినా.." అని ఉదయాన్నే బాధగా చెప్పిన అమ్మ మాటలు ఇంకా చెవుల్లో వినిపిస్తూనే ఉంది. ఇంతలోనే ఈ హ్యుమిలియేషన్!!

***

హాల్లో టీవీ మోగుతోంది. సీమ సోఫాలో ముడుచుకుని కూర్చుని చానెల్స్ మారుస్తోంది. షూ విప్పి, లేప్టాప్ వర్క్ స్టేషన్ దగ్గర పెట్టి వెళ్ళామని అటుగా వచ్చిన వంశీ వైపు చూసిందోసారి.

"లేటయిందేం వంశీ.."

నిశబ్దంగా మేడమీదకి నడిచాడు. బట్టలు మార్చుకుని మొహం కడుక్కుని కిందకి వచ్చేసరికి డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చుని ఉంది.

"మరో చపాతీ వెయ్యనా?"

చెయ్యడ్డుపెట్టాడు.

చెయ్యి కడుక్కుని, పుస్తకాల అలమర వైపు నడుస్తున్న వంశీకి వెనుక నుండి చూపులు గుచ్చుకున్నాయి.

"ఏం చేస్తే నీకు నచ్చుతాను? పుస్తకాలు చదవాలా? ఆకాశంలో చుక్కలు లెక్కపెట్టాలా? పోనీ.. పాటలు పాడాలా?" ఏడుపుని ఉక్రోషం చాటున అదిమిపెట్టింది.

"నీకేం కావాలో అది చెయ్యి చాలు.." అని చెప్దామనుకునేలోగా మరో తూటా సర్రున దూసుకొచ్చింది.

"ఆ బజారువేషాలేసేవాళ్ళ పాటి చెయ్యలేదా నేను! ఏం తక్కువైంది నాలో.."

మనసు తలుపు మూసుకుపోయింది... పూర్తిగా..

## 13

మహతి చెప్పిన న్యూస్ అర్థం కావడానికి వంశీకి కాసేపు పట్టింది. విషయం చెప్పి చాలా మామూలుగా రేపు సాయంత్రం పాండీ కేఫ్ లో కలుద్దామని చెప్పిందంతే. 'గౌతమి కూడా వస్తుందా?' అని అడగబోయి తమాయించుకున్నాడు. వస్తుందని తెలుసు.

"లివిన్ అంటే షాక్ అయ్యాను." పాండీ కేఫ్ బయట నిలబడ్డ వంశీతో వస్తూనే చెప్పింది గౌతమి.

సన్నగా నవ్వి చెప్పాడు. "లోపలికెళ్ళి మాట్లాడుకుందాం పద"

నలుగురికి కేటాయించిన ఓ బూత్ లో కూర్చున్నారు. వెయిటర్ రాగానే వాటర్ బాటిల్ తెమ్మని, ఆర్డర్ కి కాస్త టైం పడుతుందని చెప్పేసింది గౌతమి.

"నీకెప్పుడు తెలిసింది?" కుతూహలంగా అడిగింది.

గౌతమిలో ఇంత ఆసక్తి చూసి కాస్త ఆశ్చర్యమనిపించింది వంశీకి.

"'నిన్న రాత్రి. ఇదీ విషయం. రేపు సాయంత్రం పాండీకి రా..' అని చెప్పి పెట్టేసింది."

"నాకు నిన్న మధ్యాహ్నం! 'ఇల్లు వెతుక్కుంటున్నాను గౌతమీ.. ఆనంద్ తో మూవిన్ అవడానికి. నీకు రూమ్మేట్ ఎవరైనా దొరుకుతారేమో చూడనా?' అని ఎంత సింపుల్ గా చెప్పేసిందో!!" కళ్ళింతలు చేసుకు చెప్తోంది గౌతమి.

"గుడ్ ఫర్ హర్! నెమ్మదిగా మనుషుల్లో పడినట్టే! ఏ పురుషద్వేష సమాజమో స్థాపించేస్తుందనుకున్నాను."

వస్తున్న మహతిని వేలితో చూపించాడు గౌతమికి. ఇద్దరికీ దూరం నుండే హాయ్ చెప్తూ వచ్చి కూర్చుంది.

"ఎలా ఉన్నారు మేడమ్? ఒక్కర్తివే వచ్చావేం?" నవ్వుతూ అడిగాడు.

"ఓ.. సూపర్! ఒక్కర్తినే కాక!?"

"అతన్ని పరిచయం చెయ్యడానికే ఈ మీటింగేమో అనుకున్నా.."

"ముందు విషయం కాస్త సింక్ ఇన్ అవనీ! చేద్దాం చేద్దాం." నవ్వింది మహతి.

"సో.. ?"

"సో.. అదీ విషయం. ఇల్లు వెతుక్కోగానే మూవిన్ అవుతాం."

"కంగ్రాట్స్ డియర్! వెరీ హేపీ ఫర్ యూ!!" మహతి భుజం మీద చేయి వేసి చెప్పింది గౌతమి.

"మీ టూ.." చెప్పాడు వంశీ.

"ఇక గౌతమి ఒక్కర్తే ఉండాలి. రూమ్మేట్ దొరికే దాకా.." వంశీ వైపు చూస్తూ చెప్పింది మహతి.

"ఎందుకూ తను మాత్రం ఒంటరిగా ఎన్నాళ్ళు ? ఏం మేడమ్ నెక్స్ట్ మీరూ చెప్తారా గుడ్ న్యూస్?" వంశీ గౌతమి ముఖ కవళికలని జాగ్రత్తగా గమనిస్తున్నాడు.

క్షణకాలం చాలా అసహనంగా మారిందామె మొహం. ఇంతలోనే నిభాయించుకుని.. మౌనంగా ఉండిపోయింది.

"చెప్పు.. ఆనంద్ ఏమంటున్నాడు? అసలెలా ప్రపోజ్ చేసావు?" టాపిక్ మార్చాడు.

"వాట్! నేను ప్రపోజ్ చెయ్యడమేంటీ? ఎలా కనిపిస్తున్నానూ..." గలగలా కబుర్లు మొదలుపెట్టేసింది మహతి.

వింటున్నా, గౌతమి ముఖంలో మెరిసి మాయమైన ఇబ్బంది ఏమిటనే ఆలోచన వంశీ బుర్రలో తిరుగుతూనే ఉంది.

***

"సో.. వాట్స్ న్యూ? నీ కబుర్లేం చెప్పనే లేదు. నేనే వాగాను." అంది మహతి.

మహతి ఇంటి గేట్ దగ్గర నిలబడ్డారిద్దరూ.. గౌతమి పనుందని లోపలికెళ్ళి పోయింది.

"ఏముంటాయ్? రొటీన్.. విసుగ్గా చిరాగ్గా గడిచిపోతోంది జీవితం."

"ఊ.. సీమ..." ఏదో అడగబోయింది.

"మహతీ. కొత్తగా ఏం ఉండవు. అదే అలా సాగుతుంది. నేను లొంగను. తను తగ్గదు." అభావంగా ఉంది వంశీ గొంతు.

"పోనీ పిల్లలు పుడితే మారుతుందేమో.. ఆలోచించావా?"

మహతి మాట పూర్తవక ముందే "నువ్వు కూడానా!" బాధగా అన్నాడు.

"ఏం వంశీ...?"

" ఈ ప్రపంచానికి బెటర్ ఆఫ్ స్ప్రింగ్ ని ఇవ్వాలని ప్రతి ప్రాణీ తపన పడుతుంది. ఈ మాటన్నది నువ్వే కదా మహతీ. ఏమో.. నాకు మా

ఇద్దరి కాంబినేషన్ మీద, పెంపకం మీదా కూడా నమ్మకం లేదు."

"అలా కాదులే.." సర్దిచెప్పబోయింది.

"ఏది కాదు! రజనీ ఆంటీ సెలక్షన్ ని మెచ్చుకున్నావు. ముందుతరాలకి రోగాలని ఇవ్వడం ఎంత తప్పో నీకు తెలుసు. మరి మానసిక జాడ్యాల గురించి మర్చిపోతారేం. జీవితాన్ని నెగిటివిటీతో నింపుకున్న ఆమె. ఆమెకి నచ్చని నేను. మా ఇద్దరికీ పిల్లలా! అసలేమీ పొసగని ఇద్దరు ఎలా మంచి పిల్లలని కనగలరు! మీ సైన్సేమీ చెప్పదా?"

"వద్దులే ఈ టాపిక్. ఇంకేమైనా మాట్లాడు." మహతి నొచ్చుకుంది.

"నేను సీమ విషయంలో పూర్తిగా విసిగిపోయాను మహతీ. అలా అని నా జీవితాన్ని నిస్సారంగా గడపలేను."

"మరేం చేస్తావ్? గౌతమికి ప్రపోజ్ చేస్తావా?!"

మహతి కళ్ళలోకి సూటిగా ఒక్క సారి చూసి, గిర్రున వెనక్కి తిరిగి కార్ వైపు నడుచుకెళ్ళిపోయాడు. కార్ వెళ్ళేదాకా చూస్తూ ఉండిపోయింది.

***

"ఏం తెలుసు స్టార్స్ గురించి..?" అల్లరిగా నవ్వుతూ అడిగింది మహతి.

"వీనస్ గురించి మాత్రం తెలుసు." చెప్పాడు ఆనంద్.

"హయ్యో రామా! వీనస్ స్టార్ కాదు! ప్లానెట్.."

"ఊప్స్.. కదా! పోనీ ఇవాళ రాత్రి స్టార్స్ చూద్దామా? నువ్వే చెప్పొచ్చు.. ఏది స్టారో ఏది ప్లానెటో.."

"అక్కర్లేదు. మనింటికెళ్ళిపోయాక రోజూ చూద్దాం. అప్పుడు నువ్వే అంటావు. అనవసరంగా అడిగాన్రా బాబూ అని.."

"ఏమో! తినబోతూ రుచులెందుకు?" ఆనంద్ పెదాల మీద నవ్వు చెదరలేదు.

"హేయ్.. నీకు భయంగా లేదా?" ఉన్నట్టుండి అడిగింది.

"నీకు ఉందా?"

"భయం కాదు కానీ.. కొద్దిగా టెన్షన్. అంత దగ్గరగా గడపడం మొదలుపెడితే నీకు నచ్చనేమో అని."

మహతి చేతిని పెదాలకానించుకుని చెప్పాడు.

"అలా అనిపించిందంటే చాలు మహతీ.. మిగిలినది నేను చూసుకుంటాను."

"అర్థం కాలేదు.." రెప్పవేయకుండా చూస్తోంది.

"యూ ఆర్ ఇన్ లవ్. దాన్ని పెంచి పోషించడం నా బాధ్యత."

"ఓహో.. మరి నా బాధ్యతలేమిటో!" నవ్వుతూ అడిగింది.

"బెండకాయ కూర వండకపోవడం."

"హ్హుహ్హూ.... ఆనంద్..." అతని చేతిలోంచి చెయ్యి లాగేసుకుని భుజం మీద కొట్టింది.

"స్టార్స్ ఆకాశంలోనే కాదు. ఇండోర్ కూడా కనిపిస్తాయని నమ్మడం."

"ప్లానెటోరియంలోనా?"

నవ్వాపుకుంటూ తలకొట్టుకుంటున్న ఆనంద్ ని అయోమయంగా చూసింది మహతి.

***

"ఎలా ఉంది లైఫ్?" ఆసక్తిగా అడిగింది గౌతమి.

"ఏదీ ఇంకా వారమే కదా అయిందీ.."

"వారంలో ఎలా ఉందో చెప్పు పోనీ.."

"చెప్తే ఏడిపిస్తావు."

"చెప్పకపోయినా తప్పదు కానీ.. ఊ.. "నవ్వింది గౌతమి.

"బావుంది గౌతమీ.. లైఫ్ లో ఇంత లోటుండేదా అని ఆశ్చర్యపోతున్నాను. అంత బావుంది."

క్షణమాగి ఆకాశంలోకి పరిశీలనగా చూసింది. చుక్కలు మిణుకుమిణుకుమంటున్నాయి. చిన్ననాటి స్నేహితులని గ్రూప్ ఫోటోలో చూసినట్టనిపించింది మహతికి. పెద్దగా మిస్ అవడం లేదు. అలా అని మరచిపోనూలేదు.

"మొన్నోరోజు తెల్లవారు ఝామున వేగుచుక్క చూపించాను."

"ఆహా! పాపం నిద్రపాడుచేసి మరీనా.."

"ఆ.. లేకపోతే వీనస్ స్టారో ప్లానెటో కూడా తెలీదు."

"పోన్లెద్దూ.. ఇంతకీ స్టారా, ప్లానెట్టా?" నాలిక కరుచుకుంటూ అడిగింది గౌతమి.

గౌతమి చెవి మెలేసి నవ్వింది మహతి.

"వీనస్ అంటే శుక్రుడు పిల్లా.. వేగుచుక్క. అవడానికి ప్లానెట్. లవ్ కి, రొమాన్స్ కీ అధిదేవత."

"ఊ ఊ"

"చిత్రమేంటో తెలుసా గౌతమీ.. ఇన్ని తేడాలుంటాయా మనుషుల్లో.. ఈ జాతీ, ఆ ప్రాంతం బ్లా బ్లా.. చుక్కలు ఆ హద్దులన్నీ చెరిపేస్తాయి. ప్రేమ, మనిషీ ప్రపంచంలో ఏ మూలైనా ఒకటే అనిపిస్తుంది. ఈ వీనస్ ని చూడు. రోమన్ గాడెస్ ఆఫ్ లవ్. క్యుపిడ్ కి తల్లి అని చెప్తారు. ఇదే ఇండియన్ కాంటెక్స్ట్ లో శుక్రుడు ఆస్ట్రాలజీలో ఏడో ఇంటికి అధిపతి. ఇతని దృష్టి సరిగా ఉంటేనే పెళ్ళి సరిగా ఉంటుందంటారు."

"ఓహ్.. చిత్రం కదూ!"

"లవ్ లైఫ్ కి వీనస్ కి బోలెడు కనెక్షన్ ఉందన్నమాట. అందుకే చూపించాను ఆనంద్ కి.. " నవ్వింది.

నవ్వుతూ మౌనంగా ఉండిపోయింది గౌతమి.

"తోడు కావాలి గౌతమీ.. ఎంత జీవితం చెప్పు! ఇట్టే గడిచిపోతుంది. చలిగా, ఒంటరిగా ఇదే డాబా మీద ఎన్ని రాత్రులు గడిచాయో బాగా గుర్తు. ఆ కొత్త బాల్కనీలో నిలబడి ఆనంద్ తో కలిసి వీనస్ ని చూస్తుంటే చాలాసేపు వింతగా అనిపించింది."

"తేడా ఉంది కదూ!" అడిగింది గౌతమి.

"చాలా...." ఆకాశంలోకి చూస్తూ చెప్పింది మహతి.

***

"నవ్వు నటించకు వంశీ." కోపంగా చెప్పింది మహతి.

"ఎందుకలా అనిపిస్తోంది నీకు?" అదే నవ్వుమొహంతో అడిగాడు.

"వర్క్ హాలిక్ వి అయిపోతున్నావ్"

"సత్కవుల్ హాలికులైననేమి.. అన్నారు. కవిగారినైపోతానైతే.."

"యే హార్టెటాకో వస్తుంది. పిచ్చివాగుడు వాగకు."

"ఏమయింది మహీ..." అడిగాడు నవ్వాపుతూ.

"ఎవరి నుంచి దాక్కుంటున్నావు. ఓ కాల్ లేదు. ఏం లేదు.. " అరిచింది.

"నువ్వూ బిజీగా ఉన్నావు కదా!"

"అదేం కాదు. నేను నిలదీశాననే కదా మాట్లాడడం మానేశావు. ఇంకేమీ అడగన్లే.." నొచ్చుకుంటూ నిష్టూరమాడింది.

"అబ్బా... కాదు మహతీ. ఇదిగో చూడు.. సీమ విషయంలో నేను మార్చగలిగేది ఏదీ లేదు. అది నువ్వు అర్థం చేసుకోగలిగితే చాలు. ఈ విషయమంతా తెలిసిన ఒకేఒక మనిషివి నువ్వు. నీకు అప్డేట్ చెయ్యడం నా బాధ్యత కదా!"

"అవును వంశీ.. అర్థమైంది. ఇక ఇంతేనా? ఇలా గడిచిపోవలసిందేనా?"

"తెలీదు మహీ.. నిజంగా తెలీదు." వంశీ మొహం తేటగా ఉంది.

ఒక్క క్షణం మౌనంగా ఉండిపోయింది. తననే చూస్తున్న వంశీ వైపు సూటిగా చూస్తూ అడిగింది.

"మరి గౌతమి?"

"ఉహూ.. అదీ తెలీదు."

"తెలుసుకోవాలనిపించట్లేదా? తన మనసు.. నీ ఇష్టం.. ఇవేవీ తెలుసుకోవా?"

"తెలుసుకుని?" వంశీ ప్రశ్నలో బాధ వినిపించింది మహతికి..

"మహతీ.. ఇన్ని మిరాకిల్స్ జరుగుతున్నాయ్ ప్రపంచంలో.. టైం మెషీన్ ఒక్కటి కనుక్కోకూడదూ మీ సైంటిస్ట్ లు? చేసిన తప్పులనీ, జరిగిన పొరపాట్లనీ చెరిపేయాలని గింజుకునే నరకం తప్పుతుంది." వంశీ మాటలు కలలో తేలుతున్నట్టు వస్తున్నాయి.

ఇక ఆగలేకపోయింది మహతి.. చెప్పేసింది.

"గౌతమి వెళ్ళిపోతోంది వంశీ..."

14

*"... rog ho jaaye.. usko bhool naa behtar.."* కూనిరాగం తీస్తున్నాడు ఆనంద్.

కిచెన్ ప్లాట్ ఫాం ని ఆనుకుని నిలబడి పొంగబోతున్న పాలని దీక్షగా చూస్తున్నాడు వంశీ.

"లాస్ట్ సమ్ వేర్?" ఆనంద్ చిరునవ్వుతో వంశీని కదిలించాడు.

"**ప్చ్...** డాక్టర్లే రోగాల్ని మర్చిపోమంటే ఎలాగా అని." వంశీ సన్నగా నవ్వాడు.

"హహ్హో.. ! పాటల్ని కూడా ఫిల్టర్ చేసుకోవాలయితే!"

ఆనంద్ కాగిన పాలని కప్పుల్లోకి వంపి పంచదార డబ్బా అందుకోబోతూండగా "వంశీకి పాలు. కాఫీ మనిద్దరికే.." అంటూ మహతి కిచెన్ లోకి వచ్చింది.

"హాయ్.. నువ్వు నాకు థాంక్స్ చెప్పాలి. మీ ఫ్రెండ్ రోడ్ మీద నిలబడి నిన్ను తిట్టకుండా కాపాడినందుకు. అయినా గెస్ట్ ని రమ్మని నువ్వు ఇంట్లో లేకపోతే ఎలా! నేను వచ్చేసరికి గుమ్మంలో నిలబడి ఉన్నారు పాపం."

వంశీ గలగలా మాట్లాడుతున్న ఆనంద్ ని పరీక్షగా చూశాడోసారి.

"Sorry guys!! సగం దూరం వచ్చేసాక మా ప్రొఫెసర్ కాల్. వెనక్కి వెళ్ళాల్సి వచ్చింది. ట్రాఫిక్.. అయినా నువ్వు ఆన్ ది డాట్ వచ్చేస్తావని నాకేం తెలుసూ! వచ్చేస్తానులే అనుకున్నాను." వంశీ వైపు చూస్తూ చెప్పింది. వంశీ నవ్వి ఊరుకున్నాడు.

"మొహం కడుక్కునిరా.. టైర్డ్?" ఆనంద్ చాలా మామూలుగా మహతి నుదుటి మీదకి పడుతున్న ముంగురులు సర్దాడు. వంశీ ఇబ్బంది దాచుకోడానికి ప్రయత్నిస్తూ హాల్లోకి కదిలాడు.

***

"ఏం ఆలోచించావు? తనతో మాట్లాడుతావా అయితే? ఇక్కడికి రమ్మననా?" సోఫాలో వంశీ పక్కనే కూర్చుంటూ అడిగింది మహతి.

"ఏం మాట్లాడను మహతీ..?" వంశీ కళ్ళలోని ప్రశ్నలో నిజాయితీ.

"చెప్పు.. నీకేమనిపిస్తోందో చెప్పు. తనేమనుకుంటోందో అడుగు. ఆపై ఏం చెయ్యాలో నిర్ణయించుకోవచ్చు. నీ ఫీలింగ్స్ నిజమైనవయినప్పుడు.. తనకి తెలియకుండా దాచడం ఎందుకు?"

"ఉహు.. అన్నీ చెప్పాక 'అయితే ఇప్పుడేం చేద్దామనుకుంటున్నావ్?' అని తను అడిగితే నా దగ్గర సమాధానం లేదు మహతీ. అది న్యాయం కాదు. అయాం నాట్ సింగిల్. పీరియడ్."

"అబ్బా.. కట్ ద క్రాప్! వెళ్ళిపోతోంది వంశీ. ఊరు వదిలి వెళ్ళిపోతోంది. ఫోన్లూ, మైల్స్ లో జరిగేవి కావు కొన్ని కొన్ని. ఇది రైట్ టైం. ఇప్పుడే ఎందుకూ అని అడక్కు. ఇంట్యూషన్."

"మహీ.. " వంశీ ఏదో చెప్పబోతూ ఆనంద్ వచ్చేసరికి ఆపేసాడు.

"డి న్నర్ బయటేనా?" బయటికి వెళ్ళేందుకు రెడీ అయి హాల్లోకి వచ్చిన ఆనంద్ ని అడిగింది.

"యెస్. మీటింగ్ ఉంది. టెన్ అవుతుంది. చేంజ్ చేసుకుందామనే వచ్చా ఇంటికి." అంటూ వంశీని చూసి "నైస్ మీటింగ్ యూ వంశీ! " అని చెయ్యి జాపాడు.

"లైక్ వైజ్.." లేచి షేక్ హేండ్ ఇచ్చాడు వంశీ.

సోఫాలో కూర్చున్న మహతి దగ్గరగా వంగి, బుగ్గమీద ముద్దు పెట్టుకుని, చెయ్యి నొక్కి బై చెప్పి బయటికి నడిచాడు ఆనంద్. గాలిలో పర్ఫ్యూమ్ అలుముకుంది. కళ్ళకి జరజరా పాకిన ఒకరకమైన భావాన్ని అణుచుకోవాలని విశ్వప్రయత్నం చేస్తున్నాడు వంశీ. కట్ అయిన టాపిక్ ని మళ్ళీ ఎత్తుకుంది మహతి.

"గౌతమిని ఇక్కడికి రమ్మని పిలుస్తాను. 'వీకెండ్ వెళ్ళిపోతున్నావు కదా.. డిన్నర్ కి రమ్మని'. ఆనంద్ కూడా లేడు కదా. ఏం?" ప్లాన్ వేసేస్తోంది.

"ఓయ్.. చెప్తూంటే నీక్కాదా మహీ? ఏమిటిది చిన్నపిల్లలా? అయినా తనకేం ఖర్మ. ఇదేమైనా రాజుల కాలమనుకున్నావా జనాలు రాజుగారికి ఇద్దరు రాణులు అని చెప్పుకోడానికి? రాళ్ళిచ్చుక్కొడతారు." చిరాకు దాచుకోలేదతడు.

"అయినా తనేమనుకుంటోందో తెలిస్తే..." పంతంగా అదే మాట వల్లిస్తోంది.

"షటప్ మహతీ. ఇంకాపు. అందరి లైఫ్ నీలా ఉండదు. ఇట్స్ కాంప్లికేటెడ్.." గభాలున అనేసి, తత్తరపాటుగా తన మొహంలోకి చూశాడు. మహతి మామూలుగా ఉంది. కళ్ళలో అదే అమాయకత్వం, పంతం.

"క్రైమ్ అది. అయినా తనకీ లైఫ్ ఉంది." మళ్ళీ తనే అన్నాడు.

"లేదు వంశీ." స్థిరంగా చెప్పింది మహతి.

అర్థం కానట్టు చూశాడు.

"తనకి లైఫ్ లేదు. ఒంటరిగా ఉండిపోదామని నిర్ణయించేసుకుందెప్పుడో. కానీ తనకి తెలియకుండానే నీకు అట్రాక్ట్ అయిందేమో అనిపిస్తోంది. ఇప్పుడు నువ్వు ఒక్క అడుగు ముందుకు వేస్తే మీ ఇద్దరి లైఫ్ మరోలా ఉండే అవకాశం ఉంది. అట్ లీస్ట్ గివిట్ ఎ ట్రై!"

"వాట్? పెళ్ళి చేసుకోదా? ఏం?"

"గౌతమి పెళ్ళి పీటల దాకా వచ్చి ఆగిపోయింది. ఇక ఆ చాప్టర్ తన లైఫ్ లో లేదని డిసైడైపోయింది తను."

"పిచ్చేంటి? ఏమయిందసలు?" అయోమయంగా అడిగాడు.

"ఇవేవీ ఎవరితోనూ చెప్పకూడని విషయాలు. తన పర్సనల్. కానీ.. చెప్తేనే బెటరేమో అనిపిస్తోంది. ఏం లేదు వంశీ.. నీకూ, సీమకీ ఓ కూతురుంటే.. తన లైఫ్ ఎలా ఉంటుంది? గౌతమిదీ అచ్చం అలాంటి పరిస్థితే. తన పెళ్ళి కుదిరాక ఏదో చిన్న గొడవయిందట.. వాళ్ళమ్మ గారు దాన్ని చాలా పెద్దది చేసేశారు. 'తల్లే ఇలా ఉంటే కూతురెలా ఉంటుంది?' అని పెళ్ళి కేన్సిల్ చేసేసుకున్నారు వాళ్ళు. గౌతమి చాలా హర్ట్ అయింది."

"అందుకని ప్రపంచంలో ఇంకెవరూ దొరకరా? ప్రతీవాడూ ఇదే మాట అంటాడా? హౌ సిల్లీ.."

"అనకపోవచ్చు. ఒక్కసారి ఆలోచించు. మూడేళ్ళకే ఇంత విసిగిపోయావే.. ఇరవై రెండేళ్ళు భరించింది తను. అఫ్కోర్స్.. కూతురిగానే. కానీ.. ఎవరి కోటా కష్టాలూ, చిరాకులూ వాళ్ళకి ఉంటాయి కదా! రిస్క్ తీసుకునో, తనంతట తను వెతుక్కునో పెళ్ళి చేసుకుందే అనుకో.. ఏమవుతుందో ఎవరికి తెలుసు? అదీ తన పాయింట్. ఒక ఫెయిల్డ్ మేరేజ్ కి ఫలితం తను. చిన్నతనం మామూలుగా గడిచి ఉండదు. మనకీ తెలుసుగా.. బాగా చిన్నప్పుడు వాళ్ళ పెదబాబాయ్ దగ్గరే ఉంది. నీకు గుర్తుందా? ఎప్పుడూ వాళ్ల ఇంటికి ఎవరినీ పిలిచేది కాదు. ఇంట్లో ఎన్ని చూస్తూ పెరిగిందంటావ్! 'వెధవపెళ్ళి.. లేకపోతే చచ్చిపోతామా?' అని కోట్లమంది అనుకుంటారు. అలాగే తనూ విసిగిపోయింది. ఇకచాలు అనేసుకుంది. వంశీ.. నువ్వన్నావు చూడు.. పెళ్ళి లాటరీ అని. నువ్వు ఆడి గెలుచుకోలేకపోయావు. నేను లాటరీ టికెట్ కొనలేదు అని నన్ను నేను మభ్యపెట్టుకుంటున్నాను. తను.. కొనడానికే భయపడుతోంది. As simple as that."

చాలాసేపు ఆలోచిస్తూ ఉండిపోయాడు. చటుక్కున ఏదో స్ఫురించి మహతి వైపు చూశాడు.

"యెస్.. నీ గురించి తనకి తెలుసు. ఇట్స్ ఎంబరాసింగ్! నేను చెప్పలేదు." గబగబా చెప్పేసింది.

"ఎలా??" వంశీ మొహంలో బోలెడు ప్రశ్నార్థకాలు.

"ఇట్స్ టూ మచ్ ఫర్ యూ! కానీ.. నీకు తెలియడమే మంచిది. ఆ మధ్య మేమిద్దరం లక్ష్మీ నగర్ లో ఓ బొటీక్ కి వెళ్ళి వస్తూంటే.. సీమ కనిపించింది."

"అబ్బా... " వంశీ కణతలు రాసుకుంటూండిపోయాడు.

మహతి లేచి కిచెన్ లోకి వెళ్ళి మంచినీళ్ళు పట్టుకొచ్చింది. వద్దన్నట్టూ తలూపి కళ్ళు మూసుకుని సోఫాలో వెనక్కివాలి అలా ఉండిపోయాడు చాలాసేపు.

***

ఇల్లు తాళం వేసుకుని బయటికి వచ్చి నడుస్తున్నారిద్దరూ.

"ఆకలేస్తోంది." చెప్పాడు.

"నాక్కూడా.. నువ్వేమో ఏదో ఆలోచిస్తున్నావని చెప్పలేదు కానీ.. దారుణమైన ఆకలి. ఇక నావల్ల కాదు. ఏదో ఒకటి తిందాం అర్జంట్ గా.." చెప్తున్న మహతి వైపు నొచ్చుకుంటూ చూసి గబగబా ఎదురుగా కనిపిస్తున్న చాట్ బండీ వైపు నడిచాడు.

"Was she too harsh?" చాట్ ప్లేట్ ఖాళీ చేస్తున్న మహతిని అడిగాడు ఇంక ఆపుకోలేక.

తలెత్తి చూసి చెప్పింది. "మర్చిపో.. డిటైల్స్ అనవసరం. నీకు చెప్పద్దని ఇద్దరం అనుకున్నాం. నేను చాలా హర్ట్ అయ్యానారోజు. గౌతమి చాలా చాలా మామూలుగా తీసుకుంది. నన్ను సముదాయించింది. తనకి నేనేమీ చెప్పక్కర్లేకుండానే చాలా అర్థమయ్యాయి. నిజానికి మేమేం మాట్లాడుకోలేదు సీమ గురించి. కాకపోతే తను చాలా ఆలోచించిందనుకుంటా.. చాలాసేపటి తరువాత 'వంశీ పిల్లలని కనకపోతే బాగుండును.' అంది."

"ఛూట్.. ఛీ జీవితం..." వంశీ మొహం జేవురించింది.

"ఈజీ.. తను మన ఫ్రెండ్. ఎంబరాస్మెంట్ లు జీవితంలో చాలా అవసరం. కొన్ని కొన్ని డైలమాలు క్లియర్ అయిపోతాయ్ వాటివల్ల. నేనే ఎగ్జాంపుల్. ఆ రోజు రవి వాళ్ళ పేరెంట్స్ కాల్ చేసి అంత అసహ్యంగా మాట్లాడి ఉండకపోతే.. నేను ఆ అబ్బాయిని వదులుకోలేక చాలా ఇబ్బంది పడేదాన్ని. ఇప్పుడు ఆనంద్ దాకా వచ్చేదాన్నే కాదు."

"రవి పేరెంట్స్ నీకు కాల్ చేసారా!! నాకెప్పుడూ చెప్పలేదేం?" ఆశ్చర్యంగా అడిగాడు.

"మై లిటిల్ సీక్రెట్!" కళ్ళు చికిలించి నవ్వింది.

"ఓ చిన్న కన్ఫెషన్" నడుస్తున్నవాడల్లా ఆగి మహతివైపు చూస్తూ చెప్పాడు.

బాటిల్ ఎత్తి మంచినీళ్ళు తాగుతూ కళ్ళతోనే ఏవిటన్నట్టూ చూసింది.

"కొంచెం.. ఉహు.. చాలా జెలస్ అనిపించింది." తప్పుచేసినట్టూ చెప్పాడు.

"ఏంటీ? ఎవరి మీదా?" అర్థం కానట్టు అడిగింది.

"మీ మీదే.. నువ్వూ ఆనంద్. మస్ట్ టెల్ యూ.. వెరీ హేపీ ఫర్ యూ బోత్!"

"హహ్హహా... అదా! నో వర్రీస్.. ఆనంద్ రాకముందు నాకూ చాలా జంటల్ని చూస్తే ఇలాగే అనిపించేది." వంశీ భుజాన్ని తన భుజంతో ఢీకొడుతూ చెప్పింది అల్లరిగా.

మహతి చేతిలోంచి వాటర్ బాటిల్ తీసుకుంటూ నిజమా అన్నట్టు చూశాడు.

"నిజమా నిజమున్నరా.. గోడ మీద పాకుతున్న చీమల జంట మీద కూడా అసూయనిపించేది. నమ్మితీరాలి నువ్వు." గట్టిగా నవ్వేస్తూ చెప్పింది.

"సో... ఆ ఇంటివైపు వెళ్తున్నాం ఇప్పుడు. జస్ట్ మాట్లాడుదాం. తను వెళ్ళిపోతోందని నిన్న చెప్పినప్పుడు నీ ఫేస్ చూడాలసలు! ఫోటో తీసి గౌతమికి చూపిస్తే తనకి ఇట్టే అర్ధమయిపోయేది విషయం." ఆటపట్టించింది.

"లేదు మహతీ. నువ్వనుకుంటున్నంత ఈజీ కాదీ సమస్య. ఒకరిగురించి ఒకరికి తెలిసినంత మాత్రాన సరిపోతుందా? ఏవో సవాలక్ష అనుకుంటాం. అన్నీ జరగవు. లీవిట్." మహతి ఇంటివైపు దారితీస్తూ చెప్పాడు.

దాదాపు ఇంటికి వచ్చేదాకా మహతి ఏమీ మాట్లాడలేదు. బయట పార్క్ చేసి ఉన్న బైక్ దగ్గర నిలబడి ఇక బయలుదేరుతానన్నట్టు చూశాడు.

"వాయేజర్ తెలుసా?" ఉన్నట్టుండి అడిగింది.

"ఉహూ.."

"సెవెంటీ సెవెన్ లో నాసా పంపించిన స్పేస్ క్రాఫ్ట్. వాయేజర్ వన్ అండ్ టూ.. వారం తేడాలో రెండు."

"విన్నానేమో.. ఊ.. పేరు విన్నట్టే ఉంది. చెప్పు." చేతులు కట్టుకుని నిలబడి వింటున్నట్టూ తలూపాడు.

"సోలార్ సిస్టమ్ ని దాటి వెళ్ళి ఎక్కడైనా లైఫ్ ఉందేమో చూడాలి. అదీ దాని మిషన్."

"ఊ.."

"అది వెళ్ళింది. చాలా దూరం.. దాదాపు ఆరువేల బిలియన్ కిలోమీటర్ల దూరం వెళ్ళాక వెనక్కి తిరిగి భూమి ఎలా ఉంటుందో ఫోటో తీయమన్నారు. తీసి పంపింది. ఆ ఫోటో పేరు "Pale Blue Dot" ఇంటికెళ్ళాక గూగుల్ చెయ్. ఓ వీడియో వస్తుంది. అది చూసి నాకు కాల్ చెయ్."

"సరే.."

"కాల్ చేస్తున్నావ్."

"యెస్.. వీడియో చూసి కాల్ చేస్తాను. దడుచుకోను కదా.. నాకసలే స్పేస్ అంటే భయం." నవ్వుతూ బైక్ స్టార్ట్ చేస్తూ అడిగాడు.

మాట్లాడకుండా రెండడుగులు వెనక్కి వేసి చెయ్యూపింది.

***

"వీడియో చూశావా?" అని ఫోన్ ఆన్సర్ చేస్తూనే అడుగుతుందనుకున్నాడు. అలా అడగలేదు మహతి.

"చెప్పు వంశీ." మహతి మాటల్లో ఎప్పుడూ లేని గాంభీర్యం.

"ఊ.. ఇంట్రస్టింగ్! మాటల్లో చెప్పలేని ఫీలింగ్. మన ఇంత చిన్నవాళ్ళమా యూనివర్స్ లో..." ఏదో చెప్పబోయాడు.

"వంశీ.. కార్ల్ సాగన్ మాటలు రోజుల తరబడి నన్ను హాంట్ చేసాయి. ఆరువేల బిలియన్ కిలోమీటర్ల దూరం నుండి ఫోటో తీస్తే.. ఓ చిన్న స్పెక్ లా కనిపించింది మనముంటున్న ఇంత పెద్ద భూమీ. అలా ఫోటో తీయాలనిపించడం ఓ గొప్ప విషయమైతే.. దాని గురించి అతను చెప్పిన మాటలు ఉన్నాయ్ చూడు.. అవీ నాకు అద్భుతమనిపించినవి. *That Dot.That's home. That's us. On it everyone you love, everyone you know, everyone you ever heard of, every human being who ever was, lived out their lives.* ఆ ఫోటోలో కనిపిస్తున్న బుజ్జి నీలం చుక్క మన ఎర్త్. చిన్న అణువులో ఇంకా అతిచిన్న పార్టికల్స్ మనం. మన లైఫ్ అంతా ఆ చిన్న నీలం చుక్కలో ఉంది. అంతే. మన తెలివితేటలు చాలా గొప్పవి. సోలార్ సిస్టమ్ అవతల ఏముందా అని వెతికేంత గొప్పవి. ఏవేవో సాధించేస్తున్నాం. మంచిదే.. కానీ ఆఫ్టరాల్ మన జీవితం ఎంత వంశీ? అరవై ఏళ్ళు.. అది కూడా రోగాల్లేకుండా బతికితే. అప్పుడే సగం దాటేసాం. రాజీ పడుతూ, ముసుగులేసుకుంటూ.. ఇలా బతకాలా? ఇలా బతికేసి చచ్చిపోవాలా? ఇంతేనా లైఫ్? ప్రేమ లేకుండా.. ఈ శరీరాన్నీ, మనసునీ హింసించుకుంటూ బతకమనా ఇంత గొప్ప జన్మ ఎత్తింది? *In our obscurity – in all this vastness – there is no hint that help will come from elsewhere to save us from ourselves.*"

"నిజమే.. కానీ.."

వంశీ గొంతులో సందిగ్ధానికి ఒకే ఒక్క మాటతో చెక్ చెప్పేసింది మహతి.

"నీకున్నదీ ఒకే ఒక్క జీవితం వంశీ..."

15

నీటిధారల కింద నిలబడి ఉన్నాడు వంశీ. టైల్స్ మీద జారుతున్న నీళ్ళు లైట్ వెలుగులో మెలికలు తిరుగుతున్నాయి. నిముషాలు కరిగిపోతున్నాయి. అతని ఆలోచనలు చిక్కులు విడుతున్నాయి.

"నీకున్నదీ ఒకే ఒక్క జీవితం వంశీ.." మహతి మాటలు పదే పదే గుర్తొస్తున్నాయ్.

బాత్రూమ్ లోంచి టవల్ కట్టుకుని వచ్చి బాల్కనీలోకి నడిచాడు. ఆకాశంలో చుక్కలని చూడగానే గుర్తొచ్చే మహతి. 'జీవితం.. ఒకే ఒక్క జీవితం..' గుండెల నిండా గాలి పీల్చుకుని వదిలాడు.

గౌతమిని తలుచుకోకుండా ఉండడం, సీమతో ఒకే ఇంట్లో బతకడం కొన్నాళ్ళకి అలవాటైపోతాయా?
కోరుకున్న చదువు, ఉండాలనుకున్న ఊరు.. అలాగే జీవితంలో ప్రతీ విషయానికీ రాజీపడాలా?

నైట్ డ్రస్ లోకి మారి, కిందకి వచ్చి సోఫాలో కూర్చున్నాడు. గడియారపు ముళ్ళు నడుస్తున్నాయి.. తెల్లారేదాకా సెకన్లు గంటలై నడుస్తూనే ఉన్నాయి.

***

"Good Morning! Want to meet you before you leave." డిస్ప్లే లో నల్లటి అక్షరాలు.. వంశీ పంపిన అక్షరాలు..
"good morning! at home. why don't you drop by?"

వంశీ టెక్స్ట్ కి రిప్లై పంపే ముందు ఒక్క క్షణం ఆలోచించింది గౌతమి. కాలింగ్ బెల్ మోగేలోగా, ఆ పావుగంటలో ఫోన్ ఆటోలాక్ అవగానే మళ్ళీ అన్లాక్ చేసి చూస్తూనే ఉంది అతని టెక్స్ట్ ని..

***

"కాఫీ?" కాగుతున్న పాల మీదనుండి దృష్టి మరల్చకుండా అడిగింది గౌతమి.
"యెస్. రెయిన్ చెక్ తీసుకున్నాను కదా! మళ్ళీ వెళిపోతున్నావు కూడా.. " తేటగా నవ్వాడు.
"గుర్తుంది." పాలు కప్పుల్లో పోస్తూ క్షణకాలం ఆగి చెప్పింది. "ఈ కప్ బాగా నచ్చింది నాకు. థాంక్స్ అగైన్."

'సౌత్ పా' అని రాసున్న ఆకుపచ్చ కప్ వైపు చూసి గుర్తుపట్టినట్టు తలూపాడు.

"ఏంటి ప్లాన్?" అడిగాడు కాఫీ సిప్ చేస్తూ..

"ఎల్లుండి ఈవెనింగ్ బయలుదేరుతున్నాను."

"ఊ.."

"రేపోసారి మహతిని కలిసి బై చెప్పాలి."

"ఊ.."

"అంతే."

ఇంకొన్ని నిముషాలు నిశబ్దంగా గడిచాయి. టీపాయ్ మీద ఉన్న పేపర్ తిరగేస్తూ గడిపాడతను. కాఫీ కప్ లో మిగిలి ఉన్న కాఫీచుక్కలని దీక్షగా చూస్తూ ఆమె..

"అల్రైటీ.. గుడ్ లక్!"

ఉలిక్కిపడి చూసింది. నిలబడి తననే చూస్తున్నాడు. కళ్ళు కలిసాయి.

సన్నటి కాటుక రేఖ దిద్దిన కళ్ళు .. వాటినిండా కాల్చేసే ప్రశ్నలు. ఏమని చెప్తాడు సమాధానం? చాలారోజుల తరువాత గాలిబ్ గుర్తొచ్చాడు వంశీకి.

*ఆమె కనులు నిశబ్దమ్ములయ్యు పలుకు*

*పలుకుటగ్గని పొగయె కజ్జలము కాగ*

నిశబ్దంగా మాట్లాడే కళ్ళు . ఆ మాటల్లో అగ్నికి కాటుక పొగ.

చూపు మరల్చుకుని బయటికి నడిచాడు. లేచి గుమ్మం దాకా నడిచింది అతని వెనకే..

"ఫర్ యూ.." ఓ పేకెట్ చేతిలో పెట్టి బయటకి నడిచాడు.

విప్పి ఓ ఫోటో ఫ్రేమ్ బయటకి తీసింది. ఫ్రేమ్ లో మసగ్గా ఉన్న ఆ ఫోటో ఏంటో గౌతమికి అర్ధం కాలేదు. అటూ ఇటూ తిప్పి చూస్తూండగా మొబైల్ చప్పుడయింది.

*"That Pale Blue Dot... is the home. Will be there on it somewhere, even though you are away."*

వంశీ పంపిన టెక్స్ట్ మళ్ళీ మళ్ళీ చదువుతూండగా మెరిసింది అదేమిటో.. "Pale Blue Dot? చదివానెక్కడో!!" అనుకుంటూ గబగబా లేప్టాప్ ఆన్ చేసి గూగుల్ చేసింది. వికీ పేజ్ చదువుతూ ఉండగానే మరో టెక్స్ట్..

*"err.. Will be there on it.. thinking of you.."*
నిస్సత్తువగా కూర్చుండిపోయింది. ఆలోచిస్తూ..

***

రోజంతా అన్యమనస్కంగా, అస్తవ్యస్తంగా గడిపాడు. ఎదురుచూస్తున్న కాల్ రానే వచ్చింది. వింటున్నాడు. గౌతమి మాట్లాడడానికి ప్రయత్నిస్తోంది.

ఫోన్ పట్టుకుని నడుస్తూ నడుస్తూ ఓ చర్చి ఎదురుగా ఆగిపోయాడు. సాయంకాలపు గాలి వీస్తోంది. ఫోన్ చెవికి అతుక్కుపోతుందేమో అన్నంతగా నొక్కిపట్టాడు. మాటలు ఆగి ఆగి వినిపిస్తున్నాయి.. సందిగ్ధంగా..

"సిద్ధంగా ఉన్నాను." స్థిరంగా చెప్పాడు.
"ఐ.. లవ్ యూ.."
"మీ టూ.."

చాలా సేపు నిశబ్దాన్ని ఆస్వాదించారిద్దరూ..

"తెలుసు కదా అన్నీ.." నెమ్మదిగా అడిగాడు.
"ఊ.. "
"రేపు ఏమిటీ అనేది తెలీదు."

"విల్ వర్క్ ఇట్ ఔట్.. టుగెదర్." మెత్తగా చెప్పింది.

"ఏమైనా అడగాలంటే అడిగేసేయ్" రవ్వంత గిల్ట్ ధ్వనించిందతని గొంతులో

"ఇట్స్ ఓవర్ దేర్... కదా?"

"యెస్.. ఫర్ మీ ఇట్స్ ఓవర్ "

"ఏమైనా చెప్పాలనుకుంటే చెప్పేసేయ్. నాకేం ప్రశ్నలు లేవు." స్పష్టంగా చెప్పిందామె.

"ప్రపంచం దృష్టిలో క్రైమ్ ఇది."

"మనం మొదటివాళ్ళం కాదు వంశీ.."

కొత్త గౌతమి కనిపిస్తోందతనికి. 'నా మనశ్శాంతి నాకు ముఖ్యం!' అని ఉద్యోగం వదిలేసిన అమ్మాయేనా అని ఆశ్చర్యపోతున్నాడు.

"హేయ్.. యూ ఆర్ నాట్ కిడింగ్ మీ.. కదా?" అపనమ్మకంగా అడిగాడు.

"షటప్.."

"ఏం చెప్పాలో తెలియడం లేదు. చాలా మాట్లాడాలి. నా జీవితం.. నా సొంత జీవితం నా చేతుల్లో లేదు. కనబడని సంకెళ్ళు వేసేసుకున్నాను. ఇప్పుడవి తెంచుకోవాలనుకున్నా తెంచుకోలేనివి.. నాకు ఇష్టమై కాదు. అదీ ఐరనీ. అలా అని గాల్లో దీపం పెట్టి చేతులు ముడుచుకుని.. "

"వంశీ.." మధ్యలో ఆపేసిందతని మాటలని..

"చెప్పు.."

"మహతి కి ఆనంద్ కనిపించినట్టే.. నీకు నేను. ఒక్కటే తేడా.."

"ఐ గాట్ స్టకప్ ఇన్ ద హిందూ మేరేజ్ సిస్టమ్."

గౌతమి మౌనంగా ఉండిపోయింది. అతని మనసు అర్థమై ఆమె మనసు మెలిపడింది.

"చూద్దాం ఏమవుతుందో! వీ నెవర్ నో."

"ఏమో.. గుర్రమెగరావచ్చు." అతని నవ్వులో బాధ జీర.

"వంశీకి రెక్కలు రానూ వచ్చు." చెప్పింది నమ్మకంగా..

"ఫింగర్స్ క్రాస్ డ్.." నవ్వాడు.

"సిస్టమ్ ని తప్పు పట్టను గౌతమీ.." చెప్పాడు తనే.

"ఊఁ.."

"మనకే పెళ్ళైతే, ప్రపంచంలో ఎవరూ మనని విడదీయలేరు కదా!" నిరాశగా ఉందతని గొంతు.

"నిజమే.. పెళ్ళి చెడ్డది కాదు. ఆ దొరికినవారు సరైన వారవడం, సరైన పర్సన్ దొరకడం.. దటీజ్ ప్యూర్ లక్!" నిట్టూర్చాడు.

"ఇంతకీ ఏవిటా అలుక్కుపోయిన ఫోటో! తమరు తీసారా?" టాపిక్ మారుస్తూ అల్లరిగా నవ్వింది.

"ఊఁ.. ఊఁ.. ఫోటోగ్రాఫర్ కి ఇస్తున్న గిఫ్ట్ కదా! ఏదో ప్రయోగం." నవ్వు దాచుకున్నాడు.

"బేడ్.. యూ సక్ ఎట్ ఫోటోగ్రఫీ"

"నేర్చుకో.. నేర్చుకో.." కవ్వించాడు.

కబుర్లు సంతోషంగా దొర్లిపోతున్నాయి. ఉన్నట్టుండీ చెప్పాడు.

"గౌతమీ.."

"ఊఁ.."

"లవ్ యూ.."

క్షణకాలపు నిశబ్దం తరువాత వినిపించామె గొంతు. స్థిరంగా.. మృదువుగా..

"వంశీ.. అన్నిటికీ.. ఎప్పటికీ.. నీతోనే.."

***

*వో అఫ్సానా.. జిసే అంజామ్ తక్ లానా, నహో ముమ్కిన్..*
*ఉసే ఏక్ ఖూబ్ సూరత్ మోడ్ దే కర్, తోడ్ నా హి బెహ్ తర్..*

అయిపోయింది

ఆకాశమంత ప్రేమతో,

'మహతి'కి..